


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 335 | గురువారం | 06-11-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


ట్రంప్‌కు షాక్!

## జోహ్రాన్‌కు జై కొట్టిన న్యూయార్క్



- మేయర్‌గా మమ్దానీ అద్భుత విజయం
- 37 ఏళ్లకే వరించిన పదవి
- బిలియనీర్ల కోటలో సోషలిస్టు గెలుపు
- డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా జయకేతనం
- ముస్లిం, భారతీయ మూలాలున్న తొలి మేయర్‌గా రికార్డు


**న్యూయార్క్:** అమెరికా దేశంలో అతి పెద్ద నగరం, బిలియనీర్ల స్వర్గధామంగా పిలువబడే న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో సోషలిస్టు భావాలు కలిగిన డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ చరిత్రాత్మక విజయం సాధించారు. ఈ పదవి చేపట్టనున్న తొలి ముస్లిం, భారతీయ మూలాలు కలిగిన, అతి పిన్నవయస్కుని(37 ఏళ్ళు)గా ఆయన గణుతికెక్కనున్నారు. మమ్దానీని కమ్యూనిస్టు పిచ్చోడని, ఆయన గెలిస్తే న్యూయార్క్ నిధులు కత్తిరాస్తానన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వెరవకుండా ఓటర్లు ఆయనకు పట్టం గట్టారు. సామాన్యులను మతం, జాతీయవాదం వలసలు పేరుతో విభజిస్తూ, ఆర్థిక కష్టాలతో సతమతం చేస్తున్న ట్రంప్ విధానాలకు ఇదొక చెక్ లాంటిదని అమెరికన్ వాసులు భావిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఇంటి అద్దెల నియంత్రణ, ప్రభుత్వ నిధులతో చౌక ఇళ్ళు, నగరపాలిక ఆధ్వర్యంలో చౌక ధరలకే గ్రోసరీ షాపుల ఏర్పాటు, పిల్లలకు ఉచిత సంరక్షణ వంటి మౌలికమైన వాగ్దానాలు చేసి న్యూయార్క్ ఓటర్ల అభిమానాన్ని చూరగొన్నారు. సొంత పార్టీలోనే వ్యతిరేకులను అధిగమించి, ఆయన సంచలన విజయం సాధించారు. న్యూయార్క్‌లో ఎన్నికల ప్రక్రియ యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించింది. దీంతో డెమోక్రటిక్‌పార్టీలో, ఆయన అభిమానులలో సర్వత్రా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. అతి చిన్న వయసులో మేయర్ పదవి ఆయనను వరించింది. నిలువెల్లా సోషలిస్టు భావజాలాన్ని నింపుకున్న మమ్దానీ 2026 జనవరి 1వ తేదీన న్యూయార్క్ 111వ మేయర్‌గా పదవీ బాధ్యతలు తీసుకుంటారు. ప్రైమరీలో డెమోక్రాట్ల తరపున సీటు పొందలేక స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆండ్రూ క్వోమో 40 శాతం ఓట్లు పొందారు. స్లివా కేవలం ఏడూశాతం ఓట్లు పొందారు. దీంతో ఆయన గడచిన 100 సంవత్సరాలలో అతిపెద్ద న్యూయార్క్ నగర మేయర్ బాధ్యతలు చేపట్టిన అతి పిన్నవయస్కుడవుతారు. అంతేకాకుండా న్యూయార్క్ మేయర్ బాధ్యతలు చేపట్టిన మొదటి ముస్లింగా కూడా ఆయన రికార్డుల్లోకి ఎక్కుతారు. న్యూయార్క్‌లో ఇక మీదట ఇళ్ళ అద్దెలు గణనీయంగా తగ్గుతాయని, వాటికి కళ్ళెం వేసేవిధంగా మమ్దానీ విధాన నిర్ణయం తీసుకుంటారని, జీవన వ్యయాలు కూడా ఇక ప్రజలకు అనుకూలంగా ఉంటాయని అందరూ ఆశగా ఆయన ప్రమాణస్వీకారం కోసం తరువాయి 2లో

## హర్యానాలో నకిలీ ఓట్లు 25 లక్షలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్నికల కమిషన్ భారత ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు రూపొందించిన 'క్రమబద్ధమైన ఓటు చోరీ' పద్ధతిని బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో కూడా అమలు చేస్తాయి. హర్యానాలో 'ఓట్ల దొంగతనానికి ఎవరు బాధ్యులో చాలా స్పష్టంగా తెలుస్తోంది. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవకుండా చూసుకోవడానికి ఈ పెద్దమనుషులు బిజెపితో కుమ్మక్కయ్యారు.

### ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 8 మంది ఓటర్లలో ఒకరు నకిలీ

- బ్రెజిలియన్ మోడల్ ఫొటోతో 22 ఓట్లు
- సీమా, స్వీటీ, సరస్వతి వంటి వేర్వేరు పేర్లతో ఓటర్ జాబితాలో చోటు
- కాంగ్రెస్ అఖండ విజయానికి 'ఆపరేషన్ సర్కార్' చోరీకి పాల్పడ్డ పోల్ ప్యానెల్
- బిజెపితో ఎన్నికల కమిషన్ కుమ్మక్కు
- ఓట్ల దొంగను కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న ఇసి






బ్రెజిలియన్ మోడల్

**న్యూఢిల్లీ :** ఎన్నికల దొంగతనంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి ధ్వజమెత్తరు. ఎన్నికల కమిషన్‌పై దుమ్మెత్తి పోశారు. ఓట్ల దొంగలను ఇసి కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుందని ఆరోపించారు. గత సంవత్సరం జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల ఓట్లు నకిలీవేనన్నారు. ఎన్నికల కమిషన్ బిజెపితో కుమ్మక్కయ్యిందని ఎన్నికల జాబితా డేటాను ఉటంకిస్తూ కాంగ్రెస్ రాహుల్ గాంధీ మండిపడ్డారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాయ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 10 బూత్‌లలో బ్రెజిలియన్ మోడల్‌కు కూడా 22 ఓట్లు ఉన్నాయని, ఆమె ఫొటోను ఉపయోగించి సీమా, స్వీటీ, సరస్వతి వంటి వేర్వేరు పేర్లతో ఓటు కల్పించారని బుధవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. హర్యానాలో తమ పార్టీ సాధించిన అఖండ విజయాన్ని ఆ రాష్ట్రంలో తరువాయి 2లో

## తననుంచి కేసును తప్పించేందుకు కేంద్రం యత్నం

సుప్రీం కోర్టు సిజెఐ తీవ్ర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఇప్పటికే చివరి దశలో విచారణలో ఉన్న కేసును ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలనే కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తిని గవాయ్ తప్పుబట్టారు. ట్రిబ్యునళ్ళ సంస్కరణల చట్టం – 2021 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విషయంలో తెరపైకి వచ్చింది. వాదనలు పూర్తయిన తరువాత కేసుపై విస్తృత ధర్మాసనం విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం కోరడం పట్ల గవాయి తీవ్ర వ్యాఖ్యలే చేశారు. ఇది కేసును తప్పించుకునే ఎత్తుగడనే అని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంతో భారత అత్యున్నత న్యాయస్థానంపై న్యాయ స్వాతంత్ర్యం, కార్యనిర్వాహక ప్రభావం గురించి గతంలో జరిగిన ఇబ్బందికర చర్చ మళ్ళీ మొదలైంది. ట్రిబ్యునల్ సంస్కరణల చట్టం రాజ్యాంగ చెల్లుబాటుకు సంబంధించిన కేసులో క్వాసీ జ్యుడీషియల్ సంస్థలలో నియామకాలు, తరువాయి 12లో



## యూనిఫైడ్ నేపాల్ కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావం

ఎన్నికల వేళ తొమ్మిది వామపక్షాలు విలీనం

మరిన్ని లెఫ్ట్‌పార్టీలతో చర్చలు తుదిదశకు : ప్రచండ

**కాఠ్మండు:** నేపాల్‌లో తొమ్మిది వామపక్షాలు విలీనమై నేపాల్ కమ్యూనిస్టు పార్టీగా ఆవిర్భవించాయి. సిపిఎన్ (మావోయిస్టు సెంటర్), సిపిఎన్ (యూనిఫైడ్ సోషలిస్ట్) పార్టీలతో పాటు మరో ఏడు పార్టీలు విలీనమై ఏకపార్టీగా ఆవిర్భవించాయి. మాజీ ప్రధానమంత్రి, సిపిఎన్ (మావోయిస్టు సెంటర్) అధ్యక్షుడు పుష్పకమల్ దహల్ (ప్రచండ) నాయకత్వంలో ఆవిర్భవించిన ఈ పార్టీకి 'యూనిఫైడ్ నేపాల్ కమ్యూనిస్టు పార్టీ' (యుఎన్‌సిపి)గా నామకరణం చేసినట్లు నేపాల్ పత్రికలు ప్రకటించాయి. సిపిఎన్ (మావోయిస్టు సెంటర్)కు ఛైర్మన్‌గా వ్యవహరించిన పుష్పకమల్ దహల్ ఈ కొత్త పార్టీకి సమన్వయకర్తగా పనిచేస్తారు. దహల్ తర్వాత పార్టీలో రెండోస్థానంలో మాధవ్‌కుమార్ నేపాల్ (యూనిఫైడ్ సోషలిస్ట్‌పార్టీ నాయకుడు) కో–కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. ఝూలానాథ్ ఖనల్ తరువాయి 12లో

## బిఆర్‌ఎస్ పేరుతో బిజెపి ఓట్లు

- కాషాయ పార్టీలో గులాబీని విలీనంచేసే యత్నాలు సాగుతున్నాయ్
- కాళేశ్వరంపై మాజీ సిఎం కెసిఆర్‌పై సిబిఐ విచారణకు మోదీ ప్రభుత్వం అనుమతించడంలేదు
- జూబ్లీహిల్స్‌లో సమస్యలకు కిషన్‌రెడ్డి కారణం
- ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఎన్నికల నుంచి బిజెపి తప్పుకున్నదని, బిఆర్‌ఎస్ పేరుతో ఓట్లు అడుగుతున్నదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. బిజెపిలో బిఆర్‌ఎస్‌ను విలీనం చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని, గతంలో మోదీ ప్రభుత్వానికి ప్రతి అంశంలో బిఆర్‌ఎస్ మద్దతునిచ్చిందని, ప్రస్తుతం కాళేశ్వరం అవినీతి విషయంలో మాజీ సిఎం కెసిఆర్‌పైన సిబిఐ విచారణకు మోదీ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం సిట్టింగ్ ఎంపిగా ఉన్న కిషన్‌రెడ్డికి తరువాయి 2లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టులు మృతి

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లాలో గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. వివరాల ప్రకారం బీజాపూర్ జిల్లాలోని తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో గల అన్నారం–మరిమల్ల అడవుల్లో మావోయిస్టుల సంచారం ఉందనే పక్కా సమాచారం మేరకు భద్రతా బలగాలు తెల్లవారు జాము నుండే ముమ్మర కూంబింగ్ ఆపరేషన్ మొదలు పెట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో లొంగిపోవాలని హెచ్చరించినప్పటికీ మావోయిస్టుల వైపు నుండి కాల్పులు తరువాయి 2లో

## ప్రయాణికులపైకి ట్రైన్

రైల్వే లైన్ దాటుతుండగా ఢీకొట్టిన నేతాజీ ఎక్స్‌ప్రెస్

ఆరుగురు ప్రయాణికులు మృతి

ఉత్తరప్రదేశ్‌లోని చునార్ రైల్వే స్టేషన్‌లో ఘటన



**మీర్జాపూర్/బిలాస్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జరిగిన రైలు ప్రమాదం ఘటన మరవకముందే బుధవారం ఉత్తర ప్రదేశ్‌లో మరో ప్రమాదం సంభవించింది. చునార్ రైల్వే స్టేషన్‌లో చోపాన్ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగుతున్న ప్రయాణికులను నేతాజీ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు చనిపోయిటనట్లు రైల్వే అధికారులు తెలిపారు. కార్తీక పౌర్ణమి నేపథ్యంలో గంగా స్నానాలు ఆచరించడానికి వెళ్తున్నారన్నారు. ఘటన బుధవారం 9:30 గంటల సమయంలో జరిగింది. చూనార్ రైల్వే స్టేషన్‌లోని నాలుగో ప్లాట్‌ఫాం వద్ద చోపాన్–ప్రయాగ్ రాజ్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ వచ్చి ఆగింది. ప్రయాణికులు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. అక్కడి నుంచి ఎదురుగా ఉన్న మరో ప్లాట్‌ఫాంపైకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ట్రాక్‌పై ఎదురుగా వస్తున్న హౌరా నుంచి కల్కా వెళ్లే నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు మృతి తరువాయి 12లో

## నేడే బిహార్ దంగల్



- తొలి సమరానికి రంగం సిద్ధం
- 1,314 మంది అభ్యర్థులు : 3.75కోట్ల మంది ఓటర్లు
- బిహార్‌లో మొదటి విడతగా 121 నియోజకవర్గాలకు నేడు పోలింగ్

**పాట్నా :** బిహార్ తొలి విడత సమరానికి రంగం సిద్ధమైంది. 243 స్థానాలకుగాను తొలి దశలో 121 నియోజకవర్గాలకు గురువారం ఓటింగ్ జరగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. అధికారం నిలబెట్టుకోవాలని పావులు కదుపుతున్న బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ, మళ్లీ సిఎం పీఠం దక్కించుకోవాలని సర్వశక్తులు ఒడ్డుతున్న ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్బంధన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. అయితే రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సారథ్యంలోని జనసురాజ్ పార్టీ తొలిసారి బిహార్ బరిలో దిగింది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభావంపై ఉత్కంఠ నెలకొంది. బిహార్ 243 నియోజకవర్గాలు ఉండగా 18 జిల్లాల పరిధిలోని 121 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న ఓటింగ్, సాయంత్రం 6గంటలకు ముగియనుంది. భద్రతా కారణాలతో సిమ్రిబఖ్తియార్‌పుర్, మహిషి, తారాపుర్, ముంగర్, జమల్‌పుర్, సూర్యగర్హ నియోజకవర్గంలోని 56 పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ సాయంత్రం 5 గంటలకే ముగియనుంది. తొలి విడతలో 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 3.75కోట్ల మంది బిహారీలు వారి భవితవ్యాన్ని తేల్చనున్నారు. అందులో తరువాయి 2లో






# ప్రపంచం
WORLD NEWS

## భారత సంతతికి చెందిన పురేవాల్ సిన్సినాటి మేయర్‌గా తిరిగి ఎన్నిక

**న్యూయార్క్ :** భారత సంతతికి చెందిన పురేవాల్ (43) అమెరికా ఒహియో రాష్ట్రం సిన్సినాటి మేయర్‌గా మరోసారి విజయం సాధించారు. పురేవాల్ భారత్ పంజాబ్‌కు చెందిన సంతతివారు. 1992లో అమెరికాలోని ఒహియోలో జన్మించి అక్కడే విద్యాభ్యాసం పూర్తిచేశారు. డెమోక్రటిక్‌పార్టీ తరఫున 2021లో సిన్సినాటిఇ మేయర్‌గా గెలిచిన పురేవాల్ మంగళవారం జరిగిన ఎన్నికల్లో రెండోసారి కూడా విజయభేరీ మోగించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌కు పురేవాల్ సవతి సోదరుడు. ఆయన గతంలో అమెరికా అటార్నీకి స్పెషల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. మొదటిసారి ఆయన 66 శాతం ఓట్లతో మేయర్ పదవి గెలుచుకున్నారు. పురేవాల్ తల్లి టిబెట్‌కు చెందినవారు. బాల్యంలో అక్కడ నుండి భారత్‌లో ఉన్న శరణార్థ శిబిరానికి వచ్చి తలదాచుకున్నారు. పురేవాల్ తండ్రి పంజాబీ. 2015లో పురేవాల్ తన రాజకీయ జీవితం ప్రారంభించారు. హామిల్టన్ కోర్టులో ఒక క్లర్కుగా జీవితం ప్రారంభించారు.

# అమెరికా ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయభేరి



**వాషింగ్టన్:** అమెరికాలో జరిగిన కీలకమైన ఎన్నికల్లో డెమోక్రాట్లు విజయభేరి మోగించారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో గడచిన 50 ఏళ్ళలో ఎన్నడూలేని విధంగా 20 లక్షలమంది ఓటర్లు భారీ ఎత్తున పోలింగ్ ప్రక్రియలో పాల్గొని రికార్డు సృష్టించారు. దీనిని న్యూయార్క్ మేయర్ అభ్యర్థి మమ్దానీ మహిమగా డెమోక్రాట్లు పేర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో మూడు ముఖ్యమైన పదవులను డెమోక్రాట్లు చేజిక్కించుకున్నారు. న్యూయార్క్ మేయర్ పదవి, న్యూజెర్సీ గవర్నర్ పదవి, విర్జీనియా గవర్నర్ పదవిని గెలుచుకోవడమే కాకుం డా, పెన్సిల్వేనియో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో డెమోక్రాట్లకు ఉన్న 5–2 మెజారిటీని వారు కోల్పోకుండా ఓటర్లు తిరిగి నిలబెట్టారు. మరీ ముఖ్యంగా కాలిఫోర్నియాలో జిల్లాలు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రతిపక్ష డెమోక్రాట్లు చేసిన ప్రతిపాదనలను, వారి ఆలోచనలను సమర్థిస్తూ ప్రజలు ఓట్లు వేశారు. తద్వారా ట్రంప్ ఆలోచనా ధోరణిని కాలిఫోర్నియా ప్రజలు తిరస్కరించారు. ఇక కాలిఫోర్నియా రాష్ట్ర ముఖచిత్రం డెమోక్రాట్ల ప్రణాళిక ప్రకారం మారిపోయేందుకు సిద్ధం అవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన ఈ ప్రజాభిప్రాయంలో ఓటర్లు జిల్లాల పునర్విభజనను డెమోక్రాట్లు ప్రతిపాదించిన విధంగా 'ప్రపోజిషన్ 50 ప్రణాళికకు ఆమోదం ఇచ్చారు. దేశ అత్యున్నత దిగువసభను చేజిక్కించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో భాగంగా కాలిఫోర్నియాలో డెమోక్రాట్లు పైచేయి సాధించారు.


మమ్దానీ న్యూయార్క్‌కు తొలి ముస్లిం మేయర్‌గా పదవీ బాధ్యతలు తీసుకోబోతుండగా, స్పాన్‌బెర్గర్ వర్జీనియా తొలి మహిళా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు. మికీ షెరిల్ న్యూజెర్సీ గవర్నర్ పదవి చేపట్టబోతున్నారు. వీరంతా వచ్చే ఏడాది జనవరి 20వ తేదీన పదవీ బాధ్యతలు తీసుకుంటారు. అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన 10 నెలల కాలంలోనే ప్రజల్లో ఆయన పాలనపట్ల ఏవగింపు కలిగింపు కలిగిందని ఈ ఎన్నికల్లో ఘన విజయం ద్వారా డెమోక్రాట్లు రుజువు చేశారు. న్యూయార్క్ మేయర్ పదవికి అందరూ అనుకున్నవిధంగానే జోహ్రాన్ మమ్దానీ ఘన విజయం సాధించారు. న్యూజెర్సీ గవర్నర్ పదవికి జరిగిన ఎన్నికల్లో రెబక్కా మికీ షెరిల్ (53)విజయం సాధించారు. అలెగ్జాండ్రియాలో 1972లో జన్మించిన మికీ షెరిల్, రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా తరపున వైమానికదళ పైలెట్‌గా పనిచేసిన తన తాతను స్ఫూర్తిగా తీసుకుని ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. చిన్న వయసులోనే ఆమె పైలట్‌గా పనిచేశారు. తర్వాత లా డిగ్రీ చేశారు. 2018లో న్యూజెర్సీ 11వ జిల్లా నుండి అమెరికా దిగువసభ సభ్యురాలుగా ఎన్నికయ్యారు. ఇక వర్జీనియా రాష్ట్ర గవర్నర్‌గా డెమోక్రాట్ల అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బెర్గర్ (46) విజయం సాధించారు. ఆమె 2019 నుండీ 2025 వరకూ వర్జీనియా ఏడవజిల్లా నుండి దిగువసభ సభ్యురాలుగా ప్రాతినిధ్యం వహించారు.

**మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఎదురీత?**

ఇదిలా ఉండగా, వచ్చే ఏడాది నవంబరు 3వ తేదీన అమెరికాలో జరిగే మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు కష్టాలు ఎదురవుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే డెమోక్రాట్లు ట్రంప్‌కు హెచ్చరికలు కూడా చేశారు. వచ్చే ఏడాది సెనేట్‌లో 35 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ప్రతినిధుల సభలో 435 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం రిపబ్లికన్లు ఇటు దిగువసభను, అటు ఎగువసభను తమ నియంత్రణలో ఉంచుకున్నారు. ఒకవేళ వచ్చే ఎన్నికల్లో డెమోక్రాట్లు పైచేయి సాధిస్తే ఇక రాబోయే రెండేళ్ళూ ట్రంప్ బిల్లులను ఆమోదించుకోవడానికి నానాపాట్లూ పడాల్సి వస్తుంది.

# ఇది ట్రంప్ ఓటమికి బాట

### మమ్దానీ ప్రత్యక్ష హెచ్చరిక
### వలస ప్రజల కేంద్రంగా న్యూయార్క్ నగరం



**వాషింగ్టన్:** న్యూయార్క్ మేయర్‌గా ఘన విజయం సాధించిన మమ్దానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు నేరుగా హెచ్చరిక చేశారు. ''మిమ్మల్ని మీరు సరిదిద్దుకోండి'' అని హెచ్చరించారు. ఎన్నికల్లో విజ యం సాధించిన తర్వాత అభిమానుల సమక్షంలో ఆయన తొలి సందేశం ఇస్తూ డోనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ''మీరు నన్ను చూస్తున్నారని (ఎలక్ట్రానిక్ ప్రసార మార్గాల్లో) నాకు తెలుసు, అందుకే చెబుతున్నాను, మిమ్మల్ని మీరు సరిదిద్దుకోండి'' అని హెచ్చరించారు. అభిమానులతో మాట్లాడుతూ.. ఈ విజయం ట్రంప్ ఓటమికి బాటలు పరిచిందన్నారు. న్యూయార్క్ నగరం ఇక వలస ప్రజలకు నిలయంగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. న్యూయార్క్ నగరంలో ఇక అద్దెలను క్రమబద్ధీకరిస్తామని చెప్పా రు. ట్రంప్ వలస విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆయన ఎన్నికల్లో ప్రచారం చేసిన విషయం తెలిసిందే. అవినీతి సంస్కృతికి అంతం పలుకుతానని న్యూయార్క్ ప్రజలకు భరోసా ఇచ్చారు. రాజకీయ అంధకారం నుండి న్యూయార్క్ సిటీ బయట పడిందని, న్యూయార్క్ నగరంలో వెలుగులు విరబూశాయని అన్నారు. ఒక మార్పుకు, కొత్త తరహా రాజకీయాలకు మీరు ఓటు వేశారని ఆయన ఓటర్లను అభినందించారు. ఈ విజయం న్యూయార్క్‌లో కొత్త ఉషోదయానికి, నవ శకానికి నాంది అన్నారు. తన తల్లితండ్రులకు కృతజ్ఞతలు చెప్పారు.

**జవహర్‌లాల్‌నెహ్రూ ప్రసంగాన్ని ఉటంకించిన మమ్దానీ**

ఎన్నికల్లో గెలిచిన తర్వాత మమ్దానీ అభిమానులను ఉద్దేశించి తొలి సందేశం ఇస్తూ జవహర్‌లాల్ నెహ్రూ పేరును ఉటంకించారు. చరిత్రలో పాతదనం నుండి కొత్త దనంలోకి ప్రవేశించే సమయం వస్తుందని అన్నారు. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత 1947 ఆగస్టు 15వ తేదీ అర్థరాత్రి నెహ్రూ ప్రసంగాన్ని మమ్దానీ ప్రధానంగా ప్రస్తావించారు. నెహ్రూ ఆనాడు 1600 పదాలతో ఒక ప్రసంగం చేశారు. ఈ ప్రసంగాన్ని ఈ విధంగా ఉటంకించడం అమెరికాలో ఒక కొత్త విషయం. భారత దేశానికి పునర్జన్మను ఇచ్చేందుకు భారత జాతిని మేల్కొలిపేందుకు నెహ్రూ తన ప్రసంగంలో అనేక విషయాలు ఆనాడు చెప్పారు. మమ్దానీ తన ప్రచార పర్వంలో మొదటి నుండీ బాలీవుడ్‌ను తన ప్రచారభాషగా మార్చారు. ఆయన ప్రసంగం పూర్తయిన తర్వాత ధూమ్ చిత్రంలో టైటిల్ సాంగ్ ఆ ప్రాంతంలో ప్రతిధ్వనించింది. ఇప్పుడు తాజాగా విజయం సాధించిన తర్వాత దశాబ్దాల క్రితంనాటి నెహ్రూ ప్రసంగాన్ని ముందుకు తీసుకురావడం ఆయన ప్రచారపర్వంలో ఒక విజృంభణ. నెహ్రూ ప్రసంగాన్ని ఇష్టపడి ఆదర్శంగా తీసుకున్న మమ్దానీ ఆ ప్రసంగాన్ని ఉటంకించడం అమెరికాలో ప్రధానంగా ఒక సరికొత్త విషయం కాగా, ఏదో కల నెరవేరిందని, తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న భావన ఆయన అభిమానులలో దీనివల్ల బలంగా వేళ్ళూనుకుంది.

# ఫిలిప్పీన్స్‌లో తుఫాను: 90 మంది మృతి

### కొట్టుకుపోయిన కార్లు, కంటైనర్లు

**మనీలా:** ఆగ్నేయ ఆసియా దేశం ఫిలిప్పీన్స్‌ను 'కల్మెగీ' తుఫాను అతలాకుతలం చేసింది. ఈ తీవ్ర తుఫాను, వరదల కారణంగా 90 మంది మరణించారు. వేలాదిమంది తుఫాను బారినపడ్డారు. దేశ మధ్యప్రాంతం సెబు, ఈస్టర్న్ సమర్, గుయిమరస్, బొహోల్, పలవన్ రాష్ట్రాలలో తీవ్ర ప్రభావం చూపించి విధ్వంసం సృష్టించిన తుఫాను అనంతరం వియత్నాంవైపు దూసుకుపోయింది. తుఫాను తీవ్రతవల్ల సెబు ప్రాంతంలో ఎక్కువమంది మరణించారు. 'కల్మెగీ' తుఫాను వల్ల కేవలం 24 గంటల వ్యవధిలో సెబూలో 183 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తుఫాను ప్రభావం వల్ల ఇటీవలికాలంలో ఎన్నడూ లేనంతగా సెబూ ప్రాం తం వరద ముంపునకు గురైంది. ప్రధాన నగరాలు, పట్టణాలు నీట మునిగాయి. కార్లు కొట్టుకుపోయాయి. చివరకు షిప్పింగ్ కంటైనర్లు కూడా ఎటువైపు కొట్టుకుపోయాయో జాడతెలియని పరిస్థితి దాపురించింది. ఐతే తుఫాను హెచ్చరిక రాగానే ముందు జాగ్రత్తగా 4,00, 0000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినప్పటికీ భారీగా మరణాలు సంభవించాయి. మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతూ 90కి చేరింది. తుఫాను తీవ్రత, నష్టం కారణంగా పలు కోస్తా ప్రాంతాలలో సహాయ చర్యలను నిలిపివేశారు. ప్రతి సంవత్సరం దాదాపు 20కిపైగా తుఫానులు ఫిలిప్పీన్స్‌ను భయపెట్టి నష్టం కలిగిస్తూ ఉంటాయి. తుఫానులు ప్రతి ఏటా బీభత్సం సృష్టించే కోస్తా ప్రాంతాలలో లక్షలమంది తీవ్ర పేదరికంలోనే జీవనం సాగిస్తున్నారు.

వందలసంఖ్యలో ఇళ్ళు ధ్వంసమయ్యాయి. సెబూ రాస్ర్టంలో అనూహ్యమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. పట్టణాలు, నగరాల్లో ప్రజలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఇళ్ళ పైకప్పులపైకి ఎక్కి కూర్చున్నారు. హెలికాప్టర్లు, పడవల ద్వారా తర్వాత వారికి సహాయం చేసి అన్ని సదుపాయాలు సమకూర్చారు. రెండు రోజులుగా తుఫాను వణికించడంతో సహా య బృందాలు కూడా ఏమీ చేయలేని పరిస్థితులు సంభవించాయి. గంటకు 180 కి.మీ వేగంగా గాలులు వీయడం వల్ల నిస్సహాయంగా ఉండిపోయినట్లు సంబంధిత అధికారులు చెప్పారు. తుఫాను అనంతరం సెబూ రాష్ట్ర రాజధాని నగరం లిలోన్‌లోని మెట్రో ప్రాంతంలో వరద నీటి నుండి 40 మృతదేహాలను వెలికితీసి స్వాధీనం చేసుకున్నట్లు సెబూ అధికార ప్రతినిధి రోస్ రామోస్ చెప్పారు. సెబూలో గతంలో ఎన్నడూ లేనంతగా అసాధారణమైన పరిస్థితి నెలకుందని ఆ రాష్ట్ర గవర్నర్ పమేలా బారికువాట్రో చెప్పారు.

# వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా హైదరాబాదీ హష్మి



**న్యూయార్క్:** వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన గజాలా హష్మి (61)గెలిచారు. డెమోక్రటిక్‌పార్టీ నుండి దక్షిణాసియాకు చెందిన అభ్యర్థులలో భారత సంతతికి చెందిన ముస్లిం మహిళ గజాలా హష్మి. వర్జీనియా సెనేట్‌లో (15వ జిల్లాకు ప్రాతినిధ్యం) వహిస్తారు. 2020లోనే దక్షిణాసియాకు చెందిన తొలి మహిళగా, సెనేట్‌కు గెలిచి తొలి ముస్లింగా ఆమె ప్రమాణస్వీకారం చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆమెకు 1,465,634 ఓట్లు (54.2 శాతం) లభించాయి. ఆమె 1964లో హైదరాబాద్‌లో జన్మించారు. మలక్‌పేటలో తన అమ్మమ్మగారి ఇంట్లో నివసించారు. ఆమె తాతగారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థికశాఖలో పనిచేశారు. 1969లో ఆమె కుటుంబం అమెరికాకు వెళ్ళి వర్జీనియాలో స్థిరపడింది. అక్కడే హష్మి విద్యాభ్యాసం చేశారు. ఆమె 25 ఏళ్ళు విద్యారంగంలో పనిచేశారు. రిచ్మండ్ విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఇంకా పలు విశ్వవిద్యాలయాలలో ఆమె పనిచేశారు. 2019లో 10వ సెనేట్ జిల్లాకు జరిగిన ఎన్నికల్లో గెలిచారు.



# బిఆర్‌ఎస్ పేరుతో బిజెపి ఓట్లు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన బిజెపినే కారణమని దుయ్యబట్టారు. ఉప ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్‌ను గెలిపించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్‌లోని పలు ప్రాంతాల్లో సిఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు గడ్డం వివేక్, కొండా సురేఖ, అజారుద్దీన్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎంఐఎం కౌసర్ మొయినుద్దీన్, జూబ్లీ హిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. షేక్ పేట డివిజన్ పారా మౌంట్ కాలనీ, వెంకటగిరి వాటర్ ట్యాంకు నుంచి కృష్ణా నగర్ బి బ్లాక్ మీదుగా యూసుఫ్ గూడ చెక్ పోస్ట్ వరకు రోడ్ షో జరిగింది. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కెసిఆర్, మోదీ ఒవైపు నిలబడితే, మరో వైపు తాను, రాహుల్ గాంధీ నిలబడ్డామన్నారు.2007లో పిజెఆర్ గుండెపోటుతో, ఆ తర్వాత వచ్చిన ఉప ఎన్నికల్లో పిజెఆర్ కుటుంబానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిస్తే, ఆ సమయంలో కెసిఆర్ మద్దతు ఇవ్వలేదని, సెంటిమెంట్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఉప ఎన్నికలకు నాంది పలికిందే కెసిఆర్ అని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అలాంటిది కెసిఆర్ కుమారుడు ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో సెంటిమెంట్ రాజకీయాలతో ఓటు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. పిజెఆర్ విగ్రహానికి బిఆర్‌ఎస్ నేతలకు ముక్కునేలకు రాయాలని, ఆ తరువాతనే జూబ్లీహిల్స్‌లో ఓట్లు అడగాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో తమ ఎంఎల్‌ఎ లేకపోయినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం రూ. 400 కోట్లను కేటాయించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే, జూబ్లీహిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని, నియోజకవర్గ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. పదేళ్ల కాలంలో కెసిఆర్ ప్రభుత్వం ప్రజలకు కనీసం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, సన్న బియ్యం సరఫరా చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాతనే కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశామని, పేదలకు సన్నబియ్యం సరపరా చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలీండ్‌ను సరఫరా చేస్తున్నామని సిఎం వివరించారు. రానున్న రోజుల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నాలుగువేల డబుల్ బెడ్‌రూములను ఇస్తామన్నారు.

**అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి ఎందుకు ఇబ్బంది?**

అజారుద్దీన్‌ను రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పిస్తే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎందుకు ఇబ్బంది అవుతుందని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు . ముస్లింల వాటాలో భాగంగానే వారికి మంత్రి పదవి దక్కిందని, ముస్లింల వాటాను ముస్లింలకు ఇస్తే ఎందుకు ఇబ్బందిపడుతున్నారని అన్నారు.మోదీ, గుజరాత్ , కిషన్ రెడ్డి ఆస్తులను తాము మైనార్టీలకు ఇవ్వడం లేదని, మైనార్టీల వాటాను మాత్రమే వారికి ఇస్తున్నామన్నారు. కేంద్ర మంత్రిగా ప్రధాని మోదీతో మాట్లాడి హైదరాబాదంలోని మూసి ప్రాజెక్టుకు నిధులను ఎందుకు తీసుకురావడం లేదని, ఆర్‌ఆర్‌ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణానికి ఎందుకు అడ్డుపడుతున్నారని సిఎం నిలదీశారు.

# జోహ్రాన్‌కు జై కొట్టిన న్యూయార్క్

(మొదటి పేజీ తరువాయి)

ఎదురుచూస్తున్నారు. దేశంలో ముస్లింలు మతపరమైన గుర్తింపు పొందడంలో ఇప్పటి వరకూ ఎదురవుతున్న సమస్యలన్నింటినీ ఈ ఎన్నికల ద్వారా మమ్దానీ అధిగమించారు. దీంతో అమెరికాలో ముస్లింలకు సామాజిక జీవితంలో వ్యతిరేక ముద్రలు పోయి సానుకూలమైన పరిస్థితులు ఏర్పడే అవకాశాలు వస్తాయని బిబిసి వ్యాఖ్యానించింది. మమ్దానీ గడచిన రెండు వారాలుగా ఎంతో కష్టపడి ఒక ముస్లింగా తనకున్న గుర్తింపును అధిగమించి విజయభేరీ మోగించారని వ్యాఖ్యాత పేర్కొన్నారు.

మమ్దానీ ప్రధానంగా వలస ప్రజల పక్షాన నిలబడ్డారు. దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న జీవన వ్యయాల గురించి ప్రధానంగా ప్రచారం చేశారు. జీవన వ్యయాలు, సామాన్య ప్రజలు జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ఇంటి అద్దెల పెరుగుదలకు ఒక నియంత్రణ విధించాలని, కనీస వేతనాలు 30 డాలర్లు ఉండాలని, ఉచిత ప్రభుత్వ రవాణా ఉండాలని, పిల్లల సంరక్షణ ప్రభుత్వమే తీసుకోవాలని, ప్రజల ప్రయోజనార్థం, తక్కువ ధరలకే సరుకులు లభ్యమయ్యేవిధంగా ప్రభుత్వమే కిరాణా దుకాణాలను నిర్వహించాలని, ఎల్‌జిబిటిక్యూలకు సమాన హక్కులుండాలని, ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశాలనే ప్రధానంగా ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చారు. న్యూయార్క్ నగరంలో ప్రధానంగా ఇంటి అద్దెల బాధను ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 10 ప్రధానమైన నగరాలలో ఇళ్ళ అద్దెలు పోల్చిచూస్తే న్యూయార్క్‌లోనే ఇళ్ళ అద్దెలు అత్యధికం. ప్రస్తుతం న్యూయార్క్‌లో నెలవారీ సింగిల్ బెడ్రూమ్ అపార్ట్‌మెంట్ అద్దె 4,143 డాలర్లు ఉండగా, ప్రపంచవ్యాప్తంగా దుబాయ్, డబ్లిన్, జ్యూరిచ్, లండన్, సింగపూర్ సహా గిలిన ప్రాంతాలలో మూడు వేలపై చిలుకు నుండి రెండువేల డాలర్ల వరకూ ఉంది.

**మమ్దానీ గురించి క్లుప్తంగా....**

న్యూయార్క్ 36వ జిల్లాలో క్వీన్స్‌నుండి విజయం సాధించిన మమ్దానీ 2021 నుండీ ఆయన న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆర్థిక ప్రజాస్వామ్యం, సోషలిస్టు మార్కెట్ వ్యవస్థ, కార్మికుల స్వయంప్రతిపత్తికోసం పోరాటం చేసే ''డెమోక్రటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా (డిఎస్ఎ) అమెరికాలో వామపక్షాలకు అతిపెద్ద సోషలిస్టు శిబిరంగా భాసిల్లుతున్న రాజకీయ సంస్థ. ఈ సంస్థ ప్రధానంగా సామ్యవాద ఆర్థిక,రాజకీయ సైద్ధాంతిక భావజాలం పునాదిగా పనిచేస్తుంది. డిఎస్‌ఓసి, ఎన్ఎఎంలు విలీనం కావడంతో 1982లో డిఎస్ఎ ఆవిర్భవించింది. మమ్దానీ తండ్రి గుజరాతీ ముస్లిం. తల్లి గుజరాతీ హిందూ మీరా నాయర్. ఆయన తల్లి మీరానాయర్ ప్రసిద్ధ భారతీయ,అమెరికన్ ఫిలిమ్ మేకర్. మమ్దానీ బాల్యంలోనే వారి కుటుంబం ఉగాండానుండి అమెరికాకు తరలివెళ్ళింది. 1991 అక్టోబరు 18న ఉగాండాలోని కంపాలలో జన్మించిన జోహ్రాన్ క్వామే మమ్దానీ ఆఫ్రికాను క్షుణ్ణంగా అధ్యయనం చేసి బౌడోయన్ కాలేజీ నుండి 2014లో బ్యాచిలర్ డిగ్రీ తీసుకున్నారు. ఆ తర్వాత నుండీ ఆయన అమెరికాలో ప్రస్తుత ప్రధాన ప్రతిపక్షం డెమోక్రటిక్‌పార్టీలో, డెమోక్రటిక్ సోషలిస్టు అమెరికాలో సభ్యుడుగా కొనసాగుతున్నారు. ఏడాదికాలంగా ఆయన ప్రచారం చేస్తూ వలస ప్రజలు, మౌనారిటీలు, కార్మికులు, అణగారిన వర్గాల పక్షాన తన వాణి వినిపిస్తూ నేషనల్ ఫిగర్‌గా ఎదిగారు.

# ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మొదలయ్యాయి. ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు సైతం ఎదురు కాల్పులు జరపడంతో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా ప్రాంతం నుండి ఆయుధాలు, పేలుడు సామాగ్రి, కిట్ బ్యాగులు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు తప్పించుకుని అడవుల్లోనికి పారిపోయినట్లు భావిస్తున్న భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ మరింత ముమ్మరం చేశాయి. మావోయిస్టుల మృతదేహాలను సంఘటనా స్థలంనుండి బీజాపూర్ ఆస్పత్రికి తరలించారు.

# నేడే బిహార్ దంగల్

(మొదటి పేజీ తరువాయి)

122 మంది మహిళా అభ్యర్థులు కాగా జన్ సురాజ్ పార్టీ తరఫున ఓ ట్రాన్స్‌జెండర్ కూడా బరిలో ఉన్నారు. తొలి విడతలో ఓటువేయనున్న 3.75 కోట్లమంది కోసం కేంద్ర ఎన్నికల సంఘం 45వేల 341పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో 36వేల 733 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 10.72లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు. ఈ విడతలో ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షం జెడియు అత్యధికంగా 57 స్థానాల్లో పోటీ చేస్తుండగా బిజెపి నుంచి 48 మంది, ఎల్‌జెపి తరఫున 14 మంది, రాష్ట్రీయ లోక్‌మోర్చా తరఫున ఇద్దరు బరిలో ఉన్నారు. మహాఘట్బంధన్‌కు సంబంధించి ఆర్‌జెడి అత్యధికంగా 73 చోట్ల పోటీచేస్తుండగా కాంగ్రెస్ నుంచి 24మంది, సిపిఐ(ఎంఎల్) తరఫున 14 మంది రంగంలో ఉన్నారు. తొలిసారి బిహార్ ఎన్నికల బరిలో దిగిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సారథ్యంలోని జన్‌సురాజ్ పార్టీ నుంచి 119 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. రాజపకర్, బచ్వారా, బెల్దౌర్, గౌరాబౌరం, బిహార్ షరీఫ్ స్థానాల్లో మహాగఠ్‌బంధన్‌లోని భాగస్వామ్య పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్, విఐపి, సిపిఐ కూటమి అభ్యర్థులతో పరస్పరం తలపడుతున్నాయి.

**బరిలో 16 మంది మంత్రులు :** బిహార్ తొలి విడతలో ప్రధాన కూటముల తరఫున పలువురు ప్రముఖులు బరిలో ఉన్నారు. నీతీశ్‌కుమార్ సర్కార్‌లోని 16 మంది మంత్రులు మరోసారి తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. అందులో ఉపముఖ్య మంత్రులు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హా సహా బిజెపికి చెందిన 11మంది మంత్రులు ఉన్నారు.

సామ్రాట్ చౌదరీ తారాపుర్ నుంచి, విజయ్‌కుమార్ సిన్హా లఖిసరాయ్ నుంచి పోటీ చేస్తున్నారు. మహాఘట్బంధన్ సిఎం అభ్యర్థి, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వీయాదవ్ మూడోసారి రాఘోపుర్ నుంచి బరిలో నిలిచారు. ఆయన సోదరుడు, మాజీమంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ మహువా నుంచి పోటీ చేస్తున్నారు. రఘునాథ్‌పుర్‌లో రాజకీయనేతగా మారిన గ్యాంగ్‌స్టర్ దివంగత మహ్మద్ షాబుద్దీన్ కుమారుడు ఒసామా సాహబ్ ఆర్‌జెడి తరఫున పోటీ చేస్తున్నారు. నలందలో జెడియు తరఫున ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రవణ్‌కుమార్ ఎనిమిదోసారి రంగంలో ఉన్నారు. తొలిసారి ఎన్నికల బరిలో దిగిన జానపద కళాకారిణి మైతిలీ ఠాకూర్ బిజెపి అభ్యర్థిగా అలీనగర్ నుంచి, కేసరిలాల్ యాదవ్‌గా సుపరిచితుడైన భోజ్‌పుర్ నటుడుగాయకుడు శత్రుఘన్ యాదవ్ చాప్రా నుంచి పోటీలో ఉన్నారు.

# నకిలీ ఓట్లు 25 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఓటమిగా మార్చడానికి పోల్ ప్యానెల్ 'ఆపరేషన్ సర్కార్ చోరీ'ని ప్రారంభించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. తన వద్ద ఉన్న వంద శాతం రుజువుతో ఎన్నికల కమిషన్‌ను, దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రశ్నిస్తున్నానన్నారు. హర్యానాలో అధికార పార్టీ విజయాన్ని నిర్ధారించడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు బిజెపితో కుమ్మక్కయ్యారని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో వారు భాగస్వామ్యంలో ఉన్నారని పేర్కొన్నారు. నిరాశ్రయులకు జీరో ఇంటి నెంబర్ ఇస్తున్నామని భారత ప్రజలకు ఇసిసి అబద్ధాలు చెప్పారని, కానీ అదే వాస్తవమన్నారు. ఇందిరా భవన్‌లో మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ హర్యానా ఎన్నికల జాబితాను ఉదహరించారు. 25,41,144 మంది నకిలీ ఓటర్లు, చెల్లని చిరునామాలు, బల్క్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. హర్యానాలో ఎనిమిది మంది ఓటర్లలో ఒకరు నకిలీ అని, అయినప్పటికీ కాంగ్రెస్ 22,779 ఓట్ల తేడాతో ఓడిపోయిందన్నారు. తాను షాక్‌లో ఉన్నానని, తాము కొన్నిగొన్నదాన్ని చూస్తే నమ్మలేక పోయానన్నా రు. తమ బృందాన్ని అనేకసార్లు చెక్‌చేయమని చెప్పానన్నారు. భవిష్యత్తు దొంగిలించ బడుతున్నందున యువకులు, జనరల్ జెడ్ దీనిని స్పష్టం గా అర్థం చేసుకోవాలని కోరుతున్నానన్నారు. ఎన్నికల కమిషన్ నకిలీలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నిస్తూ, ఇసి నిష్పాక్షికమైన ఎన్నికలకు జరగాలని కోరుకోవడం లేదని ఆరోపించారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ హర్యానాలో కాంగ్రెస్ గెలుస్తుందని సూచించాయని, అందులో ఐదు అగ్ర సంస్థలకు కూడా కాంగ్రెస్ క్వీన్‌స్వీప్ చేస్తుందని అంచనా వేశాయని రాహుల్ చెప్పారు. ఆశ్చర్యమైమిటంటే హర్యానాలో మొదటి సారిగా పోస్టల్ ఓట్లు ఫలితం కంటే భిన్నంగా ఉన్నా యని, పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ 73 సీట్లు పొందగా, బిజెపి 17 సీట్లు గెలుచుకుందన్నారు. ఉత్తరప్రదేశ్, హర్యానా రెండింటిలోనూ బిజెపితో సంబంధం ఉన్న వేలాది మంది ఓటు వేశారని గాంధీ పేర్కొన్నారు. బ్రెజిలియన్ మోడల్ అని తాను పేర్కొన్న మహిళ ఫోటోను చూపిస్తూ, ఆమె హర్యానాలోని 25 లక్షల రికార్డులలో ఒకరు అని, ఇది కేంద్రీకృత ఆపరేషన్‌కు రుజువు' అని అన్నారు. హర్యానాలో కాంగ్రెస్ సాధించిన అఖండ విజయాన్ని ఓటమిగా మార్చడానికి ఒక ప్రణాళిక అమలులో ఉందని ఆయన పేర్కొన్నారు. 'సర్కార్ చోరీ' భారతదేశ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిందని ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) అంశం తాజా ఆయుధమని రాహుల్ వివరించారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా తమ పార్టీ ప్రతిపక్ష పార్టీలతో సమన్వయం చేసుకుంటుందని ఆయన చెప్పారు. కానీ దేశంలో ప్రజాస్వామ్యం హత్య చేయబడిందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**బిహార్‌లోనూ 'క్రమబద్ధమైన ఓటు చోరీ'**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్నికల కమిషన్ భారత ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు రూపొందించిన 'క్రమబద్ధమైన ఓటు చోరీ' పద్ధతిని బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో కూడా అమలు చేస్తాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. హర్యానాలో 'ఓట్ల దొంగతనానికి ఎవరు బాధ్యులో చాలా స్పష్టంగా తెలుస్తోందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్ల చిత్రాన్ని చూపిస్తూ గాంధీ అన్నారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవకుండా చూసుకోవడానికి ఈ పెద్దమనుషులు బిజెపితో కుమ్మక్కయ్యారని, ఎన్నికల కమిషన్ ప్రధానమంత్రి, హోంమంత్రి (అమిత్ షా)తో అవగాహనను కలిగి ఉందని, వారు ఈ దేశ ప్రజాస్వామ్య పునాదులను నాశనం చేశారని మండిపడ్డారు. 'ఇది ఇప్పుడు ఒక వ్యవస్థ. పారిశ్రామికీకరణ చేయబడిన ఈ వ్యవస్థను ఏ రాష్ట్రంలోనైనా ఉపయోగించవచ్చు. దీనిని బిహార్‌లో ఉపయోగించ బోతున్నారని మాకు చాలా స్పష్టంగా తెలిసింది. బిహార్ ఎన్నికల తర్వాత, మేము అదే రికార్డులను పొందుతామని, బిహార్‌లో కూడా అదే జరిగిందని మీకు చూపిస్తామని నేను విశ్వసిస్తున్నాను' అని మాజీ కాంగ్రెస్ చీఫ్ అన్నారు. ఎన్నికలకు ముందు చివరి నిమిషంలో ఓటర్ల జాబితా వచ్చేటప్పటికి రాజకీయ పార్టీలు 'ఓటు చోరీ' డిజైన్లను అడ్డుకోవడానికి పని చేయలేవని గాంధీ తన ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. 'రాజ్యాంగాన్ని ఖూనీ చేయడానికి, భారత ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేందుకు ప్రధానమంత్రి, బిజెపి, ఎన్నికల కమిషన్ అభివృద్ధి చేసిన క్రమబద్ధమైన వ్యవస్థ' అని అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటరు జాబితాలలో పేర్లు తొలగించబడిన బిహార్ గ్రామానికి చెందిన కొంతమందిని కూడా గాంధీ వేదికపైకి పిలిచారు. ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించబడిన వారిలో ఒకరు తన గ్రామంలోని 187 మంది పేర్లను తొలగించారని చెప్పారని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఓటర్ల జాబితా సమగ్రత ఏ రాజకీయ పార్టీ బాధ్యత కాదు, కానీ ఇసి బాధ్యత అని ఒక ప్రశ్నకు సమాధానంగా రాహుల్ చెప్పా రు.

**రాహుల్ వ్యాఖ్యలు నిరాధారం : ఇసి**

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఎన్నికల దొంగతనం వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఓటు తారుమారు ఆరోపణ నిరాధారమైనదని, ఎందుకంటే హర్యానాలో ఓటర్ల జాబితాపై ఎటువంటి అప్పీళ్లు దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. 2024 అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో బహుళ ఓట్లు వేసిన ఓటర్లను కాంగ్రెస్ బూత్ ఏజెంట్లు ఎందుకు గుర్తించలేదని కూడా వారు ప్రశ్నించారు. బహుళ పేర్లను నివారించడానికి ఓటరు జాబితా సవరణ సమయంలో కాంగ్రెస్ బూత్‌లెవల్ ఏజెంట్లు ఎటువంటి వాదనలు, అభ్యంతరాలను ఎందుకు లేవనెత్తలేదన్నారు. ఎన్నికల జాబితాలో ఏవైనా అవకతవకలను గుర్తించడానికి రాజకీయ పార్టీలు బూత్‌లెవల్ ఏజెంట్లు లేదా బిఎల్‌ఎలను నియమిస్తాయి. కాగా, ఎన్నికల జాబితాలపై 'సున్నా అప్పీళ్లు' దాఖలు అయ్యాయని, ప్రస్తుతం 22 ఎన్నికల పిటిషన్లు మాత్రమే పంజాబ్, హర్యానా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఇసి అధికారులు స్పష్టం చేశారు. హర్యానాలోని రాయ్, హోడల్ అసెంబ్లీ సీట్ల అంశాన్ని గాంధీ లేవనెత్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాలను శుభ్రపరచడానికి ఇసి చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, పౌరసత్వ ధృవీకరణతో పాటు నకిలీ, చనిపోయిన, బదిలీ చేయబడిన ఓటర్లను తొలగించే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కు గాంధీ మద్దతు ఇస్తున్నారా అని అధికారులు ప్రశ్నించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పత్తి బస్తాలు తడిచిన ఘటనపై విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా 'వరంగల్ మార్కెట్' పత్తి సంచులు తడిచిన ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు, 7329 బస్తాల పత్తిలో 59 బస్తాలు మాత్రమే తడిసినట్లు గుర్తించారు. తడిసిన పత్తిని సిబ్బంది సహాయంతో ఆరబెట్టి అదే రోజు కొనుగోలు చేశారని అధికారులు తమ నివేదికలో పొందుపర్చారు. ఈ నివేదికను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు అందజేశారు. 'వరంగల్ మార్కెట్‌లో పత్తి సంచులు తడిచిన ఘటన'పై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విచారణకు ఆదేశించారు. వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ భాయి సూచనతో రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. ఈ విచారణలో 7329 బస్తాల పత్తిలో 59 బస్తాలు మాత్రమే తడిసినట్లు తేలింది.

తడిసిన పత్తిని సిబ్బంది సహాయంతో ఆరబెట్టి అదే రోజున కొనుగోలు చేశారు. రైతులకు ఎటువంటి ఆర్థిక నష్టం జరగలేదని రీజనల్ జాయింట్ డైరెక్టర్ తన నివేదికలో పొందుపర్చారు.

## బిఆర్ఎస్‌ను తిరస్కరించి... కాంగ్రెస్‌కు ఓటు వేయాలి



ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దుతగా సిపిఐ నాయకులు నియోజకవర్గంలోని మోతీనగర్ చౌరస్తా నుండి బంజారా నగర్, ఎన్ఆర్ఆర్‌పురం, శ్రీ సాయిబాబానగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో బుధవారం ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్ బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, పాలబిందెల శ్రీనివాస్, వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు చైతన్య, నరసింహ అనిల్, లెనిన్,దస్తగిరి, సుశాంత్, భాను, అరుణ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ బృందం ప్రతి షాపులను, ఇంటింటికీ ప్రచారం నిర్వహించి, సిపిఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రజలను అవమానించే బిఆర్ఎస్‌ను తిరస్కరించి, కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ తెలంగాణను దోచుకుని, దాచుకున్నదని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్‌ను తిరస్కరించి కాంగ్రెస్‌ను గెలిపించారని, అప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బిఆర్ఎస్ అనేక కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే బిజెపితో అంతర్గతంగా ఒప్పందం కుదుర్చుకుని తిరిగి ఎన్నికల్లో గెలిచేందుకు బిఆర్ఎస్ అబద్దాలతో ప్రజలను మోసగిస్తోందని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర నిర్వహించేందుకు సిద్ధంగా లేదన్నారు. మళ్లీ అధికారాన్ని దక్కించుకుని దోపిడీ చేయాలని ఉవ్విళ్లు ఊరుతున్నారని, ఇలాంటి పార్టీని ప్రజలు ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి ఆ పార్టీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కమతం యాదగిరి మాట్లాడుతూ యువత మత్తుకు బానిసై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్న పరిస్థితి అత్యంత విషాదకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నదన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

# అధ్వాన పాలనను అడ్డుకోకపోతే అధోగతే

ఎన్‌డిఎ విధానాలపై సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ విమర్శ



విజయవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అరాచక పాలనతో ప్రజల జీవన పరిస్థితులు దయనీయంగా మారిపోయాయని, బలమైన ఉద్యమాలు నిర్మించడం ద్వారా ఈ అధ్వాన పాలనకు చరమ గీతం పలకాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశాలు విజయవాడలోని దాసరి భవన్‌లో బుధవారం జరిగాయి. పి.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ హాజరయ్యారు. ఎపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అజెండా ప్రవేశపెట్టారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ సీపీఐ చండీగఢ్ మహాసభలు ఇచ్చిన పిలుపు మేరకు వామపక్షాల ఐక్యత దిశగా పార్టీశ్రేణులను నడిపించాలని పిలుపునిచ్చారు. సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా బలోపేతం కావడానికి సమస్యల ప్రాతిపదికగా ఉద్యమ నిర్మాణాలే శరణ్యమని అన్నారు. సరైన సమయంలో, సరైన రీతిలో, సరైన రాజకీయ నిర్ణయాలు అత్యంత అవశ్యమని చెప్పారు. వామపక్షాలు ఆత్మవిమర్శనా దృష్టితో లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చినప్పుడే మతోన్మాద, ఫాసిస్టు బీజేపీని గద్దె దించగలమని చెప్పారు. ఇండియా ఐక్యసంఘటన బలోపేతం కావడానికి కాంగ్రెస్ చొరవ చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై బీజేపీ సైతం మద్దతునిచ్చిందని, అయితే కేంద్రంలో బీజేపీ నాటకాలాడుతూ బీసీ వర్గాలను దగా చేస్తున్నదన్నారు. సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు సందర్భంగా డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో కనీవినీ ఎరుగని రీతిలో జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటీకరణ, అప్పులు, అవినీతితో చంద్రబాబునాయుడు ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని విమర్శించారు. విద్య, వైద్యం వంటి ప్రాధాన్యత రంగాలతోపాటు సర్వం ప్రైవేటీకరణ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి జరుగుతున్నదన్నారు. 70 శాతం ప్రాథమిక విద్యను ప్రైవేటువారి చేతుల్లో పెట్టిన కూటమి సర్కారు... మెడికల్ కాలేజీలన్నింటినీ అమ్మేసిందని, ఇకపై ఉన్నతవర్గాలకు తప్ప సామాన్యుడికి వైద్య, విద్య అందే పరిస్థితి లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తూ స్టాఫ్ కొరతతో యూనివర్సిటీలు మూతపడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని జగన్ ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన చంద్రబాబు... ఇప్పుడు అంతకుమించిన అప్పులతో రాష్ట్రాన్ని మరిన్ని కష్టాల్లోకి నెట్టేశారన్నారు. బీహార్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వ ఓటమి ఖాయమని, తేజస్వీయాదవ్ నాయకత్వంలో మహాగట్బంధన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీహార్‌లో కులంతో పాటు భూ సమస్య వేధిస్తున్నదని, భూసమస్యపై పోరాడిన చరిత్ర కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందని, 9 స్థానాల్లో పోటీ చేస్తున్న సిపిఐకి విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు చాలా కీలకమన్నారు. తీవ్ర పేదరికం నుంచి కేరళను విముక్తి చేసిన ఎల్‌డీఫ్ ప్రభుత్వ విధానాలు దేశానికే మార్గదర్శకమని అన్నారు. నూటికి నూరు శాతం దుర్భర దారిద్ర్యాన్ని తొలగించడంతోపాటు వందశాతం అక్షరాస్యత, భూసంస్కరణలు అమలు చేసిన ఏకైక రాష్ట్రంగా కేరళ నిలిచిందని, మానవ అభివృద్ధి సూచీలోనూ ముందంజలో నిలిచిందని కొనియాడారు. కమ్యూనిస్టుల పాలనలో కేరళ అభ్యున్నతి సాధించడం గర్వంగా ఉందన్నారు. జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ముగింపు కార్యక్రమం పురస్కరించుకొని డిసెంబరు 26వ తేదీన జరిగే 'చలో ఖమ్మం' కార్యక్రమంలో ప్రతి జిల్లా నుంచి విస్తృతంగా పాల్గొనాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తొలుత అమరవీరులకు నివాళులర్పిస్తూ సిపిఐ కార్యదర్శివర్గసభ్యులు తాటిపాక మధు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, సభికులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. సమితి సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏఐకేస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంక య్య పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రనాయక్, పెంచలయ్య విప్లవ గీతాలు ఆలపించారు.

### సిపిఐ నూతన కార్యదర్శివర్గం ఇదే

అమరావతి: భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యదర్శివర్గాన్ని విజయవాడ దాసరి భవన్‌లో పి.రామచంద్రయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర సమితి సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యతో పాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా జేవీ సత్యనారాయణమూర్తి, పి.హరినాథరెడ్డి, కేవీవీ ప్రసాద్, డి.జగదీశ్, జంగాల అజయ్‌కుమార్, దేగా ప్రభాకర్, తాటిపాక మధు, పి.దుర్గాభవాని, కె.రామాంజనేయులు, శాశ్వత ఆహ్వానితులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ ఎన్నికయ్యారు.


## పేదవాడి ఓటు హక్కును హరించేందుకు బిజెపి కుట్ర



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/జనగామ : పేదవాడి ఓటు హక్కును హరించేందుకు బీజేపి కుట్ర చేస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సిపిఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి జువారి రమేష్ అధ్యక్షత వహించగా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పేదలకు ఓట్లు వేయనీయవద్దని చెప్పిన కేంద్రమంత్రి లలన్‌సింగ్‌ను కేంద్రమంత్రి మండలి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కేంద్రం ఓటరు ప్రత్యేక జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించేందుకు సిద్ధమైందన్నారు. కేంద్రప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను చేపట్టిందని, ఎస్ఐఆర్‌ను రాజకీయ అస్త్రంగా ఉపయోగించి ఎన్నికలకు ముందు ఓటర్లను బెదిరించడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు జిల్లా నుండి పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు జీడి ఎల్లయ్య, రావుల సదానందం, పాతూరి ప్రశాంత్, కావటి యాదగిరి, చొప్పరి సోమయ్య, జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లను పరిష్కరించే వరకు కళాశాలల బంద్ కొనసాగింపు



ప్రజాపక్షం/హైదరాబాద్: తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు 'కళాశాలల బంద్'ను కొనసాగిస్తామని, బకాయిలలో సగం నిధులను, రూ.5వేల కోట్ల నిధులను వెంటనే విడుదల చేస్తేనే బంద్‌ను విరమించుకుంటామని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేశ్ బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఎల్.బి స్టేడియంలో అధ్యాపకుల సభను నిర్వహిస్తామన్నారు. ఈ నెల 11 లేదా 12వ తేదీన విద్యార్థులతో సభను నిర్వహిస్తామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ అందులో అనవసరమైన వ్యక్తులను సభ్యుల నుంచి తొలగించాలని కోరారు. మార్చి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్నారు.

# కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 26న నిరసన ప్రదర్శనలు

సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లోని రాజ్‌బహదూర్‌గౌర్ హాల్‌లో బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం పశ్యపద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి టి.సాగర్, మండలి వెంకన్న, ఎం.భిక్షపతి, వి.ఉపేందర్‌రెడ్డి, జక్కుల వెంకటయ్య, బి.రాము, ఈ.విజయ్ హాజరయ్యారు. కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న జిల్లా కేంద్రాలలో కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. కార్పొరేట్ కంపెనీల దోపిడీకి వ్యతిరేకంగా, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని, పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బ్లాక్‌డేను పాటించామని, విద్యుత్ సవరణ బిల్లు 2025 ను ఉపసవరించాలని, రుణమాఫీ చట్టం చేయాలనే డిమాండ్‌లపై పోరాటాలను ఉధృతం చేసినా, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసినప్పటికీ ఇలా అనేక కార్యక్రమాలను సంవత్సరాలుగా నిర్వహిస్తున్నప్పటికీ కేంద్ర పాలకులు స్పందించలేదని విమర్శించారు. కార్పొరేట్ అనుకూల విధానాలను బరితెగించి అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని నాయకులు విమర్శించారు. పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు–2025ను ఉపసంహకరించుకోవాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని, వరుసగా కురిసిన వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం, ఆహార పంటలకు ఎకరాకు రూ.25000, ఉద్యాన, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50,000 నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. భూ సేకరణ చట్టం 2013ను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. పంటలకు బోనస్ ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేయడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తుందన్నారు. ఈనెల 26వ తేదీన జిల్లా కేంద్రాలలో జరగనున్న కార్యక్రమాలను జయప్రదం చేసే విధం గా సంబంధించి అన్ని జిల్లాల్లో పత్రికా సమావేశాలను ఏర్పాటు చేయాలని, రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

# మహిళా సంఘాలను ఆర్థికంగా తీర్చిదిద్దుతున్నాం

మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇందిరా మహిళా శక్తి పాలసీ ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దుతున్నామని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. 'వడ్డీ లేని రుణాల' పథకం కింద ఏటా రూ.వేయి కోట్లకు పైగా మహిళా సంఘాలకు వడ్డీలు చెల్లిస్తున్నామని, 63 లక్షల మంది మహిళలు సంఘటిత శక్తిగా 'ఇందిరా మహిళా శక్తి' పని చేస్తోందన్నారు. స్థూల జాతీయ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం పెంచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నెదర్లాండ్‌లో జరిగిన 'వైటల్ వాయిసెస్ గ్లోబల్ ఫెలోషిప్(వివిజిఎఫ్) గ్లోబల్ సమ్మిట్'లో 'ప్రతికూలతల నుండి సాధికారతవైపు దేశాలను మారుస్తున్న మహిళల శక్తి' అనే అంశంపైన జరిగిన సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు తెలంగాణ రాష్ట్రంలో సోలార్ ప్లాంట్లను నిర్వహిస్తున్నారని, ఆర్‌టిసికి బస్సులు అద్దెకు ఇస్తున్నారని, పెట్రోల్ బంకులు నడుపుతున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్‌టిసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణాన్నిఅమలు చేస్తున్నామని వివరించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళల భాగస్వామ్యం 40 శాతం కాగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అది 20 శాతం లోపే ఉందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే సంకల్పంతో తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం కనీసం రూ.25 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు మహిళా సంఘాలకు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గిరిజన హక్కులను కాపాడడమే తెలంగాణ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాగా అంతర్జాతీయ సదస్సులో పెరూ దేశ మొట్టమొదటి మహిళ ప్రధాని బెట్రిజ్ మెరినో, వివిధ దేశాలకు చెందిన మహిళా ఎంపిలు, పలువురు మహిళా ప్రముఖులు ప్రసంగించారు. ఆయా దేశాల్లో నెలకొన్న పరిస్థితులు, మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సాధించాల్సిన లక్ష్యాలపై తమ అనుభవాలను సీతక్క తెలిపారు.

## రూ.10 కోట్లు డిమాండ్ చేసిన మీడియా ప్రతినిధులపై కేసు



ప్రజాపక్షం/హైదరాబాద్: తనను బ్లాక్ మెయిల్ చేసి టివి5 యాంకర్ డిహెచ్‌విఎస్ఎస్ఎన్ మూర్తి రూ.10 కోట్లు డిమాండ్ చేశాడని నటుడు ధర్మ సత్య సాయి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు చర్యలు తీసుకున్నారు. తన ఫోన్ ట్యాప్ చేసి, వ్యక్తిగత వివరాలను టెలికాస్ట్ చేస్తూ రూ.10 కోట్లు డిమాండ్ చేశాడని మహేష్ ఆరోపించారు. ఈ ఆరోపణలతో ఆయన కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాలపై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాలతో ఎ1గా చిరుమామిళ్ల గౌతమి, ఎ2గా మూర్తి చేరుస్తూ కూకట్‌పల్లి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదిలా ఉంటే ధర్మ మహేశ్ డ్రింకర్ సాయి, సింధూరం సినిమాల్లో హీరోగా నటించాడు. కొన్నేళ్ల క్రితం సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ గౌతమి చౌదరిని అతడు వివాహం చేసుకోగా ఇద్దరి మధ్య విభేదాల కారణంగా దూరం అయ్యారు. ఈ క్రమంలో గౌతమి, ధర్మ మహేశ్ తరచూ టీవీ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తూ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇటీవల కూడా ధర్మ మహేశ్.. మూర్తిపై సంచలన ఆరోపణలు చేశాడు. ఇక ఇప్పుడు కోర్టును ఆశ్రయించడంతో ఏం జరుగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు:మంత్రి జూపల్లి



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజల అకాంక్షలను అనుగుణంగా సిఎం రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కోనసాగాలంటే కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మంత్రి జూపల్లి కృష్ణారావు తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఉప ఎన్నికపై ప్రత్యేక దృష్టి సారించిన జూపల్లి... కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో బోరబండలోని సాయిబాబా నగర్‌లో బుధవారం నవీన్ యాదవ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వృద్ధులను, మహిళలను అప్యాయంగా పలకరిస్తూ... అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ... హస్తం గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

## ప్రతి హామీ నెరవేర్చుతాం... ఆందోళన వద్దు

ఓర్వలేకే మాపై ప్రతిపక్షాల విమర్శలు
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతామని, ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురి కావొద్దని ప్రజలకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి... అత్యధిక మెజార్టీతో నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం ఎల్లారెడ్డి గూడ, కమలాపురి కాలనీ, ఇమాంగూడ, జయప్రకాష్ నగర్, తవాక్కల్ నగర్, అలీ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఇంటింటికి తిరిగి వివరించారు. తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసిన బీఆర్ఎస్ నేతలు ఈ ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. మా అభివృద్ధి, సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంటే, అది చూసి ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.

## రెండేళ్లలో ఏం చేశారో చెప్పి ఓట్లు అడగండి

కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సవాల్




ప్రజాపక్షం/హైదరాబాద్: రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో చేసిన కార్యక్రమాలను వివరించి ఓటు అడగాలని డిమాండ్ సిఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్‌లో ఇప్పటి వరకు రూ.5,328 కోట్లు ఖర్చు చేయగా, వీటి ద్వారా 2,12,862 మందిలబ్ధి చేకూరిందన్నారు. దళిత బంధు రూ.10.6 కోట్లు, బిసి బంధు రూ.3.8 కోట్లు ఖర్చు చేశామన్నారు. ''జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రగతి నివేదిక''ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ ప్రగతి నివేదికలో బిఆర్ఎస్ పదేళ్లకాలంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ప్రజా రవాణ, రోడ్లు, మెట్రో,ఫ్లైఓవర్ల నిర్మాణాలకు రూ 2,463 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. జూబ్లీహిల్స్‌లోని ఏ గల్లీకి వెళ్లినా మాగంటి గోపినాథ్ వేసిన శిలాఫలకం కనిపిస్తుందని, తాము చేసిన అభివృద్ధిని వివరించి ప్రజలకు ఓట్లు అడుగుతామని కెటిఆర్ తెలిపారు. టిమ్స్ ఆస్పత్రి, బస్తీదవఖానను ఏర్పాటు చేశామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 34,712 మందికి వ్యాక్సిన్లు ఇచ్చినట్లు వివరించారు. ఆరోగ్యలక్ష్మి పథకం కింద రూ.98 లక్షలు, కెసిఆర్ కిట్ కింద రూ.73 లక్షలు, కంటివెలుగు కోసం రూ.55 లక్షలు, న్యూట్రిషన్ కిట్ల కోసం రూ.14 లక్షలు ఖర్చు చేశామని కెటిఆర్ తెలిపారు. గృహ నిర్మాణానికి రూ.324 కోట్లు ఖర్చు చేశామన్నారు. మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించామన్నారు.


దేవాదాయ–ధర్మాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వము
**శ్రీ జోగుళాంబా బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము**
అలంపూరు పట్టణము, జోగుళాంబ గద్వాల జిల్లా, తెలంగాణ. ఫోన్ నం. 08502-241327

సీల్డ్ టెండరు కం బహిరంగ వేలము కం ఆన్‌లైన్ టెండర్ల ప్రకటన

లేఖ నం.: 6/EO/SJBBSGD/2025 తేది: 05-11-2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియచేయునది ఏమనగా ఇట్టి దేవస్థానమునకు సంబంధించి ఈ క్రింద తెలిపిన వివిధ టెండర్లు నిర్వహించబడును.

విభాగము - ఎ

| క్ర.సం. | టెండరు వివరములు | కాల పరిమితి | షెడ్యూలు ధర రూ. | డిపాజిట్ రూ. |
|---|---|---|---|---|
| 1 | శ్రీ అమ్మవారి చీరల సేకరణ చేసుకొను హక్కు | ఒక సంవత్సరము 01.12.2025 నుండి 30.11.2026 వరకు | 1,000-00 | 8,00,000-00 |
| 2 | టెంకాయలు, పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు | " | 1,000-00 | 20,00,000-00 |
| 3 | పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను హక్కు | " | 1,000-00 | 20,00,000-00 |
| 4 | ఫోటోలు క్యాసెట్లు అమ్ముకొను హక్కు | " | 1,000-00 | 3,00,000-00 |
| 5 | వసతి గదులు నిర్వహించుకొను హక్కు | " | 1,000-00 | 4,00,000-00 |
| 6 | క్యాంటిన్ షాపు నిర్వహించుకొను హక్కు | " | 1,000-00 | 1,00,000-00 |
| 7 | రక్షా కంకణాలు, డాలర్లు, క్యాలెండర్లు అమ్ముకొను హక్కు | " | 1,000-00 | 2,00,000-00 |
| 8 | శౌచాలయములు నిర్వహించుకొను హక్కు | " | 1,000-00 | 3,00,000-00 |

విభాగము - బి

| క్ర.సం. | టెండరు వివరములు | కాల పరిమితి | షెడ్యూలు ధర రూ. | డిపాజిట్ రూ. |
|---|---|---|---|---|
| 1 | లడ్డు, పులిహోర కవర్లు, లడ్డు బాక్సులు, క్యారీబ్యాగులు మొ॥ ప్రింటింగ్ చేసి సరఫరా చేయుటకు | 2 సంవత్సరములు 01.12.2025 నుండి 30.11.2027 వరకు | 1,000-00 | 10,000-00 |
| 2 | పూల మాలలు సరఫరా చేయుటకు & పూల అలంకరణలు చేయుటకు, | " | 1,000-00 | 10,000-00 |
| 3 | టెంట్ హౌస్ & సప్లయర్స్ సామాగ్రి సరఫరా చేయుటకు, | " | 1,000-00 | 10,000-00 |
| 4 | అరటి మట్టలు, మామిడాకులు సరఫరా చేయుట | " | 1,000-00 | 10,000-00 |
| 5 | స్టేషనరీ సామాగ్రి సరఫరా చేయుటకు | " | 1,000-00 | 10,000-00 |
| 6 | హెూమమునకు అవసరమైన కట్టెలు (సమిధలు) సరఫరా చేయుటకు | " | 1,000-00 | 10,000-00 |

ఆసక్తి గల వారు సీల్డ్ కం బహిరంగ వేలము కం ఆన్ లైన్ టెండరు పూర్తి వివరముల కొరకు
**www.tender.telangana.gov.in endowments. Marketing నందు తిలకించగలరు**
ఈ సీల్డ్ టెండర్లలో పాల్గొనదలచిన వారు తేది:- 07.11.2025 నుండి 11.11.2025 నాడు సా. గం.5-00 లోపు షెడ్యూలు ధర రూ.1,000/- చెల్లించి షెడ్యూల్లు పొందగలరు.
వేదిక :- శ్రీ జోగుళాంబా బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము, అలంపూరు గ్రా॥ & మం॥, జోగుళాంబ గద్వాల జిల్లా.
**టెండర్లు నిర్వహించు తేది:- 12.11.2025 బుధవారము, సమయము మ.11-00 లకు**
షరతులు మరియు ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయము నందు కానీ (లేదా) సెల్ నం. 9490518885 కానీ, 9441311022 ను కానీ సంప్రదించగలరు.

DIPR R.O. No. : 10275-PP/CL/ADVT/1/2025-26, Date: 05-11-2025
కార్యనిర్వహణాధికారి

## చెరువులోకి చేప పిల్లల విడుదల

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి చెరువులోకి చేప పిల్లలను వెలిమినేడు పిఏసిఎస్ చైర్మన్ రుద్దమురెడ్డి బుధవారం విడుదల చేశారు. ప్రభుత్వం నుండి ఉచితంగా విడుదలైన సుమారు 72 వేల రవ్వ, బొచ్చ, పెరక జాతికి చెందిన చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు. వారిని అన్ని రకాలుగా ఆదుకోవటానికి ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మత్స్య సహకార శాఖ ఏడి రాజారాం, సూపరింటెండెంట్ వీరమల్ల శ్రీనివాస్, కార్మిక సంఘం అధ్యక్షులు బుంగపట్ల తిమ్మయ్య, నాయకులు నూతి తిరుమలేష్, బైరగోని భిక్షం, నూతి వెంకటేష్, మోర సత్యం, మోర సత్తయ్య, నూతి సతీష్ పాల్గొన్నారు.



## సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా విద్యార్థులను వేధిస్తూ అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట హరి బాబు డిమాండ్ చేశారు.బుధవారం పట్టణంలో ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా అక్రమంగా తరగతులను నిర్వహిస్తున్న విద్యాసంస్థలను గుర్తించి బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తరగతులను బంద్ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురునానక్ జయంతి,కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వం అన్ని రకాల విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినప్పటికీ కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ తమ ఇష్టం వచ్చిన రీతిగా ప్రవర్తిస్తూ ఫీజుల కోసం, ర్యాంకుల వేటలో విద్యార్థులను మానసికంగా వేధిస్తూ,ఒత్తిడికి గురి చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పండు, సంపత్, మణికంఠ,భరత్ కుమార్,శశి కుమార్,అజయ్,దేవేందర్, గణేష్,కార్తికేయ,వెంకట్,మనికేశ్వర్,లోకేష్, నిఖిల్ పాల్గొన్నారు.



## సిపిఐ శతాబ్ది వేడుకలు పండుగలా చేద్దాం

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** దేశంలో సిపిఐ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి నూరు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రతి గ్రామ గ్రామాన వేడుకలను పండుగలా జరుపుకోవాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు కార్యకర్తలను కోరారు. గరిడేపల్లి మండల కేంద్రంలో బుధవారం కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు త్రిపురం సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కంటే ముందుగాని, తర్వాత గాని జరిగిన ప్రతి ఉద్యమంలో, ప్రతి పోరాటంలో సిపిఐ క్రియాశీలక పాత్ర పోషించిందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సహాయ కార్యదర్శి పోటు పూర్ణచంద్రరావు, రైతు సంఘం జిల్లా నాయకులు బిల్లా కనకయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, చేవా వెంకన్న, కుందూరు వెంకటరెడ్డి, అంబటి వెంకటరెడ్డి, తిరగమళ్ళ కిరణ్, వేశాల ఆంజనేయులు, ప్రతాని సైదులు, పంగ సైదులు, ఈదయ్య, షేక్ పీర్‌సాహెబ్, గోధుమల ఈశ్వరాచారి, అంబటి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

## తుఫాన్ తాకిడికి 'మిర్చి' ఆగం



**ప్రజాపక్షం/మోతె :** తుఫాన్ తాకిడికి మిర్చిపంట ఆగమైంది. ఇటీవల భారీగా కురుస్తున్న వర్షాలకు మిర్చిపంట వేసిన రైతులకు కంట నీరే మిగిలింది. లక్షలు ఖర్చు పెట్టి మిర్చి పంట వేస్తే తుఫాన్ తాకిడితో పంట దెబ్బతిని ఆదుకునే వారు లేక దీనస్థితిలో ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని రాంపురం తండకు చెందిన రైతు ఆంగోతు రవి తెలిపిన వివరాల ప్రకారం తనకున్న రెండు ఎకరాలలో మిర్చి పంట వేయగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలో నీళ్ళు నిలిచి గాలి ఆడకపోవడంతోపాటు, మిర్చి తోటలోని వాగు సాగి వరద తాకిడికి భూసారం కొట్టుకొని పోయి అడుగుపిండి, యూరియా సైతం నీటిలో కలిసి పోయిందని తెలిపారు. మిర్చి తోటకు పూసిన పూత రాలిపోవడంతోపాటు చేను ఎండుముఖం వేసిందని వాపోయాడు. వ్యవసాయ అధికారులు స్పందించి న్యాయం చేయాలని తన మిర్చి తోటను సందర్శించి నష్టపరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

## ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్, స్టార్ హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శ్రీ ఆర్కే హాస్పిటల్ చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా 126వ ఉచిత మెగా వైద్య శిబిరం భువనగిరి పట్టణంలోని పహాడీ నగర్ శ్రీ ఆర్కే హాస్పిటల్ నందు నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు హైదరాబాద్ స్టార్ హాస్పిటల్ వారి పెద్ది శ్రీకాంత్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచితంగా బీపీ షుగర్, పిఎఫ్‌టి పరీక్షలు నిర్వహించి పల్మనాలజిస్ట్ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో శ్రీ ఆర్కే హాస్పిటల్ అధినేత డాక్టర్ చావా రాజ్ కుమార్, పల్మనాలజిస్ట్ డాక్టర్ పెద్ది శ్రీకాంత్, డాక్టర్ చావా అసలేష, స్టార్ హాస్పిటల్ మార్కెటింగ్ డిజిఎం వినోద్, శ్రీ ఆర్‌కె హాస్పిటల్ ఇంచార్జ్ కొండల్ రెడ్డి, స్టార్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరం నందు వంద మదికి పైగా పరీక్షలు నిర్వహించినట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలియజేశారు.

## తుంగతుర్తిలో జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో ఈనెల 6 నుంచి 8 తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ 11 జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తుంగతుర్తి పట్టణ శివారు నాగారం రహదారిపై ఉన్న ఈ పాఠశాల, కళాశాలలో జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో 5వ జోన్‌కు సంబంధించి మొత్తంగా సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట పాఠశాల, కళాశాల విద్యార్థినిలు పాల్గొననున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నుండి వలిగొండ, చౌటుప్పల్, ఆలేరు, అడ్డగూడురు విద్యార్థులు, జనగామ జిల్లాలోని నర్మెట్ట, జాఫర్‌ఘడ్, పాలకుర్తి చెందిన పాఠశాల, కళాశాలల సుమారు 765 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. మొత్తంగా 19 మంది పిడి, పిఈటీల ఆధ్వర్యంలో కొనసాగనుంది. ఈ స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్ పుట్ తదితర వాటికి రెండు మైదానాలు ఏర్పాటు చేశారు. తుంగతుర్తిలో జోనల్‌స్థాయి క్రీడలు నిర్వహించడం ఇది రెండవ సారి.

## అయ్యప్ప మాలధారులకు అన్నదానం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర ఆలయం వద్ద బుధవారం అయ్యప్ప స్వాములకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సూర్యాపేట పట్టణానికి చెందిన కొంపెల్లి ఉషారాణి కుమారుడు అనిల్‌రెడ్డి, ఆశ్రితరెడ్డి, స్నేహిత్‌రెడ్డిలు అమెరికాలో నివాసం ఉంటూ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, అన్ని మాలధారణ స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా కొంపెల్లి ఉషారాణి మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వాములందరికి అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనిత, సురేందర్ రెడ్డి, భవిష్య, నవీన్, ప్రశాంత, వేణు, వాసవి, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు, పరిశోధనలకు పెద్దపీట

### విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడంలాంటి సమున్నత లక్ష్యాలతో ముందుకెళుతున్నామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. బుధవారం పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని విజ్ఞాన్ యూనివర్సిటీ 202627 సంవత్సరానికి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్బీ (హానర్స్), బీబీఏ ఎల్ఎల్బీ (హానర్స్), బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, ఫార్మ్‌డీ అడ్మిషన్ల వీశాట్ 2026/27 నోటిఫికేషన్ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము బీటెక్లో అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్, కెమికల్, సివిల్, సీఎస్ఈతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, డేటాసైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈవీఎల్ఎస్ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ, మెకానికల్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, టెక్స్టైల్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మ్‌డీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, డిప్లొమా ( సీఎస్ఈ. ఈసీఈ, మెకానికల్,ఈఈఈ) కోర్సులను అందజేస్తున్నామని చెప్పారు. ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లీష్, ఎమ్మెస్సీ డేటాసైన్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, పీహెచ్డీ కోర్సులను కూడా అందజేస్తున్నామని చెప్పారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకు అనుబంధంగా ప్రారంభించిన విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్లో విద్యార్థులకు విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మరింత పూర్తి సమాచారం విద్యార్థులు యూనివర్సిటీ వెబ్సైట్ సంప్రదించి తెలుసుకోవచ్చు అన్నారు. అడ్మిషన్స్. విజ్ఞాన్.ఎసి. ఇన్ ద్వారా ఆన్లైన్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వీశాట్ 2026 దరఖాస్తును ఫిబ్రవరి 25 లోగా పూర్తిచేయాలన్నారు. వీశాట్ పరీక్ష రాసిన వారికి బీటెక్ సీట్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఇన్చార్జ్ రిజిస్ట్రార్ డా దిరిశాల విజయరాము, డీన్ అడ్మిషన్స్ డా కేవీ క్రిష్ణకిషోర్, డైరెక్టర్ అడ్మిషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఏ. గౌరిశంకర్ రావు ఉన్నారు.

## అండర్-17 టైక్వాండో క్రీడాకారుల ఎంపిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో 69వ ఎస్‌జిఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి టైక్వాండో అండర్17 (బాలురు,బాలికలు)ఎంపిక పోటీలు ఈనెల 3 నుండి 5వరకు మూడు రోజులు పాటు స్థానిక ఏలిమినేటి మాధవ రెడ్డి పోలీస్ ఆడిటోరియంలో విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి సుమారు 350 మంది క్రీడాకారులు,కోచ్‌లు,మేనేజర్లు, టెక్నికల్ అధికారులు, పిఈటిలు,పిడిలు పాల్గొన్నారు. పోటీల అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 25 డిసెంబర్ 2 వరకు ఇటానగర్, అరుణాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ టైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రానికి బాధ్యత వహిస్తారు.అనంతరం విజేతలకు మెడల్స్,సర్టిఫికెట్లను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి మొహమ్మద్ అక్బర్ ఆలీ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ వై. సాయి,కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సిఈఓ ఎం.వి గోనారెడ్డి ,ఎస్‌జిఎఫ్ రాష్ట్ర పరిశీలకులు ఎం.ఈశ్వర్ జిల్లా సెక్రటరీ దగ్గుబాటి విమల,ది టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్లగొండ డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్,వ్యాయామ ఉపాధ్యాయులు కుంభం నర్సి రెడ్డి,శంభులింగం, నాగరాజు, రవీందర్, యుగేందర్,అష్రఫ్‌లు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం నిర్వహించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, ఆర్‌డిఓ శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ సమాచార హక్కు చట్టం పై అవగహన కల్పిస్తూ,ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం తో పాటు,పాలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తునమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్స కోసం పేద ప్రజలు వస్తున్నందున వారికి ఉపయోగపడాలని తన పుట్టినరోజు సందర్భంగా నల్లగొండలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ ఏ ఖాన్,జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ నాగేష్,మెడికల్ ఆఫీసర్ దీపికా,సంస్థ సలహాదారులు రామలింగయ్య,బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి ప్రశాంత్,మేఖల శ్రీహరి,ఎరుకల నరహరి గౌడ్,మెట్టు మధు,కలవాల హరికృష్ణతదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ యుగంలో పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తున్న ప్రతీక్ ఫౌండేషన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విద్యార్థులలో పుస్తక పఠన అలవాటును పెంపొందించడానికి నిత్య పుస్తక కానుక ఉద్యమం నేటి డిజిటల్ యుగంలో, యువతరం మొబైల్ స్క్రీన్‌లకే పరిమితమవుతున్న తరుణంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఒక కీలకమైన పుస్తక పఠన ఉద్యమాన్ని చేపట్టింది. విద్యార్థులు తిరిగి పుస్తకాల ప్రపంచానికి మళ్లేలా ప్రోత్సహించడమే ఈ మిషన్ లక్ష్యం అని విశ్రాంత ప్రిన్సిపాల్ ఫౌండేషన్ సిఈఓ ఎం.వి గోనారెడ్డి అన్నారు. పట్టణంలో ఫౌండేషన్ ఈ మిషన్‌లో భాగంగా ప్రతిరోజూ విద్యార్థులకు ముఖ్యమైన విలువైన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. పిల్లలు, యువతలో విశ్లేషణాత్మక ఆలోచన,భాషా నైపుణ్యాలు,విస్తృత జ్ఞానాన్ని పెంపొందించడానికి పుస్తకాలు అత్యంత శక్తివంతమైన సాధనాలని ఉద్ఘాటించారు. డిజిటల్ సమాచార సునామీ మధ్య, స్థిరమైన, లోతైన జ్ఞానాన్ని అందించే పుస్తక పఠనం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని ఫౌండేషన్ విజ్ఞప్తి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఫౌండేషన్ రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన పఠన సంస్కృతిని అందించి,వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు.



## ఈనెల 8న సదర్ సమ్మేళనం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈనెల 8న శనివారం సాయంత్రం 6 గంటలకు భువనగిరి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న సదర్ సమ్మేళన కార్యక్రమానికి జిల్లా యాదవ సంఘం నాయకులు యాదవ యువత ప్రతి ఒక్కరు యాదవ కుల బంధువులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు పుట్టా వీరేశం యాదవ్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట మండలంలో యాదవ సంఘం ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖ్యర్ల సతీష్ యాదవ్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ఘనంగా రెండో సారి నిర్వహించే సదరు సమ్మేళన కార్యక్రమానికి యాదవ కుల బంధువులు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీక్రిష్ణ యాదవ సంఘం నాయకులు గుండబోయిన సురేష్ యాదవ్, నక్కల చిరంజీవి యాదవ్, ఆవుశేటి రమేష్ యాదవ్, పర్వతం రంజిత్ యాదవ్, ఆఖిల బారతయాదవ మహాసభ యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు పసుల బాలయ్య యాదవ్, నియోజకవర్గం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గొడుగులు పంపిణీ



**ప్రజాపక్షం/నల్లగొండ(నకిరేకల్) :** మలిదశ తెలంగాణా ఉద్యమ నేత,ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు యార శ్రీను,లలిత దంపతుల ప్రథమ పుత్రుడు జన్మదినం సందర్భంగా గొడుగులు అందజేశారు. బుధవారం చందంపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి రోజు పాఠశాలకు వచ్చి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాథనోపాధ్యయులు కనుకుంట్ల నావిన్ రెడ్డి ,ఉపాధ్యాయులు వి బాలాజీ,ఆదిత్య, శ్రీహరి,తల్లి దండ్రులు,అంగన్వాడీ టీచర్ రమణ,గ్రామ పెద్దలు వెంకన్న, సురేష్ గుప్త పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ



**ప్రజాపక్షం/హాలియా:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి జీవితానికి ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని హాలియా ఎస్సై బండి సాయి ప్రశాంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మదారి గూడెం గ్రామంలో జూనియర్ కబడ్డీ బాల,బాలికల జిల్లా జట్టు ఎంపిక లో భాగంగా జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి ఎస్ఐ సాయి ప్రశాంత్ మాట్లాడారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల ఊబిలో కూరుకుపోతే యువతకు భవిష్యత్తు ఉండదని ఆయన చెప్పారు. మత్తు పదార్థాలు మనిషిని ఆకట్టుకుంటాయని వాటికి దూరంగా ఉండేందుకు యువత ఉన్నత లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. ఒక లక్ష్యం లేని జీవితం వృధా అని అందుకు తగ్గట్టుగా యువత మనిషి భవిష్యత్తుకు ఉపయోగపడే లక్ష్యాలను ఎంచుకొని దానికి అనుగుణంగా సాధన చేయాలని సూచించారు. ప్రధానంగా యువ క్రీడాకారులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే శారీరక ఫిట్నెస్ బాగుంటుందని దానివలన క్రీడల్లో రాణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చందంపేట ఎస్ఐ లోకేష్,జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భూలోకరావు,రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నాయకులు ముచ్చర్ల ఏడుకొండలు,జిల్లా కబడ్డీ కార్యదర్శి కర్తయ్య, జాయింట్ సెక్రెటరీ డోమినిక్,వీరాసింగ్,ఎడవల్లి రాంబాబు, ఎడవల్లి యల్లయ్య,కోచ్ అన్వర్ ఖాన్,ఉదయ రాజ్,సత్యనారాయణ పాల్గొన్నారు.

## 'చెకుముకి'తో విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి కె అశోక్ అన్నారు. జనవిజ్ఞాన వేధిక జిల్లా అధ్యక్షుడు గోళ్ళమూడి రమేష్ బాబుతో కలిసి చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను ఆయన తన ఛాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 7వ తేదీన పాఠశాల స్థాయి చెకుముకి పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 12వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్న ఈ పరీక్ష విజయవంతానికి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. గత సంవత్సరం నిర్వహించిన పోటీలలో రాణించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి తమ సత్తాచాటారని గుర్తు చేశారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వనమాల వెంకటేశ్వర్లు, తల్లాడ రామచంద్రయ్య, వల్లపట్ల దయానంద్, సోమ సురేష్, క్రాంతి కుమార్, సునీత, ఉపేందర్ పాల్గొన్నారు.



## యాదాద్రి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందడి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి క్షేత్రంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. స్వామి వారి క్షేత్రంలోని ఆలయ మాడా వీధులు పూర్తిగా కార్తీక పూజలు నిర్వహించే భక్తులతో పెద్ద ఎత్తున సందడిగా మారాయి. ఈ సందర్భంగా వ్రత మండపంలో భక్తులు సత్యనారాయణ స్వామికి పూజలు నిర్వహించారు. దీపారాధన మండపంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక పూజలు జరిపించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు, నిజాభిషేకం, కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పండగ నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి క్షేత్రానికి పోటెత్తారు. దీంతో ఆలయ మాడవీధులు, శివాలయం, వ్రత మండపాలు, కార్తీక దీపారాధన ప్రదేశాలు భక్తులతో కిటకిటలాడాయి.



## శ్రీచైతన్య పాఠశాలపై కఠిన చర్యలకు డిమాండ్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శ్రీచైతన్య పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదురుగా విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేపట్టి మాట్లాడారు. పాఠశాల సెలవు రోజులలో కూడా విద్యార్థులకు సెలవు ఇవ్వకుండా పాఠశాలను నడుపుతుందని అట్టి పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే గుర్తిం పు రద్దు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేశారు. ఎల్‌హెచ్‌పిఎస్ సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా రాజు నాయక్, బిసి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖిల్ పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మణిపూర్‌లో ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

**ఇంఫాల్ :** మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ జిల్లాలో భద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు మరణించిన తర్వాత, సైన్యం ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని, ఆ ప్రాంతంలో నిషేధిత సంస్థ శిబిరాన్ని ధ్వంసం చేసిందని బుధవారం రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నిషేధిత యునైటెడ్ కుకి నేషనల్ ఆర్మీ (యుకెఎన్ఎ)కి చెందిన సాయుధ దళాల ఉనికి గురించి సమాచారం ఆధారంగా, మంగళవారం జిల్లాలోని హెంగ్లెప్ సబ్‌డివిజన్ పరిధిలోని ఖాన్పి గ్రామంలో ఆపరేషన్‌లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. స్పియర్ కార్ప్స్ సిబ్బంది చేసిన ఆపరేషన్‌లో ఎకె56, ఎంఎ4 ఎంకె II రైఫిల్, మందుగుండు సామగ్రి, యుద్ధ సామగ్రి నిల్వలు సహా నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని ప్రకటన తెలిపింది. యుకెఎన్ఎ శిబిరం కూడా ధ్వంసమైంది, అదనపు ఆయుధాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆ ప్రకటన తెలిపింది.

# ఓటు చోరీతోనే బిహార్‌లో ఎన్‌డిఏ ప్రభుత్వ ఏర్పాటు..

ప్రస్తుతం దేశంలో బ్రిటిష్ రాజ్‌ను పోలిన పరిస్థితి
భవిష్యత్తులో ఎన్నికలు అనుమానమే : ప్రియాంకగాంధీ



**బెట్టియా :** బిహార్‌లో ఎన్‌డిఎ కూటమి 'ఓటు చోరీ' ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చూస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు సహా 65 లక్షల మంది పేర్లను ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితా నుండి తొలగించారన్నారు. తమ 20 ఏళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారనే విషయం తెలిసినందున ఎన్‌డిఎ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శించారు. బుధవారం పశ్చిమ చంపారన్ జిల్లాలోని వాల్మీకి నగర్, చన్పాటియాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీల వేదికలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత పరిస్థితి బ్రిటిష్ రాజ్‌ను పోలి ఉందని, భవిష్యత్తులో దేశం ఎన్నికలు జరుగుతాయో లేదో అనే అనుమానం కలుగుతుందన్నారు. తన సోదరుడు రాహుల్‌గాంధీ హర్యానాలో 'ఓటు దొంగతనం' గురించి వివరణ ఇచ్చారని ఆమె చెప్పారు. 2024లో ఉత్తర రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేతిలో కాంగ్రెస్ ఓటమి పాలైందని, ఒక క్ర మ పద్ధతిలో అవకతవకలు జరిగాయని రాహుల్ వ్యాఖ్యలు చేసినట్లు ప్రియాంకా పేర్కొంటూ 'ఎన్‌డిఎ ప్రతిదీ నాశనం చేస్తుంది... భవిష్యత్తులో ఎన్నికలు జరుగుతాయో లేదో స్ప ష్టంగా లేదు... మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? వారిని అధికారం నుండి తరిమికొట్టండి' అని ర్యాలీలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపైనా తీవ్రంగా మండిపడ్డారు. నేరాలు, అవినీతిని నియంత్రించడం, యువతకు ఉపాధి కల్పించడం కంటే కాంగ్రెస్ పోస్టర్‌లో ఆర్‌జెడి నాయకుడు, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ ఫోటో లేకపోవడం పట్ల ఆ యన ఎక్కువ ఆందోళన చెందుతున్నట్లు కనిపిస్తోందని ఆమె అన్నారు. అయితే, మోదీ స్వయంగా రాజకీయ ర్యాలీ ల వేదికలపై బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను తనతో పాటు తీసుకెళ్లలేదని ఆమె పేర్కొన్నారు. బిహార్ యువత కంటే రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ భవిష్యత్తు గురించి ఎన్‌డిఎ ఎక్కువ ఆందోళన చెందుతున్నట్లు కనిపిస్తుందని వాద్రా వ్యంగ్యంగా అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే బిహార్ ప్రజలు రూ. 25 లక్షల వరకు ఉచిత చికిత్స పొందుతారని చెప్పారు. 'పేద కుటుంబానికి కనీసం ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి మేము మా వంతు ప్రయత్నం చేస్తాము... వివిధ విభాగాలలో లక్షలాది ఖాళీలను భర్తీ చేస్తాము' అని ఆమె అన్నారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో అన్ని కర్మాగారాలు ఏర్పాటు చేయబడుతున్నాయని వాద్రా పేర్కొన్నారు. ఎన్‌డిఎ ఉద్దేశాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలని, కార్పొరేట్‌లకు భూమి, వనరులను అప్పగించే వారు ఎప్పటికీ పేదల కోసం పనిచేయరన్నారు. మోదీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అంబానీ, అదానీ కోసం పనిచేస్తుందిదని, ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు తిరిగి వస్తుందని ఆమె ఆరోపించారు. పన్నులు, వ్యవసాయంలో అధిక ఇన్‌పుట్ ఖర్చు కారణంగా బిహార్ రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోలేకపోయారని ఆమె ఆరోపించారు. మోదీ సామ్రాజ్యంలో రైతులకు ఎంఎస్‌పి లభించదని, వారు తమ జీవితాంతం రుణాలు చెల్లించడంలోనే గడుపుతారని, అయితే కొంత మంది వ్యాపారవేత్తల అప్పులు మాఫీ చేయబడుతాయన్నారు. బిహార్‌లో అధిక నిరుద్యోగిత రేటు పని కోసం యువత రాష్ట్రం నుండి బయటకు వలస వెళ్లేలా చేస్తోందని ప్రియాంక అన్నారు. ఇండియా కూటమి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, ప్రతి పేద కుటుంబానికి ఇల్లు లేదా 3.5 దశాంశాల భూమిని అందిస్తుందని, ఆస్తుల రిజిస్ట్రేషన్ మహిళల పేర్లతో ఉంటుందని ఆమె అన్నారు. ఉపాధిహామీ కింద పని దినాల సంఖ్య రెట్టింపు అవితాయని, పాత పెన్షన్ పథకాన్ని తిరిగి ప్రవేశపెడతామని వాద్రా చెప్పారు. 'ప్రజల సమస్యలను వినే సహన ప్రభుత్వం అవసరాన్ని నొక్కి చెబుతూ ఆమె తన దివంగత తండ్రి రాజీవ్ గాంధీతో కలిసి యుపిలోని అమేథి అసెంబ్లీ స్థానంలోని ఒక గ్రామానికి వెళ్ళినప్పుడు, ఒక మహిళ మాజీ ప్రధానిని కుళాయి నీటి కనెక్షన్ ఇవ్వనందుకు తిట్టినప్పుడు జరిగిన ఘటనను ఆమె గుర్తు చేసుకున్నారు. ఆయన ఆ విషయాన్ని ఓపికగా, మర్యాదగా పరిష్కరించారన్నారు.

# ఆర్మీని రాజకీయాల్లోకి లాగొద్దు

### రాహుల్ గాంధీకి రాజ్‌నాథ్ హితవు



**జముయ్/బంకా :** భారత సైన్యాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి లాగొద్దని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. సైనికులకు ఒకే మతం ఉందని, అదే సైన్య ధర్మమని అన్నారు. దేశం సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడల్లా, సైనికులు ధైర్యం, శౌర్యం ప్రదర్శించి భారత్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భారత సైన్యం అగ్రవర్ణాల గుప్పిట్లో ఉందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు రాజ్‌నాథ్ స్పందించారు. 'దేశంలో రిజర్వేషన్ ఉండాలి. బిజెపి కూడా రిజర్వేషన్లకు మద్దతు ఇస్తుంది. పేదలకు రిజర్వేషన్లు ఇచ్చాం. కానీ మన సైనిక సైనికులకు ఒకే మతం ఉంది. ఆ మతం సైన్య ధర్మం. ఇది తప్ప వేరే మతం లేదు. మన సైన్యాన్ని రాజకీయాల్లోకి లాగకండి. కుల, మత రాజకీయాలు దేశానికి చాలా హాని కలిగించాయి. సమాజంలోని అన్ని వర్గాలను అండగా ఉండాలనేది మా ఆలోచన. కులం, తెగ లేదా మతం ఆధారంగా వివక్ష చూపడం మాకు ఇష్టం లేదు. మన దేశంలోని రుషులు, ప్రజలు కులమతాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు' అని బిహార్‌లోని బంకాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. సాయుధ దళాల్లో రిజర్వేషన్లు డిమాండ్ చేయడం ద్వారా దేశంలో అరాచకత్వాన్ని సృష్టించడానికి రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని రాజ్‌నాథ్ మండిపడ్డారు. బిహార్ ఎన్నికల ప్రచార సమయంలో రాహుల్ ఇటీవల చెరువులో దూకి చేపలు పట్టడంపైనా రాజ్‌నాథ్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నాయకుడికి చెరువులోకి దూకడం తప్ప వేరే మార్గం లేదని ఎద్దేవా చేశారు. దేశాన్ని నడపడం పిల్లల ఆట కాదని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్‌లోని ప్రధాన ఉగ్రవాద స్థావరాలను తుదముట్టించామని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, కాస్త విరామం ఇచ్చామన్నారు.

### రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ :రాజ్‌నాథ్

ఇటీవలే బిహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత సైన్యం దేశ జనాభాలోని 10శాతం మంది నియంత్రణలో ఉందని ఆరోపించారు. దేశ జనాభాలో 90శాతం మంది దళితులు, మహాదళితులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు వంటి అట్టడుగు వర్గాలకు చెందినవారు ఉన్నప్పటికీ, వారు కార్పొరేట్, బ్యూరోక్రసీ, న్యాయవ్యవస్థ, ఇతర కీలక సంస్థలలో తక్కువ ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోని బ్యాంకుల్లో ఉన్న డబ్బు అంతా 10 శాతం మంది ఖాతాల్లోకి వెళ్తుందన్నారు. అన్ని ఉద్యోగాలను వారే పొందుతున్నారన్నారు. బ్యూరోక్రసీ, న్యాయవ్యవస్థలో కూడా వారిదే ఆధిపత్యమని అన్నారు. సైన్యంపై కూడా వారి నియంత్రణలోనే ఉందన్నారు. ఈ క్రమంలో రాహుల్‌కు కౌంటర్ వేశారు రాజ్‌నాథ్ సింగ్. భద్రతా దళాల్లో రిజర్వేషన్లు డిమాండ చేస్తూ రాహుల్ గాంధీ అరాచకత్వాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

# భారీ ఎన్నికల మోసం బహిర్గతం

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, జైరాం రమేశ్

**న్యూఢిల్లీ :** భారతదేశంలోనే అతిపెద్ద ఎన్నికల మోసాన్ని రాహుల్ గాంధీ బయటపెట్టారని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. ఎన్నికల కమిషన్‌ను విమర్శిస్తూ ద్వేషపూరిత ప్రసంగాలపై నిద్రలో ఉండే ఎన్నికల సంస్థ అకస్మాత్తుగా ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్లను తొలగించడంలో, నకిలీ ఓటర్లను జోడించడంలో చురుకుగా మారుతుందని విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ బుధవారం 'ఎక్స్'లో ఈ మేరకు పోస్టు పెట్టారు. ఓటర్ల జాబితా సవరణ వాస్తవానికి 'ఓట్ల దొంగతనం' అని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం హర్యానా అసెంబ్లీ ఎన్నికలు 'దొంగిలించబడ్డాయి' అని గాంధీ పేర్కొన్న తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మోదీషా మోడల్ స్పష్టంగా ఉంది: ప్రజా మద్దతు రానప్పుడు ఓటరు జాబితా మార్చండి' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఇది ఓటర్ల జాబితా సవరణ కాదని, ఇది ఓట్ల దొంగతనమని తెలిపారు.

# బిహార్‌లో జెడి(యు)నాయకుడి ఇంట్లో మృతదేహాలు గుర్తింపు

### అన్నయ్య, అతని భార్య, కుమార్తె

**పూర్ణియా (బీహార్) :** బిహార్‌లోని పూర్ణియా జిల్లాలోని జెడి(యు) నాయకుడి నివాసంలో అన్నయ్య, అతని భార్య, కుమార్తె చనిపోయారని పోలీసులు బుధవారం తెలిపారు. కేహాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యూరోపియన్ కాలనీలోని వారి ఇంటి నుంచి మంగళవారం రాత్రి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మరణించిన వారిని నవీన్ కుష్వాహా, అతని భార్య మాలా దేవి, కుమార్తె తను ప్రియగా గుర్తించినట్లు పూర్ణియా సదర్ సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డిపిఒ) జ్యోతి శంకర్ తెలిపారు. నివాసితుల ప్రకారం, నవీన్ స్థానిక జెడి(యు) నాయకుడు నీరంజన్ కుష్వాహా అన్నయ్య అని ఆయన అన్నారు. ఇంట్లో మృతదేహాలు దొరికాయని సమాచారం అందిన వెంటనే, ఒక పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది. మరణానికి ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్షలకు పంపారు అని ఎస్‌డిపిఒ తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలం నుండి ఆధారాలు సేకరిస్తున్నారని, దర్యాప్తు జరుగుతోందని ఆయన అన్నారు. నవీన్ కుష్వాహా ఈ ప్రాంతంలో బాగా ప్రాచుర్యం పొందాడని, అతను గతంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశాడని స్థానికులు పేర్కొన్నారని మరొక అధికారి తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు కొందరు, తను ప్రియ తమ ఇంట్లోని మెట్ల మీద నుండి పడి మరణించినట్లు కనిపిస్తోందని ఆయన అన్నారు. తన కుమార్తెను రక్షించే ప్రయత్నంలో ఆమె తండ్రి మెట్లపై నుండి పడి మరణించాడని కూడా వారు అనుమానిస్తున్నారు. మరణ వార్త విన్న తర్వాత గుండెపోటుతో మరణించారని స్థానిక పోలీసు అధికారి తెలిపారు. పోలీసులు కేసును అన్ని కోణాల నుండి దర్యాప్తు చేస్తున్నారని ఆయన అన్నారు.

# అమెరికాకు చైనా ఉపశమనం

**బీజింగ్:** అమెరికా వస్తువులపై అదనంగా విధించిన 24 శాతం సుంకాల రద్దు కాలాన్ని పొడిగిస్తున్నట్లు చైనా ప్రకటించింది. ఏడాది పాటు మినహాయింపు ఇవ్వడంతో 10 శాతం సుంకాన్నే అమెరికా చెల్లించాల్సి ఉంటుంది. నవంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. అమెరికాచైనా అధ్యక్షుడు దక్షిణ కొరియా వేదికగా భేటీ అయిన క్రమంలో తాజా పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఫెంటనైల్ పేరుతో చైనాపై 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. మొత్తం విధించిన సుంకం 57శాతం నుంచి 47శాతానికి తగ్గింది. అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను పునరుద్ధరించేందుకు చైనా అంగీకరించింది. చైనా నుంచి అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఇబ్బంది ఉండదని ట్రంప్ వెల్లడించారు. ట్రంప్‌జిన్‌పింగ్ భేటీ క్రమంలో వాణిజ్య ఒప్పందం కుదరనున్నట్లు రెండు దేశాల అధికార వర్గాలు సంకేతాలిచ్చాయి.

### భారత్‌కు సహాయం...

ఢిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్న నేపథ్యంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా సిద్ధంగా ఉందని భారత్‌లోని చైనా దౌత్యకార్యాలయం అధికారి యూజింగ్ వెల్లడించారు. ఒకప్పుడు చైనా కూడా ఇలాంటి సమస్యతో ఇబ్బంది పడిందని, తమ అనుభవాలను భారత్‌తో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్ త్వరలోనే ఈ సమస్య నుంచి బయట పడగలదని ఆకాంక్షించారు. గతంలో చైనా రాజధాని బీజింగ్‌తో పాటు అనేక నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం ప్రపంచ రికార్డులు సృష్టించింది. గాలి నాణ్యత ప్రమాణాలను (ఏక్యూఐ) నిర్దేశించి చైనా ప్రభుత్వం నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది. దీనివల్ల నగరాల్లో గాలి నాణ్యత మెరుగైంది. స్వచ్ఛత చేకూరింది. భారత్‌లోనూ వాయు కాలుష్య నియంత్రణకు చైనా తరహా కఠిన చర్యలు అనుసరణీయమన్న అభిప్రాయం నిపుణుల నుంచి వ్యక్తమవుతోంది. చైనాను ఆదర్శకంగా తీసుకొని దేశ పరిస్థితులకు, సవాళ్లకు అనుగుణమైన విధానాన్ని అమలు చేయాలన్న సూచనలు అందుతున్నాయి.

# రేపు నిసార్ పని ప్రారంభం: ఇస్రో





**బెంగళూరు:** ఇస్రో మరో కీలక కార్యక్రమాన్ని ప్రకటించింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాతో కలిసి అభివృద్ధి చేసిన నిసార్ ఉపగ్రహం శుక్రవారం నుంచి పని ప్రారంభిస్తున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చైర్మన్ నారాయణన్ వెల్లడించారు. నాసాఇస్రో సింథటిక్ అపెర్చర్ రేడార్ (నిసార్) అత్యంత ఖరీదైన భూ పరిశీలన ఉపగ్రహం. భూమిపై మంచు కేంద్రాలను ప్రతి 12 రోజులకు రెండు సార్లు పర్యవేక్షించే సామర్థ్యం దీని సొంతం. మొత్తం 2,400 కేజీల నిసార్ ఉపగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా జులై 30న ఇస్రో ప్రయోగించింది. డేటా సమీకరణ పూర్తి కావడంతో ఈనెల 7న నిసార్ శాటిలైట్ ఆపరేషనల్ కాబోతోందని ప్రకటించనున్నట్లు నారాయణన్ వెల్లడించారు. ఆయన బుధవారం ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఈఎస్‌టీఐసీ)లో ఈ వివరాలు తెలిపారు. రెండు సార్ వ్యవస్థలు... ఎల్ బ్యాండ్ఎస్ బ్యాండ్ సెన్సార్లను మోసుకెళ్లిన తొలి మిషన్ నిసార్ అని అన్నారు. ఎల్ బ్యాండ్ రేడార్ అడవి నేలల్లో తేమను గుర్తించగలదు. జీవ రాశులు, భూమిమంచు ఉపరితలాల కదలికలను కొలవగలదు. ఎస్ బ్యాండ్ రేడార్ కొన్ని రకాల వ్యవసాయం, గడ్డి భూముల పర్యావరణ వ్యవస్థలు, మంచులోని తేమను గమనించగలదు. ఈ రెండు వ్యవస్థలు మేఘాలు, హిమపాతం ఆధారంగా డేటాను సేకరించగలవు. నిసార్ అందించే డేటా అసాధారణమైందని, ఈ ఉపగ్రహంతో చాలా ఉపయోగాలు ఉన్నాయని నారాయణన్ తెలిపారు. అలాగే, గగన్‌యాన్ మిషన్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, వచ్చే ఏడాది జనవరిలో దీనిని ప్రయోగిస్తామన్నారు. 2027లో దేశీయంగా తయారు చేసిన రాకెట్‌లో వ్యోమగాములను పంపే లక్ష్యంతో ఈ మిషన్ కోసం 8వేలకుపైగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. భూమి చుట్టూ తిరగడం కోసం వ్యోమగాములను పంపడానికి ముందు మూడు మానవరహిత మిషన్లను ఇస్రో చేపడుతుందని నారాయణన్ అన్నారు. 2028 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం మొదటి మాడ్యూల్ ప్రయోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. 2035 నాటికి ఫై మాడ్యూల్ ఆర్బిటల్ ల్యాబ్ పనులు పూర్తి చేస్తామని నారాయణన్ చెప్పారు.

# షట్‌డౌన్ కారణం : ట్రంప్ వ్యాఖ్య

**వాషింగ్టన్:** బుధవారం జరిగిన కీలకమైన ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ పరాజయం పొందడానికి అమెరికాలో 36 రోజులుగా కొనసాగుతున్న షట్‌డౌన్ కారణమని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ట్రంప్ ఎన్నికల్లో పాల్గొనకపోవడం ఒక కారణమైతే, షట్‌డౌన్ సమస్య కూడా రిపబ్లికన్ల ఓటమికి రెండో కారణమని ఎన్నికల విశ్లేషకులు వ్యాఖ్యానించారు. ఫలితాలు వెలువడిన కొద్దిసేపటికే ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా స్పందిస్తూ విశ్లేషకుల వ్యాఖ్యలను పోస్టు చేశారు. పార్టీలో కొందరు మాత్రం అభ్యర్థుల ఎంపికలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని విమర్శించగా, మరికొందరు రిపబ్లికన్లు దేశంలో పెరుగుతున్న జీవన వ్యయాలను, ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాలిఫోర్నియాలో భారీ స్కామ్ జరిగింది, ఓటింగ్ ప్రక్రియలో రిగ్గింగ్ జరిగింది అని ట్రంప్ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ''మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్'' అనే నినాదంతో అన్ని దేశాలపై విపరీతంగా సుంకాలు పెంచడంతో పాటు స్వదేశంలో ఉద్యోగాల్లో కోతలు విధించడం, ప్రాణాంతకమైన వలస విధానాన్ని ముందుకు తీసుకురావడంద్వారా దేశాన్ని అతలాకుతలం చేయడం, పొరుగున కెనడాతోపాటు బ్రెజిల్‌తో సంబంధాల విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం, డాడ్జ్ విధానం తీసుకురావడం, అంతర్జాతీయ ఫండ్స్‌లో కోత పెట్టడం, ట్రంప్ విధానాలవల్ల జీవన వ్యయాలు పెరిగిపోవడం, సరుకుల ధరలు పెరుగుదలతోసహా అనేక విషయాల్లో తరచు ఆయన అనేక కోర్టు కేసులు ఎదుర్కోవడం, రాష్ట్రాలలో ఫెడరల్ సైన్యాన్ని మోహరించే ప్రయత్నాలు చేసి వ్యతిరేకత తెచ్చుకోవడం ట్రంప్‌కు మైనస్‌లుగా మారాయి. ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది.

### 36వ రోజుకు చేరిన షట్‌డౌన్

అమెరికా చరిత్రలో ఎన్నడూలేనివిధంగా షట్‌డౌన్ బుధవారంనాటికి 36వ రోజుకు చేరుకుంది. 2019లో ఫడింగ్‌కు సంబంధించిన బిల్లుల ఆమోదంలో వైఫల్యంవల్ల 35 రోజులు షట్‌డౌన్ అమలుకాగా ఇప్పుడు తాజా షట్‌డౌన్ ఆ రికార్డును అధిగమించింది. మంగళవారం రాత్రి కూడా సెనేట్ వరుసగా 14వ సారి ఫండింగ్ బిల్లులను ఆమోదించడంలో విఫలమైంది. 54–44 ఓట్లతో బిల్లు వీగిపోయింది. దీంతో చరిత్రలో ఇప్పటివరకూ జరిగిన షట్‌డౌన్ రికార్డులన్నింటినీ ప్రస్తుత షట్‌డౌన్ కాల పరిమితి అధిగమించింది. ఈ ఎన్నికల తర్వాత సమస్య పరిష్కారం కాగలదని కొందరు రిపబ్లికన్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

# హాస్టల్ టాయిలెట్‌లో కెమెరాలు

### రెండువేల మంది మహిళల ఆందోళన

**బెంగళూరు:** మహిళల వసతి గృహం టాయిలెట్‌లో రహస్య కెమెరాలు అమర్చిన ఘటన కలకలం సృష్టించింది. మంగళవారం రాత్రి ఒక టాయిలెట్‌లో వాటిని గుర్తించిన మహిళలు ఆందోళనకు దిగారు. తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. ఈ ప్రాంతం కర్నాటకకు సమీపంలో ఉంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఒక ప్రముఖ సంస్థ తమ ఉద్యోగుల కోసం వసతి గృహాన్ని నిర్వహిస్తోంది. అక్కడే ఉంటున్న ఒడిశాకు చెందిన ఒక మహిళా ఉద్యోగి ఈ కెమెరాలు అమర్చింది. రహస్యంగా వీడియోలు చిత్రీకరిస్తోంది. ఆ హాస్టల్‌లోనే ఉంటున్న మరో మహిళకు ఆమె కదలికలపై అనుమానం వచ్చింది. తన అనుమానాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లింది. వారు వెతకడంతో ఈ కెమెరాల గుట్టు బయటపడింది. ఈ విషయం బయటికి పొక్కడంతో తీవ్ర కలకలం రేగింది. అక్కడ వసతి పొందుతున్న సుమారు రెండువేల మంది మహిళలు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితురాలిని అరెస్టు చేశారు.

# కార్గో విమానం కూలి ముగ్గురు దుర్మరణం

**వాషింగ్టన్:** అమెరికాలోని లూయిస్‌విల్లేలో విమాన ప్రమాదం జరిగింది. మెక్‌డోనెల్ డగ్లస్ ఎండీ11 రకానికి చెందిన యూపీఎస్ కార్గో విమానం టేకాఫ్ అవుతుండగానే కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. యూపీఎస్ ఫ్లైట్ నంబర్ 2976 విమానం హోనులులుకు సాయంత్రం 5.15 గంటలకు (అమెరికా కాలమానం) బయల్దేరింది. నిమిషాల వ్యవధిలోనే ప్రమాదానికి గురైంది. దీనిని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ధ్రువీకరించింది. ఒ క్కసారిగా మంటలు రావడంతో విమానం కూలిపోయింది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమంలో వైరయ్యాయి.

# ఎన్నికల వేళ బిహార్‌లో 'స్టింగ్' కలకలం

### ఇది బిజెపి నేతల నిజరూపం: ఆర్‌జెడి

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైన తరుణంలో ఓ స్టింగ్ ఆపరేషన్ సంచలనంగా మారింది. హిందీ వార్తా సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. బిహార్ దుష్ట రాజకీయ నేతల నిజ స్వరూపానికి వార్తానివేదిక అద్దంపట్టింది. నాయకుల కోసం అమ్మాయిల సరఫరా గురించి బిజెపి మహిళా నేత సంభాషణకు సంబంధించిన వీడియోను ఎక్స్ మాధ్యమంగా ఆర్‌జెడి జాతీయ అధికార ప్రతినిధి కాంచన యాదవ్ పంచుకున్నారు. వార్తా నివేదిక బయట పెట్టినది కనీసం రాయలేకపోతున్నా అంటూ పోస్టు పెట్టారు. 'బిజెపి నాయకుల ఎత్తులుజిత్తులు, వారి వ్యక్తిత్వం, నిజ రూపం బహిర్గతమైంది. మహిళలంటే వారికి ఎంత గౌరవమో ఈ వీడియో క్లిప్‌తో స్పష్టమవుతున్నది' అంటూ ఆమె విమర్శలు గుప్పించారు. 'నాయకుల ఇష్టాయిష్టాలు నాకు తెలుసు. వాళ్లకు అందమైన అమ్మాయిలు కావాలి. కొందరికి ఒకరు, మరికొందరికి ఇద్దరు అవసరం. కొన్నిసార్లు ఇద్దరు నాయకులు ఒకే అమ్మాయిని కోరుకుంటారు. ఇంకొందరు డబ్బు చెల్లిస్తారు కానీ శృంగారంలో పాల్గొనరు. అందుకోసమే ఎవరికి ఎలాంటి అమ్మాయి ఇష్టమో గమనంలో ఉంచుకొని సరఫరా చేస్తాం. మీరు అభ్యర్థులను ఏర్పాటు చేయండి. హైప్రొఫైల్ అమ్మాయిలను పంపడం మా బాధ్యత. బీహార్ ఎన్నికల కోసం అధిష్ఠానం పెద్ద బాధ్యతే అప్పగించింది. దీంతో పని సులభమవుతుంది. మాకు అన్ని చోట్ల పలుకుబడి ఉంది. అన్ని పార్టీల్లో మనవాళ్లు ఉన్నారు. నా వైపు నుంచి మీకు పూర్తి హామీ ఉంటుంది. మనల్ని ప్రశ్నించేవారెవరూ ఉండరు. పార్టీ ఎమ్మెల్యేలకూ దీని గురించి తెలుసు. ప్రశ్నించే ధైర్యం ఎవరికి లేదు. నేనేమీ సామాన్య నేతను కాదు. నాకు చాలా మంది బడా నాయకులతో పరిచయం ఉంది' అంటూ ఆ వీడియోలో మహిళా నేత సంభాషణ సాగింది. ఆమెను బిజెపి నాయకురాలు ఫూల్ జోషిగా గుర్తించారు. ఆమె జార్ఖండ్‌లోని పార్టీ ఎస్‌సీ మోర్చా మంత్రి. అధిష్ఠానం ఆదేశాలతో బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం 'జై బిజెపి, విజయ్ బిజెపి' పేరిట ప్రచారం చేస్తున్నారు.

# కాలుష్య నియంత్రణకు సాయం చేస్తాం

### భారత్‌కు చైనా హామీ



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని నగరం ఢిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. రెండు వారాలుగా గాలి నాణ్యత బాగా క్షీణించింది. అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 దాటిపోయిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) గణాంకాలు వెల్లడించాయి. ఈ సమయంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా ముందుకువచ్చింది. ఈ మేరకు భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'చైనా ఒకప్పుడు తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడింది. అలాం టి సమస్యను ఎదుర్కొంటున్నవారితో మా ప్రయాణాన్ని పంచుకోవడానికి సి ద్ధంగా ఉన్నాం. భారత్ త్వరలో ఆ పరిస్థితి నుంచి బయటపడుతుందని విశ్వసిస్తున్నాం' అని యూజింగ్ పేర్కొన్నారు. పొగమంచుతో తీవ్రంగా ఇబ్బందిపడిన చైనా... గాలి నాణ్యతను మెరుగుపర్చుకొనే క్రమంలో గణనీయమైన విజయాలు సాధించింది. గతంలో చైనాలో కూడా రాజధాని బీజింగ్‌తో పాటు ప లు నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం ప్రపంచ రికార్డులు సృష్టించిం ది. ప్రభుత్వం వెంటనే మేల్కొని గట్టి నియంత్రణ చర్యలు తీసుకోవడంతో చై నా మహానగరాల్లో కాలుష్య మేఘాలు చెదిరిపోయాయి. చైనా గాలి నాణ్యత ప్రమాణాలను (ఏక్యూఐ) నిర్దేశించి నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘి స్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది. దీనివల్ల నగరాల్లో శుభ్రమైన గాలి వీస్తోంది. ఇండియా కూడా వాయు కాలుష్య నియంత్రణకు ఇదేస్థాయి లో కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితి మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

# వారంలో 50 మంది మృత్యువాత

### దేశంలో వరుస ఘోర విషాదాలు

**న్యూఢిల్లీ:** గతవారం భారతదేశం అనేక పెద్ద ప్రమాదాలను, ఘోర విషాదాలను చవిచూసింది. దేశవ్యాప్తంగా ఈ వారం రోజుల్లో దాదాపు 50 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరిగిన ఘోర ప్రమాదాలు ఎంతో మంది ప్రాణాలను బలిగొన్నాయి. రోడ్డు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, దేవాలయాల్లో తొక్కిసలాటలు ఈ ప్రమాదాలకు కారణాలుగా నిలిచాయి. నవంబర్ 1వ తేదీన కార్తీక మాస ఏకాదశి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఏకాదశికి తోడు శనివారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆ రోజు ఆలయానికి రెండు వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తే... ఏకంగా 15 వేల మందికి పైగా వచ్చారు. ఆ తొక్కిసలాటలో 9 మంది మరణించగా, 25 మందికి పైగా గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో అక్టోబర్ 24న జరిగిన స్లీపర్ బస్సు ప్రమాదంలో 19 మంది మరణించారు. నవంబర్ 3వ తేదీన రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం దేశం మొత్తాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. 72 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 20 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ సమీపంలో మంగళవారం (నవంబర్ 4) సాయంత్రం ఘోర రైలు ప్రమాదం జరిగింది. గెవ్రా రోడ్ నుంచి బిలాస్‌పూర్ వైపు వస్తున్న లోకల్ రైలు, గూడ్స్ రైలును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 11 మంది మరణించారు. 20 మందికి పైగా గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్ చునార్ జంక్షన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం (నవంబర్ 5) నదీ స్నానానికి వెళ్లేందు కు రైలు దిగిన కొందరు భక్తులు స్టేషన్ నుంచి బయటకు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మతిచెందగా... పలువురికి గాయాలయ్యాయి. నవంబర్ 3న రాజస్థాన్‌లోని జైపూర్‌లో అదుపుతప్పిన టిప్పర్ 3040 వాహనాలను బలంగా ఢీకొట్టింది.

ప్రజాపక్షం
గురువారం, 06 నవంబరు

# వైట్‌హౌస్ ఒత్తిళ్లకు తలవంచిన భారత్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు సందర్భాల్లో చేసిన.. చేస్తున్న వ్యాఖ్యలు నిజమే. కాదని కేంద్రం ఎంతగా బుకాయిస్తున్నప్పటికీ, వాస్తవాలు ఒకొక్కటిగా బయటపడుతునే ఉన్నాయి. భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధం తన వల్లే నిలిచిపోయిందని ట్రంప్ పదేపదే ప్రకటిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందనేది ఇప్పుడు బయటపడుతున్నది. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గేది లేదని భీకర ప్రతిజ్ఞలు చేసిన మోదీ సర్కారు నేడు అమెరికా ఒత్తిళ్లకు తలవంచింది. వాషింగ్టన్ కొత్త ఆంక్షలు ఈనెల 21 నుంచి అమల్లోకి వస్తున్న నేపథ్యంలో, రష్యా నుంచి దిగుమతులను ఈనెలాఖరు నుంచి తగ్గించుకోనుంది. కొత్త ఆంక్షలను గౌరవిస్తూ, రష్యా నుండి నేరుగా కొనుగోళ్లను నిలిపివేయాలన్నది భారత రిఫైనరీల నిర్ణయం. దేశంలోకి దిగుమతి అవుతున్న చమురులో దాదాపు సగభాగం రష్యా నుంచే వస్తున్నది. అమెరికా అడ్డగోలుగా ఆంక్షలు విధించినప్పుడు, రష్యాయే భారత్‌కు అండగా నిలిచింది. చమురు ఉత్పత్తులను తక్కువ ధరకే సరఫరా చేసింది. ఆదుకుంది. కానీ, భారత్ మాత్రం స్నేహధర్మాన్ని పాటించడం లేదు. అగ్రరాజ్యం బెదిరింపులకు దీటైన సమాధానం ఇవ్వలేదు. అమెరికా ఆంక్షలు రష్యా ప్రభుత్వ చమురు కంపెనీలు రోస్నెఫ్ట్, లుకాయిల్‌పై ప్రభావం చూపిస్తాయన్న పేరుతో, 'కొనుగోళ్ల క్రమబద్ధీకరణ' పాచిక విసిరింది. భవిష్యత్తులో రష్యా చమురు దిగుమతులను నిలిపివేయనున్నట్టు మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్, హెచ్‌పిసిఎల్, మిత్తల్ ఎనర్జీ లిమిటెడ్ వంటి సంస్థలతో ప్రకటనలు చేయించింది! కేంద్రానికి తెలియకుండా, అనుమతి తీసుకోకుండా ఇంతటి కీలక నిర్ణయాలు వెలువడవు. రోస్నెఫ్ట్‌తో దీర్ఘకాల ఒప్పందాలు ఉన్నప్పటికీ, రష్యా చమురు కొనుగోళ్లను రిలయెన్స్ ఎందుకు నిలిపివేస్తున్నదనేది బహిరంగ రహస్యం. అక్టోబర్ నెలలోనూ భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురు సరఫరాలో అగ్రభాగం, సగటున రోజుకు 1.6 నుంచి 1.8 మిలియన్ బ్యారెల్స్ చమురు రష్యా నుంచే వచ్చింది. రష్యా చమురుపై అమెరికా కొత్త ఆంక్షలు ప్రకటించిన తర్వాత దిగుమతులు తగ్గుతున్నాయి. ఈ నెలాఖరుకు 'తగ్గుదల' కనీస స్థాయికి పతనం కావడం ఖాయంగా కనిపిస్తున్నది. నిజానికి, ఎన్నో రంగాల్లో భారత్‌కు రష్యా సాయం చేస్తున్నది. అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలిచింది. పైగా రెండు దేశాల మధ్య దశాబ్దాలుగా వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఇప్పుడు అవి ప్రమాదంలో పడ్డాయి. భారత్ ఎవరికీ తలవంచదని, రష్యా నుంచి చమురు దిగుమతులపై తమను ఎవరూ శాసించలేరని ప్రధాని నరేంద్ర మోదీ గొప్పగా ప్రకటించి రెండు వారాలు కూడా కాలేదు... భజనపరులు కేంద్ర సర్కారు ఘనతను కీర్తించడం ఇంకా మాననేలేదు... చమురు కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం కొత్త పల్లవి ఎత్తుకుంది. రష్యాపై అమెరికా విధించిన ఆంక్షలు ఇంకా అమల్లోకి రాకముందే, రంగులు మార్చేసింది. రష్యా నుంచి చమురును పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాదు. అవసరమైతే, మరోసారి రష్యాను మచ్చిక చేసుకోవడానికి వీలుగా నామమాత్రపు దిగుమతులు కొనసాగుతాయి. ప్రత్యక్ష కొనుగోళ్లు తగ్గినా, మధ్యవర్తుల ద్వారా రష్యా చమురు భారత్ చేరుతుందనే వాదన మరింత సిగ్గుచేటు. ఈ లావాదేవీలు మధ్యవర్తులకు లాభాల పంట పండిస్తాయి. దేశం అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది. ఆ ప్రభావం అధిక ధరల రూపంలో ప్రజలపై పడుతుంది. ఎవరు ఎటు పోతేనేం...అమెరికా మాట వేదవాక్యం. రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించుకుంటామని భారత్ హామీ ఇచ్చినట్టు ట్రంప్ ప్రకటించారు. భారత్ ఆచరించింది. అమెరికా నుంచి దిగుమతులు ఇప్పటికే భారీగా పెరిగాయి. క్రమంగా భారత చమురు మార్కెట్‌ను అమెరికా ఆక్రమిస్తుంది, శాసిస్తుంది. వాస్తవానికి, అన్ని ప్రధాన దేశాలతో మెరుగైన ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్య లావాదేవీలు అత్యవసరం. ఇదే, చిరకాలంగా భారత్ అనుసరిస్తున్న విధానం. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం నేరుగా కొమ్ముకాయడం మొదలైన తర్వాత పరిస్థితులు మారాయి. ప్రభుత్వ నిర్ణయాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. అమెరికా పెత్తనం పెరిగింది. టారిఫ్‌ల నుంచి వీసాలవరకూ, అన్ని రకాలుగా వేధింపులు ఎదురవుతున్నా, అడిగే ధైర్యం లేదు. టారిఫ్‌పై చర్చలు ఎటూ తేలవు. ఏ రకంగా చూసినా, రష్యాతో మైత్రికి చరమగీతాలు. అంతుబట్టని మోదీ విధానాలు. రష్యా నుంచి చమురు కొనాలన్న నిబంధన ఏమీ లేదు. తప్పనిసరి కానేకాదు. అయితే, హఠాత్తుగా నిర్ణయాలు మార్చుకోవడం వల్లే అనుమానాలు. ఇది కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఎక్కడ చౌకగా లభిస్తే అక్కడ కొనుక్కోవటం వ్యాపార లక్షణం. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గి నిర్ణయాలు తీసుకుని దేశ ప్రజలపై భారం మోపటం క్షమించరానిది. ఎక్కడ చౌకగా లభిస్తే అక్కడ కొనుక్కోవటం వ్యాపార లక్షణం. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గి నిర్ణయాలు తీసుకుని దేశ ప్రజలపై భారం మోపటం క్షమించరానిది. ట్రంప్ చేసిన ప్రతి ప్రకటనా నిజమేనని రుజువయ్యే విధానాలు ప్రమాదకరం. దేశ సార్వభౌమత్వానికి విఘాతం. భారత ఆత్మగౌరవానికి శరాఘాతం.

# తెలంగాణ ప్రాంతానికి వరప్రదాయని ఆయిల్ పామ్

మొక్కలు నాటిన మూడు సంవత్సరాల తర్వాత గెలల కోత, 30 సంవత్సరాల వరకు దిగుబడి స్థిర ఆదాయం.

ప్రపంచంలోనే అత్యధిక దిగుబడినిచ్చే పంటలలో ఒకటి ఆయిల్ పామ్. ప్రపంచవ్యాప్తంగా వంటనూనెల వినియోగంలో 33 శాతం ఆయిల్ పామ్ ఉపయోగిస్తే, భారతదేశంలో 60 శాతంగా ఉంది. అందుకే ప్రతి సంవత్సరం ఇండోనేషియా, మలేషియా నుండి సుమారు పది మిలియన్ మెట్రిక్ టన్నుల దాకా ముడి పామాయిల్ ను విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చించి దిగుమతి చేసుకుంటున్నది. ముడి చమురు తర్వాత ఇది రెండవ అత్యధిక దిగుమతి.

ఆయిల్ పామ్ సగటు ఉత్పాదకత మిగతా నూనె పంటల కంటే ఎక్కువగా ఉండడం వలన మార్కెట్లో పామ్ ఆయిల్ తక్కువ ధరకు లభించటమే కాకుండా పోషక విలువలలో కూడా మిగతా నూనెల కంటే ఏ మాత్రం తీసిపోదు. దేశం మొత్తం పామాయిల్ వినియోగంలో 72 శాతం వరకు ఆహార సంబంధిత పరిశ్రమలలో వినియోగిస్తుండగా మిగిలిన 28 శాతాన్ని సౌందర్య ఉత్పత్తులు, ఔషధాల, జీవ ఇంధనం తయారీలో వాడుతున్నారు. నూనె గింజల పంటలలో కెల్లా ఆయిల్ పామ్ ఎక్కువ దిగుబడినిస్తుంది.

సాధారణంగా వరి సాగుకు నీటి ఆవశ్యకత ఎక్కువ కానీ ఒక ఎకరా వరి సాగుకు అవసరమైన నీటితో మూడు ఎకరాల దాకా ఆయిల్ పామ్ సాగు చేయవచ్చు. పైగా ఇది పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. వరికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పామ్ సాగు చేస్తే విద్యుత్ ఖర్చుపై కూడా ఆదా చేయవచ్చు. అంతేకాకుండా ఇతర పంటలతో పోల్చినప్పుడు ఆయిల్ పామ్ పంట యాజమాన్యం కూడా చాలా సులభతరంగా ఉండడమే కాకుండా ఖర్చు కూడా చాలా తక్కువ.



ఇతర పంటల మాదిరిగా కాకుండా ఒకసారి ఆయిల్ పామ్ సాగు చేస్తే 25 నుండి 30 సంవత్సరాలు , సంవత్సరానికి ఎకరాకు 1,20,000 రూపాయల దాకా ఆదాయం పొందవచ్చు. ఆయిల్ పామ్ తోటలలో తొలి మూడు సంవత్సరాలు అంతర్ పంటలు సాగు చేసి అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఈ పంట ఆయిల్ పామ్ యాక్ట్ 1993 పరిధిలోకి వస్తుంది. రైతులకు మార్కెటింగ్ ఇబ్బందులు కూడా తలెత్తవు. ఆయిల్ పామ్ చట్టం పరిధికి లోబడి కేటాయించబడిన కంపెనీలు గెలలు కొనుగోలు చేస్తాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కంపెనీలు గెలలు కొనుగోలు చేస్తాయి. అంతేకాకుండా 15 రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాకు జమ చేసే సదుపాయం ఒక్క ఆయిల్ పామ్ పంటకు మాత్రమే ఉంది.

ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో ఆయిల్ పామ్ సాగు అవకాశాలు అధ్యయనం చేయడానికి 1986 లో డాక్టర్ చద్దా ఆధ్వర్యంలో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 11 రాష్ట్రాలలో 14.375 లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనువైనవిగా గుర్తిస్తూ 1988 లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా చాలా రాష్ట్రాలలో ఆయిల్ పామ్ ను నీటి వసతి కింద సాగు చేయడం మొదలైంది. ఆ తర్వాత కాలంలో ఆయిల్ పామ్ సాగుపై రాష్ట్ర ప్రభుత్వాలు చూపించిన చొరవతో, కేంద్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు, నిపుణుల కమిటీతో కూడిన వివిధ కమిటీలు ఏర్పాటు చేశారు. 2012 వరకు ఈ కమిటీలు భారత దేశంలోని 19 రాష్ట్రాలలో 48.325 లక్షల ఎకరాలు నీటి వసతి కింద ఆయిల్ పామ్ సాగుకు అనువైనవిగా గుర్తించారు. ఇందులో తెలంగాణ ప్రాంతానికి చెందిన పూర్వపు ఖమ్మం, నల్లగొండ జిల్లాలు కూడా ఉన్నాయి. జాతీయ ఆయిల్ పామ్ పరిశోధన సంస్థ వారి విజన్ 2050 నివేదికను బట్టి చూస్తే 2050 నాటికి మన దేశ జనాభాకు అవసరమైన వంటనూనెలో 45 శాతం పామాయిల్ వాటా ఉంటుందని అంచనా. దేశం పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే అదనంగా సుమారు 70 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగు చేయవలసి ఉంటుందన్నది అధికారుల అంచనా. దేశంలో ప్రస్తుతం ఆయిల్ పామ్ 13.24 లక్షల ఎకరాలలో సాగులో ఉంది. పామాయిల్ దిగుమతులను పూర్తిగా తగ్గించుకొని ఇప్పుడు వెచ్చిస్తున్న విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయాలంటే ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం అధికారులు, శాస్త్రవేత్తలతో కూడిన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ 2019 నవంబర్ నెల 28 నుండి 30 తేదీలలో రాష్ట్రంలో పర్యటించి ఆయిల్ పామ్ సాగు అవకాశాలపై ఒక నివేదిక ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం వారు తెలంగాణ రాష్ట్రంలో 10.90 లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనువైనదిగా గుర్తించారు. తెలంగాణలోని అన్ని జిల్లాలు ఈ ఆయిల్ పామ్ సాగుకు అనువైనవిగా అనుమతించారు. దీనికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 31 జిల్లాలలో ఆయిల్ పామ్ చేపట్టేందుకు, సాగు విస్తరణ చేపట్టేందుకు 14 కంపెనీలకు అనుమతులు ఇచ్చారు. (మేడ్చల్ ,మల్కాజ్‌గిరి, హైదరాబాదు మినహాయించి).

వంట నూనెల ఉత్పత్తిని పెంచి దిగుమతులను తగ్గించడానికి భారత ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. ఈ దిశగా 2021 నుండి ఎన్ఎంఈఓపి పథకం ప్రారంభించారు. ఈ పథకం కింద ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు, అంతర్ పంటల సాగు, బిందు సేద్య పరికరాల ఏర్పాటు కోసం మొదటి నాలుగు సంవత్సరాల కాలంలో ఒక ఎకరాకు మొత్తం 50 వేల 918 రూపాయల రాయితీ ఇస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 2.73 లక్షల ఎకరాలలో 65,337 మంది రైతులు సాగు చేస్తున్నారు. 2021–22 సంవత్సరంలో సాగులోకి తెచ్చిన ఆయిల్ పామ్ తోటలు కాపుకి వచ్చాయి. ప్రస్తుతం 65,500 ఎకరాల నుండి గెలల ఉత్పత్తి జరుగుతుంది. రాష్ట్రంలో నూనె ఉత్పత్తి శాతం (ఓఈఆర్) 19.42 శాతం, ఇది దేశంలోనే అత్యధికం. ముడి పామాయిల్ ఉత్పత్తి సుమారు 60వేల టన్నులు ఉంటుందని అంచనా. ఆయిల్ పామ్ గెలల ధర ప్రస్తుతం మెట్రిక్ టన్ కి 19,400 రూపాయలు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ వారిచే స్థాపించబడిన రెండు ప్రాసెసింగ్ మిల్లులు నిర్వహణలో ఉన్నాయి. వీటి మొత్తం సామర్థ్యం గంటకి 120 మెట్రిక్ టన్నులు. ఆయిల్ ఫెడ్ చే సిద్దిపేట జిల్లాలో 300 కోట్ల అంచనా వ్యయంతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మించారు. ఈ మిల్లు త్వరలోనే రైతులకు అందుబాటులోకి రానుంది. ఈ మిల్లులో గెలల క్రషింగ్ ద్వారా వచ్చే ముడి పామాయిల్ ను శుద్ధి చేసే ఏర్పాటు కూడా చేశారు. ఇలాంటి ఏర్పాటులో రాష్ట్రంలో ఇదే మొదటిది. మిల్లు ఏర్పాటు వలన ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 2000 మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంది. ఇంతే కాకుండా ఇతర ప్రైవేట్ కంనెనీలకు కేటాయించిన జిల్లాలలో మరొక ఆరు మిల్లులు నిర్మాణంలో ఉన్నాయి. ఇవి 2026 సంవత్సరం నాటికి అందుబాటులోకి వస్తాయి.

**ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకం :**

ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకమని, ఒకసారి మొక్కలు నాటితే మూడవ సంవత్సరం నుండి 30 సంవత్సరాల దాకా పంట దిగుబడి తీసుకోవచ్చని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాషా చెప్పారు. తక్కువ నీటితో ఎక్కువ ఎకరాలలో సాగు చేయగలిగే లాభదాయకమైన పంట ఈ ఆయిల్ పామ్ అని ఆమె వివరించారు. ఆయిల్ పామ్ మొక్కలకు, డ్రిప్ సౌకర్యానికి, అంతర్ పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని దీర్ఘకాలం రైతులు లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాష కోరారు.

**జి.మధుగౌడ్,** ప్రజాపక్షం ప్రతినిధి

### ఆయిల్ పామ్ రైతు పి.అనంతరావు విజయగాథ

జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన రైతు పి.అనంతరావు చాలా సంవత్సరాలు మిర్చి, పత్తి సాగు చేశారు. ఈ పంటలకు కూలీల వ్యయం, తరచూ చీడపీడల బారిన పడి క్రిమిసంహారక మందులకు ఎక్కువ డబ్బులు వెచ్చించాల్సి వచ్చేది. పంట సమయంలో అకాల వర్షాలు అతని పంట నష్టాన్ని పెంచేవి. మిర్చి, పత్తి సాగు ద్వారా ఆయన ప్రతి సీజన్లో 10,000 నుండి 20 వేల మధ్య నికర ఆదాయాన్ని సంపాదించేవారు.

పంట మార్పిడి చేద్దామని స్థిరమైన ఆదాయం కోసం అనంతరావు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపారు. 2021–22 సంవత్సరంలో 36 ఎకరాల భూమిలో ఆయిల్ పామ్‌ను మొదలు పెట్టారు. ఈ పంట మార్పిడి ఆయన జీవితంలో ఎంతో కీలకమైనదిగా మారింది. తక్కువ మంది వ్యవసాయ కూలీలతో, తక్కువ చీడపీడలతో ఆయిల్ పామ్ తోట స్థిరంగా అధికమైన లాభాదాయకమైన పంటగా నిరూపితమైంది. ఆయన మెరుగుగా నిర్వహించిన తోట ఏప్రిల్ 2024 నుండి ఇప్పటివరకు 261.50 మెట్రిక్ టన్నుల పామాయిల్ గెలలు ఇచ్చింది. ఇందుకుగాను 46.85 లక్షల రూపాయల ఆదాయం కూడా పొందారు. ఇది మిర్చి, పత్తి సాగుతో వచ్చిన ఆదాయం కంటే చాలా ఎక్కువ కావడంతో రైతు ఎంతో సంతోషించా రు. ఆయిల్ పామ్ సాగును ఎంచుకున్నందుకు తనకు సంతృప్తికరమైన దిగుబడులను ఆదాయాన్ని ఇచ్చిందని మిక్కిలి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈయన విజయగాథ ఎంతో మంది రైతులకు ప్రేరణగా నిలిచింది.

### మరో రైతు రూపి రెడ్డి గోపాల్ రెడ్డి విజయ గాథ

మహబూబాబాద్ జిల్లా ఆలేరు గ్రామానికి చెందిన రూపిరెడ్డి, గోపాల్ రెడ్డి పసుపు, మిర్చి వంటి అనేక పంటలు సాగు చేశారు. అయితే మంచి దిగుబడి వచ్చినప్పటికి మద్దతు ధర తక్కువగా ఉండటం, సాగు ఖర్చులు ఎక్కువ కావడం స్థిరమైన ఆదాయం వచ్చేది కాదు. ఉద్యాన శాఖ ప్రోత్సాహంతో ఆయన కొత్తగా ఆయిల్ పామ్ సాగును నిర్ణయించుకున్నారు. భద్రాది కొత్తగూడెం జిల్లా ఆశ్వరావు పేట గ్రామానికి వెళ్లి అక్కడి రైతులతో అన్ని వివరాలు తెలుసుకున్నారు. దీనివల్ల ఆయిల్ పామ్ సాగులోకి మారాలని ధైర్యంగా నిర్ణయించుకున్నారు. సెప్టెంబర్ 2021 లో ఉద్యాన శాఖ, ఆయిల్ ఫెడ్ నిపుణులు ఇతర స్నేహితుల సహాయంతో ఆయన ఆరు ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. పశువుల ఎరువులు వేయడం, పచ్చి రొట్టే ఎరువులు వేయడం, కోళ్ల పశువుల పెంట, గొర్రెల పెంటను ఉపయోగించడం వంటివి చేశారు.

మూడు సంవత్సరాల శ్రమ అనంతరం 2024 జూలైలో ఆయిల్ పామ్ పండ్ల గెలలు కోతకు వచ్చాయి. అక్టోబర్ 2025 వరకు 71 టన్నుల దిగుబడి పొందారు. అంటే దాదాపు 13 లక్షల రూపాయల ఆదాయం కూడా ఆయన సంపాదించారు. ఇది ఆయన జీవితాన్ని మార్చేసిన నిర్ణయం. అందుకే తన అనుభవాన్ని స్మరించుకుంటూ ఇతర రైతులకు ఆయిల్ పామ్ సాగు వల్ల లాభాల గురించి, దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, స్థిర ఆదాయం గుర్తించి వివరిస్తూ స్ఫూర్తి ప్రదాత అయ్యారు.

# పేద విద్యార్థుల కలల వెనుక...నిధుల కరువు

రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, అణచివేసే సమాజంలో అణగారిన వ్యక్తుల సృజనాత్మకతను వెలికితీసి స్వేచ్ఛను ప్రసాదించే శక్తులను పెంపొందింప చేసేదే విద్య. అలాంటి విద్యను ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కుగా మన రాజ్యాంగం హామీగా ఇచ్చింది. కానీ ఆ హక్కు వాస్తవరూపం దాల్చడానికి కేవలం పాఠశాలల గోడలే కాదు, ఆర్థిక ఆధారమూ అవసరం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉన్నత విద్య అనేది ఇప్పటికీ ఒక కల. ఆ కలను సాకారం చేయడానికి ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ముఖ్యమైన సంక్షేమ పథకం ఫీజు రీయింబర్స్‌మెంట్. ఇది పుట్టుకతోనే సామాజిక న్యాయానికి పునాదులు వేసిన పథకం. పేద విద్యార్థుల చదువు డబ్బుల కొరతతో ఆగిపోకూడదని, ప్రతిభకు అవకాశాల ద్వారాలు తెరవాలని ప్రారంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో(2008) ప్రారంభించబడి నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పథకం ఆయా రాష్ట్రాల స్వంత పంథాలో నడుస్తుంది. ఈ పథకం లక్ష్యం సూటిగా, స్పష్టంగా ఉంది. విద్య అనేది పేదలకు చేరాలంటే, డబ్బు అడ్డంకి కాకూడదు.ఈ పథకం వల్ల లక్షలాది విద్యార్థులు ఇంజినీరింగ్, డిగ్రీ, మెడికల్, పాలిటెక్నిక్, ఫార్మసీ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందారు. ప్రైవేట్ కాలేజీలు కూడా వీరికి ప్రభుత్వ భాగస్వామ్య విద్యా కేంద్రాలుగా మారాయి.

**సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు లభించిన మేలు:**

ఫీజు రీయింబర్స్మెంట్ వల్ల సమాజంలో కొన్ని గమనించదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి. పేద కుటుంబాల పిల్లలు ఇప్పుడు ఇంజినీరింగ్, ఫార్మసీ,లా, డాక్టర్ , నర్సింగ్ మొదలయిన కోర్సులు చేయగలుగుతున్నారు. ఈ ఉన్నత చదువుతో వృత్తి అవకాశాలు లభించి, పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతిలోకి రావడం మొదలైంది. చిన్న ఊర్లలో, మారుమూల తండాల్లో, గిరిజన గూడాల్లో కూడా ఉన్నత విద్యపై ఆసక్తి పెరిగింది. ప్రభుత్వ ఆర్థిక సాయం వల్ల పేద అమ్మాయిలను చదివించడంలో తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు, వారు పురుషులతో సమానంగా ఆర్థికంగా, సామాజికంగా దేశాభివృద్ధిలో తమ భాగస్వామ్యాన్ని పోషిస్తున్నారు.

**నిధుల కొరతతో విద్యార్థుల కంటతడి:**

ఇటీవలి సంవత్సరాల్లో ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి ప్రభుత్వాల నుండి నిధుల విడుదలలో భారీ ఆలస్యం జరుగుతుంది. కాలేజీలకు రెండు, మూడు సంవత్సరాల బకాయిలు పెండింగ్‌లో ఉండటం సాధారణమైపోయింది. ఈ పరిస్థితి విద్యార్థులకు, కాలేజీలకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తెచ్చింది. ఈ పరిస్థితికి కారణాలను విశ్లేషణచేస్తే, ప్రభుత్వ బడ్జెట్ లోటు, ఎన్నికల ప్రాధాన్యతలు మారడం, రుణాల బరువుతో రాష్ట్ర ఆర్థిక స్థితి దెబ్బతినడం, పథకాన్ని సరైన గణాంకాల ఆధారంగా ప్రణాళిక చేయకపోవడం, అధికార యంత్రాంగంలో ఆలస్యం, ఫైల్ ప్రాసెసింగ్ లో నిర్లక్ష్యం, దీని ఫలితంగా విద్యార్థులు సర్టిఫికేట్లు అందుకోలేక, ఉన్నత చదువులకు దరఖాస్తు చేయలేక, ఉద్యోగాల ఎంపికలో వెనుకబడుతున్నారు.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే ప్రభుత్వానికి సమాంతరంగా విద్యా సేవ అందిస్తున్న ప్రైవేట్ కాలేజీలు ఎందుకు వివక్షకు గురవుతున్నాయి? ఇవి ప్రభుత్వం కోసం విద్యా భాగస్వాములుగా పని చేస్తున్నాయి. పేద విద్యార్థులకు ప్రభుత్వ పథకాల కింద సీట్లు ఇచ్చి, వారికి క్లాసులు, సౌకర్యాలు, సిబ్బందినీ అందిస్తున్నాయి. కానీ ఫీజు రీయింబర్స్మెంట్ మొత్తాలు సకాలంలో రాకపోవడం వల్ల ఈ సంస్థలు జీతాలు, ల్యాబ్ నిర్వహణ, మౌలిక వసతులు అందించడంలో ఇబ్బందులు పడుతున్నాయి.

ప్రైవేట్ కాలేజీలు లాభాపేక్షతో కూడినవైనా, వాస్తవంగా ఇవి ప్రభుత్వ బాధ్యతను పంచుకుంటున్న సంస్థలు. అందుకే వీటిని వివక్షగా చూడకుండా భాగస్వాములుగా గుర్తించి సహకరించడం సమాజ ప్రయోజనానికి అవసరం. ప్రైవేట్ కాలేజీలు కేవలం విద్యార్థులకు విద్య ఇవ్వడమే కాదు, నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా కల్పిస్తున్నాయి. వేలాది లెక్చరర్లు, టెక్నీషియన్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది ఈ కాలేజీల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. నిధుల విడుదలలో ఆలస్యం వలన ఈ వర్గాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది.

**ఎన్నికల హామీలు, తరువాత ఎగనామాలు... నమ్మకం ఎక్కడ?**

ప్రతీ ఎన్నికల సమయంలో విద్యకు బడ్జెట్‌లో తగు ప్రాధాన్యత, రీయింబర్స్మెంట్, ఉచిత విద్య అనే హామీలు ఇచ్చే ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక అదే మాటలను మరిచిపోవడం ఒక దురదృష్టకర వాస్తవం. పేద విద్యార్థుల చదువు కోసం అని వాగ్దానాలు ఇచ్చి, తరువాత వాటికి నిధులు కేటాయించకపోవడం ఇది ప్రభుత్వానికి ఉన్న శీత దృష్టి, లేదా అసమాన న్యాయం అని చెప్పక తప్పదు.

**ప్రభుత్వాల బాధ్యత విద్యపై పెట్టుబడి:** విద్యపై పెట్టే ప్రతి రూపాయి వ్యయం కాదు, భవిష్యత్తుపై పెట్టుబడి. విద్య ద్వారా మాత్రమే సమాజం స్థిరమైన అభివృద్ధి సాధిస్తుంది. పేద విద్యార్థులకు ఆర్థిక అడ్డంకులు లేకుండా చదివే అవకాశం ఇవ్వడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిలబెట్టుకోవాలంటే సకాలంలో నిధుల విడుదల, ప్రమాణీకృత డేటా ఆధారంగా ప్రణాళికలు, ప్రైవేట్ కాలేజీలను భాగస్వాములుగా గుర్తించడం. విద్యార్థుల హక్కుల రక్షణకు చట్టబద్ధ హామీ ఇవ్వాలి.

**విద్యార్థుల కంటతడి సమాజానికి పాఠం:**

ఫీజు రీయింబర్స్మెంట్ లాంటి పథకాలు కేవలం ప్రభుత్వ పత్రాలలో ఉండకూడదు. అవి పేద విద్యార్థి ఇంట్లో వెలిగే దీపం. ఒక కుటుంబం చదువుతో ఎదిగితే, దాని ప్రభావం తరతరాల మీద ఉంటుంది. నిధుల ఆలస్యం, వివక్ష, రాజకీయ ప్రాధాన్యతలతో ఈ దీపం ఆరిపోకుండా చూసే బాధ్యత సమాజం మొత్తం మీద ఉంది. విద్యార్థి కలలు సంవిధాన హామీతోనే కాదు, ప్రభుత్వ నిబద్ధతతోనే నెరవేరతాయి. ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా, నిధులు సకాలంలో విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తు రక్షించాలి. విద్యలో పెట్టుబడి అంటే దేశ భవిష్యత్తులో పెట్టుబడి. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని మర్చిపోతే, పేద విద్యార్థుల కన్నీటి చరిత్ర మనం చదవాల్సి వస్తుంది.

**మహేశ్వరం భాగ్యలక్ష్మి**

# కేరళ కమ్యూనిస్టు పాలన ఆదర్శం



డా. కె. నారాయణ
సిపిఐ కేంద్ర కంట్రోల్ కమిషన్(సిసిసి) చైర్మన్
94909 52222

కేరళ రాష్ట్ర అసెంబ్లీ చరిత్రాత్మకంగా, పేదరికం నిర్మూలనను అధికారికంగా ప్రకటించడం దేశంలోని ప్రజాస్వామ్య శక్తులకు గర్వకారణం. భారతదేశంలో కమ్యూనిస్టులు రక్తపాతం లేకుండా ప్రజాస్వామ్య మార్గంలో అధికారంలోకి వచ్చిన తొలి రాష్ట్రం కేరళ. అప్పట్లో చాలామంది రాజకీయ పండితు లు ఈ ప్రభుత్వం ఎక్కువకాలం నిలబడదని, ఎలాంటి ఫలితాలూ సాధించదని అనుకున్నారు. కానీ కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఆ అంచనాలను తారుమారు చేశాయి.

**భూమి సంస్కరణల నుంచి అక్షరాస్యత వరకు**

మొదటి అడుగుగా భూమి సంస్కరణలను అమలు చేశారు – రైతులకు భూమి హక్కులు కల్పించారు. రెండ వ అడుగుగా నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించారు. 100 శాతం అక్షరాస్యత సాధించారు. ఇప్పుడు మూడవ చారిత్రాత్మక ఘట్టంగా పేదరిక నిర్మూలనను ప్రకటించింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్రాన్ని నడిపిస్తూ ఈ ఘనత సాధించింది.

**డబుల్ ఇంజిన్ ప్రభుత్వ వైఫల్యం**

ఇదే సమయంలో గుజరాత్‌లో బిజెపి గత 27 ఏళ్లు గా అధికారంలో ఉంది. 2014 నుంచి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం నడుస్తున్నది. 2001లో సీఎం గా వచ్చిన నరేంద్ర మోదీ ఆ తర్వాత ప్రధాని అయ్యారు. కానీ ఈ దీర్ఘకాల పాలనలో పేదరిక నిర్మూలన వైపు కేవలం ప్రసంగాలే తప్ప పురోగతి లేదు.

కేరళలో ప్రజల సంక్షేమంపై దృష్టి ఉండగా, గుజరాత్‌లో కార్పొరేట్ సంక్షేమమే ప్రధానమైంది.

అదానీ, అంబానీ లాంటి మిత్ర కార్పొరేట్లకు లాభదాయకమైన విధానాలు అమలు చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించేందుకు ప్రయత్నించారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే ప్రయత్నా న్ని కార్మిక వర్గం, ఉద్యోగులు కలిసి అడ్డుకున్నారు.

ఇప్పుడు ₹33,000కోట్ల ఎల్ఐసి నిధులను నష్టాల్లో ఉన్న అదానీ కంపెనీకి అప్పగించడం దీనికి మరో ఉదాహరణ.

**కేరళ మోడల్:**అత్యంత పేదరిక నిర్మూలన ప్రాజెక్ట్ (EPEP) కేరళలో ఎలా విజయవంతమైంది?

2021లో ప్రారంభించిన ఎక్స్‌ట్రీమ్ పావర్టీ ఎరాడికేషన్ ప్రాజెక్ట్ (EPEP) దీనికి కీలకంగా మారింది.

**ముఖ్యాంశాలు:**

అత్యంత పేద కుటుంబాలను స్థానిక సంస్థలు, మహిళా సంఘాలు, పంచాయతీల ద్వారా గుర్తించడం.

'ప్రతి కుటుంబానికి ప్రత్యేక మైక్రో ప్రణాళిక రూపొందించడం – ఆహారం, నివాసం, ఆదాయ వనరులు, ఆరోగ్యం వంటి అంశాలపై అవసరమైన సహాయం అందించడం – ఇళ్లు నిర్మించడం లేదా పునరుద్ధరించడం, భూమి కేటాయించడం, ఉపాధి, ఆరోగ్య సేవలు, పత్రాల సదుపాయం.

కరోనా సమయంలో కేరళ ఆరోగ్యశాఖ ప్రదర్శనకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) కూడా ప్రశంసలు తెలిపింది.

ఫలితం – పేదరికం లేని తొలి భారత రాష్ట్రం

2025 చివరి నాటికి కేరళ జనాభా సుమారు 3.6 కోట్లుగా ఉంటుంది (భారత జనాభాలో 2.6%).

గుజరాత్ జనాభా 7.2 కోట్లుగా (5.2%) ఉన్నప్పటికీ అక్కడ పేదరికం తగ్గుదల చాలా నెమ్మదిగా ఉంది, అసమానతలు పెరిగాయి.

**గుజరాత్‌లో దోపిడీ పాలన**

గుజరాత్‌కు చెందిన 26 మంది ప్రముఖులు భారీ బ్యాంకు రుణాలు తీసుకుని చెల్లించకుండా విదేశాలకు పారిపోయారు.

మెహుల్ చోక్సీ (₹8,500 కోట్లు – గీతాంజలి జెమ్స్), రిషి అగర్వాల్ (₹4,600 కోట్లు – ఎబిజి షిప్‌యార్డ్, లలిత్ మోదీ, నీరవ్ మోదీ, కేతన్ పారేఖ్ తదితరు లు ప్రభుత్వ ప్రోత్సాహంతో దేశం విడిచి వెళ్లిపోయారు.

ఇలాంటి దినదినమూ దోచుకునే దోపిడీ పాలనలో పేదరిక నిర్మూలన ఎలా సాధ్యం అవుతుంది?

**ముగింపు**

కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చూపిన మార్గం స్పష్టంగా చెబుతోంది – ప్రజల ఆధారిత పాలన, వికేంద్రీకరణ, సామాజిక న్యాయం ఉంటేనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది.

బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల కార్పొరేట్ ఆధారిత విధానాలు కేవలం అసమానతలనే పెంచుతున్నాయి.

# తెలుగు రాష్ట్రాలను కుదిపి వేస్తున్న బస్ ప్రమాదాలు

లేఖ

తెలుగు రాష్ట్రాల్లో బస్సు ప్రమాదాలు తరచూ జరుగుతుండటంతో ప్రజల్లో భయాందోళన పెరుగుతోంది. రోడ్లపై ప్రయాణమంటేనే ప్రాణాలను పణంగా పెట్టినట్టేనన్న పరిస్థితి ఏర్పడింది. హైవేల్లో బస్సులు బోల్తా పడటం, కాలిపోవడం, లోయల్లోకి దూసుకెళ్లడం వంటి ఘటనలు అనేక కుటుంబాలను విషాదంలోకి నెట్టేశాయి. పది రోజుల క్రితం హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరీ ట్రావెల్స్ వోల్వో బస్సుకు కర్నూలు శివారులో జరిగిన ప్రమాదం మరోసారి భద్రతా ప్రమాణాలపై చర్చను రేకెత్తించింది. సుమారు 25 మంది ఘటనా స్థలిలో మాడి బూడిద అయ్యారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా వున్నారు. అనేకమంది క్షత గాత్రులు కావడం జరిగింది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని రంగా రెడ్డి జిల్లా చేవెళ్ల లో కంకర లారీ ఆర్టీసీ బస్‌ను ఢీ కొన్న ఘటనలో 19 మంది మరణించడం అనేక మంది క్షత గాత్రులు కావడం అందరినీ విషాదంలో ముంచింది. గత పదేళ్లలో తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన కొన్ని బస్సు ప్రమాదాలు:

2010 (అనంతపురం): ఏపిఎస్ఆర్టీసి బస్సు అదుపుతప్పి బోల్తా, 18 మంది మృతి.

2012 (కృష్ణా): బస్సు చెరువులో పడటంతో 22 మంది మరణం.

2013 (పాలెం, మహబూబ్‌నగర్): వోల్వో బస్సు మంటల్లో కాలిపోవడంతో 45మంది సజీవదహనం.

2014(మెదక్): స్కూల్ బస్సు–రైలు ఢీ, 26 మంది విద్యార్థుల దుర్మరణం.

2015(ఖమ్మం): విద్యార్థులతో ఉన్న బస్సు బోల్తా, 13 మంది మృతి.

2017: ఏపిఎస్ఆర్టీసి బస్సు లోయలో పడటంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు.

2018 (కొండగట్టు): 57 మంది భక్తుల మరణంతో చరిత్రలోనే పెద్ద ప్రమాదం.

2019: శ్రీశైలానికి వెళ్తున్న భక్తుల బస్సు లోయలో పడటంతో 9 మంది మృతి.

2019(కర్నూలు): వోల్వో తూఫాన్ ఢీ, 15 మంది మృతి.

2021 (ఏలూరు): బస్సు వాగులో పడటంతో 9 మంది మృతి.

2025 (కర్నూలు): వోల్వో బస్సు మంటల్లో చిక్కుకుని 20 మందికి పైగా సజీవదహనం.

ప్రతి ఒక్క ఘటన తర్వాత విచారణలు జరుగుతున్నప్పటికీ, ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. నిపుణులు డ్రైవర్లకు తగిన శిక్షణ, రోడ్డు మౌలిక సదుపాయాల మెరుగుదల, వాహనాల టెక్నికల్ చెకింగ్‌లను కచ్చితంగా అమలు చేయాలని సూచిస్తున్నారు. ప్రయాణికుల భద్రతకోసం ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రోడ్డు భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని అభిప్రాయపడుతున్నారు.

కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా

## కార్తీక పౌర్ణమి వేడుకల్లో కలెక్టర్ హైమవతి

**ప్రజాపక్షం/కొండపాక:** కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ హైమవతి పాల్గొన్నారు. ఉత్సవాలు ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజతో ప్రారంభమయ్యాయి.సంతానమల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు అభిషేకంలో పాల్గొన్నారు.విజయదుర్గామాతకు విశేష పూజలు నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించి, సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. పూజలు, అభిషేక కార్యక్రమాలల్లో జిల్లా కలెక్టర్ హైమవతి పాల్గొన్నారు. కొందరు భక్తులు లక్ష వత్తులతో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జరిగిన నవావరణ హవనంలో జిల్లా కలెక్టర్ హైమవతి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు, చీకోటి రాజేంద్రప్రసాద్,దేవసాని మల్లేశం, లగిశెట్టి రాజు, మర్యాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభు డాక్టరేట్ పొందడం అభినందనీయం



**ప్రజాపక్షం/జమ్మికుంట:** సామాజిక సేవా రంగంలో జమ్మికుంట మండలానికి చెందిన అంబాల ప్రభాకర్(ప్రభు) గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం అభినందనీయమని నిత్య జనగణమన రూపకర్త కాజీపేట ఎసిపి పింగళి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శాలువాతో ప్రభును సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరికైనా ఆపద వస్తే నేనున్నానంటూ ప్రభాకర్ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమన్నారు. దశాబ్దకాలంలో నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న ప్రభాకర్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు యండి. నసీరుద్దీన్, అన్వర్, ముస్తఫా తదితరులున్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ఓ పేకాట స్థావరంపై బుధవారం సాయంత్రం సీసీఎస్ పోలీసులు దాడులు జరిపారు. పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడి జరపగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్దనున్న రూ.4200 నగదు,మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.చట్టవ్యతిరేకమైన జూదం, గేమింగ్ ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## 9న ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ముత్తారం :** ఈ నెల 9వ తేదీన లయన్స్ క్లబ్ ఆఫ్ బిపిఎల్ విజన్ కేర్,శ్రీ వైద్య ఫౌండేషన్ మంథని అధ్యక్షులు బుద్దార్థి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.కంటి పొరల సమస్యలతో బాధపడే వృద్ధులకు కంటి ఆపరేషన్ కోసం ఆస్పత్రికి తరలించేందుకు ప్రత్యేక బస్సు ఈనెల 9వ తేదీ ఆదివారం రోజు మంథని లోని పటేల్ ఐ కేర్ నుండి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరిన్ని వివరాల కోసం 8978102898 అలాగే 9515427257 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

## అల్లెంకి భూమయ్య కళ్ళు సజీవం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:**పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ సభ్యులు అల్లెంకి సత్యనారాయణతండ్రి అల్లెంకి భూమయ్య నిన్న పరమపదించగా ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుకుంటూ తమ తండ్రి నేత్రాలు దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి చూపును ప్రసాదించాలనే గొప్ప నిర్ణయాన్ని తీసుకొని ఈ విషయాన్నీ లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి దృష్టికి తీసుకువచ్చారు. లయన్స్ క్లబ్ వారు ఈ విషయాన్నీ వెంటనే LV ప్రసాద్ హాస్పిటల్ కి సమాచారం ఇవ్వడం ద్వారా ఐ బాల్ కలెక్షన్ టెక్నిషియన్ ప్రదీప్ వచ్చి భూమయ్య రెండు నేత్రాలను సేకరించి LV ప్రసాద్ హాస్పిటల్ కి పంపించడం జరిగింది.విషాద సమయంలో కూడా తమ తండ్రి నేత్రాలను దానం చేసి మరో ఇద్దరు చూపులేని అందులకు చూపును ప్రసాదించిన అల్లెంకి భూమయ్య కుమారులు అల్లెంకి శంకరయ్య, అల్లెంకి సత్యనారాయణ, అల్లెంకి వెంకటేశం, అల్లెంకి రాజేందర్ మరియు వారి కుటుంబసభ్యులను లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి వారు అభినందించారు.

## మొంథా తుఫాన్‌తో నష్ట పోయిన పంటల సర్వే వేగవంతం



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** 5 గత 15 రోజుల క్రితం మొంథాతుఫాన్‌తో తీవ్రంగా నష్ట పోయిన పంటల సర్వేను వేగవంతం చేసి నష్ట పోయిన రైతులకు ఎకరాలకు 40 వేల నష్ట పరిహారం ఇవ్వాలని బిఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని కూచనపెల్లి గ్రామంలోని మొంథాతుఫాన్ తో నష్ట పాయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో వరిధాన్యం పంటలు పూర్తిగా కొట్టుకు పోగా కొన్ని చోట్లు ఇసుక మేటలు వేశాయని అన్నారు. ప్రభుత్వం తుఫాన్ తోనష్ట పోయిన రైతాంగానికి ఎకరాకు 10వేల ఇస్తామని ప్రకటించిన నేటికి సర్వేను పూర్తి చేయలేదని అరోపించారు. కొన్ని చోట్ల ధాన్యం అమ్మకానికి తెచ్చిన ప్రభుత్వ కొనుగోల కేంద్రాల్లో తడిసి ముద్దయి రైతులు తీవ్రంగా నష్ట పోయాలని వారికి అర్థికంగా ప్రభుత్వం అదుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో వరి పత్తి పంటలు పూర్తి నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం విస్మరిస్తుందని అన్నారు. వెంటనే మొంథా తుఫాన్ తో నష్ట పంటల సర్వే పూర్తి చేసి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చెశారు.

## రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ఊషన్నపల్లి ఉపాధ్యాయుల ప్రతిభ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయుడు అమృత సురేష్ కుమార్ లు రాష్ట్ర స్థాయి ఆన్లైన్ పాటల పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచారు. జమ్మికుంటకు చెందిన ఫ్యాక్ట్ స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి ఆన్ లైన్ పాటల పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పాటల పోటీలో లైకుల ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తారు. ఈ పాటల పోటీలో పాల్గొన్న ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సురేష్ కుమార్, ఈర్ల సమ్మయ్య లు పాల్గొన్నారు. సురేష్ కుమార్ 684 లైకులు, 3,942 వ్యూస్ తో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవగా, ఈర్ల సమ్మయ్య 607 లైకులు, 7,455 వ్యూస్ తో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో జమ్మికుంట ఏరియాకు చెందిన యేభూషి సతీష్ కుమార్ 842 లైకులు, 4,915 వ్యూస్ తో ప్రథమ స్థానంలో నిలిచారు. ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు సురేష్ కుమార్, ఈర్ల సమ్మయ్య రాష్ట్ర స్థాయి ఆన్లైన్ పాటల పోటీలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవడంతో గ్రామస్తులు, మండల ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు వారి మిత్రులు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకే స్కూల్ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ఎంపిక కావడం గొప్ప విషయంగా భావిస్తున్నారు. దీంతో ఊషన్నపల్లి పేరును రాష్ట్రస్థాయిలో తీసుకెళ్లినట్లయింది. ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ జమ్మికుంటకు చెందిన ఫ్యాక్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. తాను పాడిన అమ్మ పాడే జోల పాటను విశేషంగా ఆదరించి, చూసి, అధిక సంఖ్యలో లైకులు ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమాలను వీక్షించి, అభిమానించి ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ఆయన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రతి హామీ నెరవేరుస్తాం

### ఆందోళన వద్దు ఓర్వలేకే మాపై ప్రతిపక్షాల విమర్శలు

### మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం :** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతామని, ప్రతి పక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురి కావొద్దని ప్రజలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి, అత్యధిక మెజార్టీతో నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరుతూ బుధవారం ఎల్లారెడ్డి గూడ, కమలాపురి కాలనీ, ఇమాంగూడ, జయప్రకాష్ నగర్, తవాక్కల్ నగర్, అలీనగర్ తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమని,ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఇంటింటికి తిరిగి వివరించారు. తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసిన బీఆర్ఎస్ నేతలు ఈ ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు.మా అభివృద్ధి, సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంటే, అది చూసి ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహి ల్స్ ఓటర్లకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.

## గనిలో సరైన గాలి సరఫరా లేదు.. విధులు ఏలా చేపట్టాలి?

### ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని సింగరేణి ఆర్జీ1 ఏరియాలోని జిడికె 11వ ఇంక్లయిన్ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ గని మేనేజర్‌ను కోరారు. బుధవారం ఆయన మేనేజర్‌ను కలిసి కార్మికుల సమస్యల గురించి చర్చించారు. ప్రధానంగా గని లోపల పని స్థలాల్లో గాలి సరఫరా సరిగా లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడ్తున్నారన్నారు. యాజమాన్యం మెరుగైన గాలి సరఫరా చేయకుండా కార్మికులను విధులు నిర్వహించాలని ఒత్తిడి చేయడం సరైంది కాదన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి గాలి సరఫరా మెరుగ్గా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గని మేనేజర్ స్పందించి వారంలో ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చినట్లు ఎల్లాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, శంకర్, నరేష్, చక్రపాణిలతోపాటు మైన్స్, సెఫ్టీ కమిటి సభ్యులు పాల్గొన్నారు.


## జూబ్లీహిల్స్ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం

**ప్రజాపక్షం/మల్లాపూర్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఈ మేరకు బుధవారం జూబ్లీహిల్స్ లో ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కీ ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, నాయకుడు ఎడ్ల సురేష్ గంగాధర్, శశి తదితరులు ఉన్నారు.



# అభివృద్ధి కోసం నవీన్ యాదవ్‌కే ఓటు


### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ ఎల్.ఎన్.నగర్‌లో బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దళిత నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ“ఇది దొరల సర్కారు కాదు, ప్రజల సంక్షేమానికి అంకితమైన ప్రజా ప్రభుత్వం” అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి వర్గం, ప్రతి కుటుంబం అభివృద్ధి ఫలాలు పొందుతున్నాయని తెలిపారు.మూడు సార్లు బీజేపీని, రెండు సార్లు బీఆర్ఎస్‌ను గెలిపించిన జూబ్లీహిల్స్ ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. పది ఏళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, మున్సిపల్ శాఖామంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. స్లమ్ ప్రాంతాల పరిస్థితి ఎంత దారుణంగా మారిందో ప్రజలే సాక్ష్యం అని అన్నారు. ఇప్పుడా పార్టీ తిరిగి వస్తే ఏమి చేస్తుంది? అని మీరే ప్రశ్నించాలనీ ప్రజలకు పిలుపునిచ్చారు.బీఆర్ఎస్, బీజేపీ రెండూ కలిసి కాంగ్రెస్‌ను అడ్డుకోవడానికి కుట్రలు పన్నాయని అలాంటి వారికి ఎన్నికలలో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు.అలాంటప్పుడు ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.అభివృద్ధి కి కేరాఫ్ “జూబ్లీహిల్స్ జూబ్లీహిల్స్ లో ఇప్పటివరకు దాదాపు రూ.400 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టామని, పేదలస్వప్నం ‘ఇందిరమ్మ ఇల్లు’ పథకాన్ని వేగవంతం చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గృహనిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ నియోజకవర్గానికి అధికంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించారని గుర్తుచేశారు.అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు అందించే దిశగా చర్యలు జరుగుతున్నాయని వివరించారు. మహిళల స్వయం సహాయక సంఘాల బలోపేతంతో ఆర్థిక స్వావలంబనను కల్పిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనుభవించిన అవినీతి, అహంకారం ఇక మళ్లీ తిరిగి రావని, మా కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం, నిబద్ధత, అభివృద్ధి అనే మూడు స్తంభాలపై నిలుస్తుందని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలే న్యాయనిర్ణేతలు అభివృద్ధికి ఓటేయండి,విధ్వంసానికి కాదు. నవీన్ యాదవ్ విజయం అంటే ప్రజల గెలుపు అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

## టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ఫీజు చెల్లిస్తా

### కలెక్టర్లకు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికి ఈ యేడాది ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12292 మంది విద్యార్థులు పదోతరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకు పైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్రరేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పనిచేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు సైతం చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఆమొత్తాన్ని తన వేతనం నుంచి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వచ్చే ఏడాది విద్యాసంవత్సరం ఆరంభంలోనే మోదీ కిట్స్ పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్‌ను పంపిణీ చేయబోతున్నారు.

## బాలసదనం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలసదనంను జిల్లా కలెక్టర్ హైమావతి అకస్మీకంగా సందర్శించి పిల్లలకు రాత్రి వేళల్లో అందించే భోజన ప్రక్రియన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ వంటగదికి వెళ్లి ఆహారా పదర్థాలను తనిఖీ చేశారు. అన్నం,చికెన్. రసం. పెరుగు వండినట్లుగా వంట సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. రోజు మెను ప్రకారమే టిఫిన్, లంచ్, స్నాక్స్, డిన్నర్ చేయాలని పాలు,పండ్లు తప్పకుండ పౌష్టికాహారం అందించాలని పిల్లలకు పెట్టాలని తెలిపారు. స్టోర్ గదికి వెళ్లి బియ్యం.పప్పులు. పలు సామాగ్రిని తనిఖీ చేశారు. కాలం చెల్లిన పదార్థాలను వాడకూడవద్దని తెలిపారు. వార్డెన్ బదిలిపై వెళ్లిందని తెలుపగా, కొత్త వార్డెన్ వచ్చేవరకు మెను ప్రకారం వంట సరుకులు,స కూరగాయలు అందించాలని డిడబ్లుఓ శారదను ఆదేశించారు. పిల్లలను ఆప్యాయంగా పలకరించారు. ఏలాంటి సమస్య ఎదురైన తన దృష్టికి తీసుకరావాలని పిల్లకు తెలిపారు. వార్డెన్ , అయా వంట సిబ్బంది, పిల్లలకు స్వంత పిల్లలుగా చూసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రైతులకు ఎకరానికి రూ.50వేలు చెల్లించాలి

### సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో మొంథా తుఫానుతో నేలకొరిగిన వరి పంటలను రైతులతో కలిసి సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్లపల్లి గ్రామంలో న్యాలం శ్రీనివాస్ అనే రైతుకు చెందిన మూడెకరాల వరి వరద తాకిడికి నేలకొరికి ఇప్పటికీ నీళ్లలోనే ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట మునిగిన వరిని పరిశీలించగా ఒక్క వరి గింజ సైతం అక్కరకు రాకుండా పోయిందన్నారు. సుమారు రూ.2 లక్షల వరకు పంట నష్టం శ్రీనివాస్‌కు జరిగిందని తెలిపారు.తాను ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీళ్లపాలు కావడంతో రైతు కన్నీరు మున్నీరయ్యారని వాపోయారు. ఇదేవిధంగా పర్లపల్లి , పొలంపెల్లి, మల్లాపూర్, మొగిలిపాలెంతో పాటు మండల వ్యాప్తంగా వరద తాకిడికి అనేక వరి పొలాలు నేలకొరికి రైతులు దుఃఖ సాగరంలో మునిగిపోతున్నారన్నారు. వీటన్నిటిపై వ్యవసాయ అధికారులు పొలం గట్లపై సర్వే చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. క్లస్టర్ల దగ్గర కూర్చుని వారికి అందిని సమాచారం మేరకే వివరాలు సేకరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో తిరిగి నష్టపోయిన పంటను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు తక్షణమే చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రైతులకు న్యాయం జరగని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు న్యాలం శ్రీనివాస్, పడాల రాజయ్య, కుమార్, ఐలయ్యలు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థి




**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాల విద్యార్థి ఎస్‌జిఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థిని అభినందించి మాట్లాడారు. ఆర్చరీ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. విద్యార్థులకు అన్ని రంగాల్లో చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. కావాల్సిన వనరులను సమకూర్చి వారిని విజేతలుగా తీర్చిదిద్దడంలో అగ్రగామి అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. పాఠశాల స్థాయిలో ఇటీవల నిర్వహించిన వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికోడూర్‌లో ఎస్‌జిఎఫ్ నిర్వహించిన అండర్ 17 బాలుర అర్చరీ పోటీలలో పాఠశాలకు చెందిన కూన మాణికేశ్వర్ అత్యుత్తమ ప్రతిభతో చక్కటి ప్రదర్శనతో ప్రతిష్టాత్మక జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం హర్షనీయమన్నారు. జాతీయస్థాయిలోనూ విజయ ఢంకా మ్రోగించి కరీంనగర్ జిల్లా క్రీడారంగానికి ఖ్యాతి తేవాలని ఆకాంక్షించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్: ఎసిపి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసినట్లు హుజురాబాద్ ఏసిపి మాధవి తెలిపారు. బుధవారం జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గతంలో బార్యను హత్య చేసి జీవిత ఖైదు శిక్ష పడి ఇటీవల సత్ప్రవర్తన కింద బయటికి వచ్చిన జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామానికి చెందిన సోమ సారయ్య దొంగతనాలకు పాల్పడుతున్నాడు. జమ్మికుంట పట్టణంలో ఎస్ఎల్ఎస్ జ్యువెల్లరీ షాప్‌తో పాటు పలు ఇండ్లలో దొంగతనానికి పాల్పడ్డాడు. ఇటీవల జమ్మికుంట పట్టణంలోని ఎస్‌వి జ్యువెల్లరీ షాప్‌లో దొంగతనం చేసి అడ్డంగా దొరికిపోయాడు. ఇప్పటి వరకు ఐదు దొంగతనాలు చేసినట్లు నిర్ధారించామని ఏసిపి తెలిపారు. నిందితుడి నుంచి కిలోన్నర వెండి, ఐదు గ్రాముల బంగారం, రూ.38 వేలు నగదుతో పాటు ఒక ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసిపి తెలిపారు. దొంగతనం కేసును చేదించిన జమ్మికుంట ఎస్సై సతీష్, పోలీస్ సిబ్బందిని ఏసిపి మాధవి అభినందించి నగదు బహుమతి అందజేశారు. సమావేశంలో జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్, ఎస్ఐలు సతీష్, నాగరాజు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్‌లు పట్టివేత

**ప్రజాపక్షం/ముత్తారం :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఎస్సై రవికుమార్ పట్టుకున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు మానేరు వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్ ను ముత్తారం పోలీస్ స్టేషనుకు తరలించి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని హెచ్చరించారు. అనుమతుల్లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టినట్లయితే చట్టమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి బంగారు పతకం



ప్రజాపక్షం/తానూర్ : జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సీహెచ్ బాలాజీ,కు మంగళవారం ఆదిలాబాద్ లో నిర్వహించిన జోనల్ స్థాయి రెజ్లింగ్ పోటీలలో (అండర్ 17 వయో విభాగం,45 కేజీ) బంగారు పతకం సాధించాడు.అతని అద్భుత ప్రదర్శనతో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.ఈ విజయంతో పాఠశాలకు గౌరవం తీసుకువచ్చిన సీహెచ్ బాలాజీని, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయుల బృందం, గ్రామస్తులు విద్యార్థులు, అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో కూడా విజయాలు సాధించాలని ఆయనకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/మమడ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఎంసి చైర్మన్ సోమా భీం రెడ్డి అన్నారు.మామడ మండలంలోని పోన్కల్ గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు.ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ,2.369 మద్దతు ధర ఇస్తుందన్నారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని సూచించారు. ఇందులో వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్,రైతులు పాల్గొన్నారు.



## నేడు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలు

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభ గురువారం మోపాల్ మండలం తానాకుర్దు గ్రామంలో జరుగుతున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని బొంబాయి గంగన్న పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాజారెడ్డి, అడికె రాజేశ్వర్‌లు పాల్గొన్నారన్నారు. ఈ మహాసభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం, అవలంబిస్తున్న విధానాలపై చర్చిస్తారని భవిష్యత్తు కార్యాచరణ, తదితర విషయాలపై మాట్లాడతారని అన్నారు. కావున జిల్లాలోని రైతులు, రైతు సంఘం కార్మికులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు, సిహెచ్ సాయిగౌడ్, ప్రకాష్ పాల్గొన్నారు.

### హామ్ పథకం ద్వారా నియోజకవర్గంలో

# 135 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణం

మొదటి దశలో 25 రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



ప్రజాపక్షం/బైంసా : ముధోల్ నియోజకవర్గంలో హామ్ పథకం కింద 25 రోడ్ల నిర్మాణానికి మొదటి దశలో నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. బుధవారం హైదరాబాద్ నుండి అయన ఈ విషయాన్ని వెల్లడించారు. త్వరలోనే ప్రభుత్వం టెండర్ ప్రక్రియ ప్రారంభించి,పనులు చేపడుతుందన్నారు. దార్ కుబీర్ టూ బ్రహ్మేశ్వర్(7.30 కి.మీ), రంజని తాండ వయా జామ్ గాంవ్ అండ్ రంజని(6.70 కి.మీ)నేషనల్ హైవే నుండి భోసి(2.05 కి.మీ) హంగిర్గా నుండి దహెగాం(4.70 కిమీ), మొగిలి టూ జాల వయ మాసల్గా కళ్యాణ్(7.40 కిమీ) జె ఎస్.రోడ్ టూ హిప్నెల్లి తండా(4.50 కిమీ)జె.ఎస్ రోడ్ టూ ఝరి వయ వద్ధరి (7.47 కిమీ),ముధోల్ టూ ఎల్వత్(2.10 కి.మీ) గన్నోరా టూ సురేల్లి వయా కీర్గుల్, ఓని, కౌట, సాలాపూర్ (11.00 కి.మీ) జడ్.పి.రోడ్ టూ ఎడ్ బిడ్ వయా కారేగం(4.50 కి మీ),ముధోల్ టూ ధర్మబాద్ అప్ టూ ఎల్వత్(7.60 కిమీ),ఓలా టూ అంబుగామ్, మదన్‌పూర్, పంగర్ పహాడ్,(9.50 కిమీ) ఎస్.ఆర్.ఎస్ పి.రోడ్ లోకేశ్వరం వయా మన్మధ్ (6.45 కిమీ)పోట్పెల్లి బి.టూ లోకేశ్వరం (10 కిమీ)మన్మద్ జడ్.పి రోడ్ టూ నగర్(3.94 కిమీ) వటోలి రాయపూర్ కాండ్లి టూ అర్లి (5.91కిమీ)సేవాలాల్ తండా టూ హావర్గ (8.60 కిమీ) తరోడా టూ రాయపూర్ కాండ్లి వయా ఎడ్ బిడ్. తండా (5.30 కిమీ), బామ్ని వయా తురాటి (3.70 కిమీ)అర్లి కె టూ వయా డొంగర్గావ్ టూ ఓల్డ్ దొంగర్గాం(4.80 కిమీ) నందన్ టూ తురాటి (2.29 కిమీ) రోడ్లను నిర్మించనున్నామని తెలిపారు. అదేవిధంగా ఆర్ అండ్ బి పరిధిలో పెద్ద మొత్తంలో రోడ్లను నిర్మించనున్నట్లు చెప్పారు.300కోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు రూపొందించమన్నారు. మొదటి దశలో ముధోల్ నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత నిచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,సీతక్క,జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ధన్యవాదాలు తెలిపారు.



## సిద్ధాంతానికి నిబద్ధతకు మారుపేరు కల్వల లక్ష్మణ్ : సిపిఐ నాయకులు

ప్రజాపక్షం/కాసిపేట : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మాజీ మండల కార్యదర్శి, మాజీ జిల్లా సమితి సభ్యులు కామ్రేడ్ కల్వల లక్ష్మణ్ మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండలంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. తుది శ్వాస వరకు సిద్ధాంతానికి నిబద్ధతకు మారుపేరుగా నిలిచి, ఎర్రజెండా నీడన కడ దాకా కమ్యూనిస్టుగా జీవించిన కామ్రేడ్ కల్వల లక్ష్మణ్‌కు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మణ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట మండల కార్యదర్శి దాగం మల్లేష్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడిపోశం, అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, జిల్లా సమితి సభ్యులు మొగిలి లక్ష్మణ్, బెల్లంపల్లి పట్టణ కార్యవర్గ సభ్యులు బొంకూరి రామచందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అభ్యర్థిని గెలుపుకు మద్దతుగా ఖానాపూర్ ఎమ్మెల్యే ప్రచారం

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రజాపక్షం/ఖానాపూర్ : జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలల్లో భాగంగా ఎర్రగడ్డ డివిజన్లోని ఆనంద్ నగర్,బంజారా నగర్,ఛత్రపతి శివాజీ నగరాలలో వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ తో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలసి కాంగ్రెస్ అభ్యర్తి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి బారి మెజారిటీతో గెలిపించాలని కోరారు.నవీన్ యాదవ్ నీ గెలిపిస్తే జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో అడుగడుగున అభివృద్ధి జరుగుతుందని,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర అనేక సంక్షేమ పథకాలతో ముందుకెళ్తోంది అని ఆయన అన్నారు.ప్రచారంలో ఆయనకు స్థానిక కార్యకర్తలు,నాయకులు స్వాగతం పలికారు,కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అక్రమ కలప స్వాధీనం

ప్రజాపక్షం/జన్నారం : జన్నారం మండలం తపాల్‌పూర్ గ్రామంలో అక్రమ కలప నిల్వలపై విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ నహీదా బేస్ క్యాంపు వాచర్‌తో కలిసి తనిఖీ నిర్వహించారు. తనిఖీ సమయంలో, శ్మశానవాటికలో తాళం వేసి ఉన్న ఒక గదిని తెరిచి పరిశీలించగా, అక్కడ ఒక కలప దుంగను కనుగొన్నారు. స్వాధీనం చేసుకున్న కలప పరిమాణం 1/0.077 క్యూబిక్ మీటర్లు కాగా, దాని విలువ సుమారు రూ.6,466లు గా అంచనా వేశారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫారెస్టు అధికారులు తెలిపారు. కలప అక్రమ రవాణా, అమ్మకం చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మొంథా తుఫాన్‌పై రాజకీయ పోరు

ఎకరాకు 30 వేలు ఇవ్వండి

పంటల బీమా తీసుకురండి-సిఎంకు

బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి లేఖ



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : మొంథా తుఫాను కారణంగా పంట నష్టపోయిన తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై భారతీయ జనతా పార్టీ (బిజెపి)తీవ్ర విమర్శలు గుప్పించింది. బిజెఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. పంట నష్ట పరిహారంపై బీజేపీ ఆగ్రహం తుపాను కారణంగా సుమారు పది లక్షలకు పైగా ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతు సంఘాలు చెబుతుంటే, ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి 10,000 పరిహారం కొండంత నష్టానికి గోరంత సాయం మాత్రమేనని మహేశ్వర్‌రెడ్డి ఆక్షేపించారు. గతంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిపిసిసి అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎకరానికి 20,000 డిమాండ్ చేశారని గుర్తు పెట్టుబడి వ్యయం ఎకరానికి 30,000 వరకు అవుతున్నందున, వరితో పాటు ఇతర పంటలకు కూడా ఎకరానికి 30,000 చొప్పున నష్ట పరిహారం తక్షణమే ప్రకటించి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

**తేమశాతం, పంటల బీమాపై విమర్శలు**

మొంథా తుఫాను వల్ల తడిసిన, రంగుమారిన వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలను కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం నిబంధనలు సడలించి, సంబంధిత సంస్థలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. అంతేకాకుండా, కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా తక్షణమే పటిష్టమైన పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రూపొందించాలని లేదా కేంద్రం యొక్క ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టి 23 నెలలు అవుతున్నా, బీమా పథకాన్ని రూపొందించకపోవడం అన్న దాతలను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. గత 23నెలల్లో జరిగిన ప్రకృతి వైపరీత్యాల వల్ల వాటిల్లిన పంట నష్టం, రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అలాగే తుఫాను బాధిత మృతుల కుటుంబాలకు 30లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కూడా మహేశ్వర్ రెడ్డి డామాండ్ చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే, రైతుల కోసం బిజెపి పోరాటాలకు వెనుకాడబోదని ఆయన స్పష్టం చేశారు.

## శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో ప్రజాప్రతినిధులు

ప్రజాపక్షం/భీమ్‌గల్ : శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కేంద్ర పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, జాగృతి అధ్యక్షురాలు కవిత, బీజేపీ రాష్ట్ర నాయకులు ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాపక్షం/జన్నారం : జన్నారం మండలంలోని కలమడుగు బీట్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఇందనపల్లి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ లక్ష్మి నారాయణ తెలిపారు. ఇసుక కలప అక్రమ రవాణా చేయడం నేరమని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇందనపల్లి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రవి, ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాజేశ్వర్, కలమడుగు బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల్లో కార్తీక శోభ, లక్ష దీపోత్సవం

జ్యోతి ప్రజ్వలనం చేసి దీపోత్సవం ప్రారంభించిన ఆలయ ఇఒ



ప్రజాపక్షం/పాపన్నపేట : గల గల పారుతున్న సెలయేటి సవ్వడులు, గుండు గుండుకు గండ దీపాలు, శివసత్తుల పునకాలు, భక్తుల దుర్గమ్మ నామస్మరణతో ఏడుపాయల గుట్టలు ప్రతిధ్వనించగా కార్తీక దీపాల వెలుగులో ఏడుపాయల దేదీప్యమానంగా వెలుగొందుతూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అమ్మవారి అలంకరణతో భక్తులు తన్మయంతో ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయ క్షేత్రం కార్తీక దీపాలతో వెలిగిపోయింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం అమ్మవారి ఆలయ క్షేత్రంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈ దీపోత్సవ కార్యక్రమాన్ని ఏడుపాయల ఆలయ ఇఒ చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా ఆలయ అధికారులు అమ్మవారి రాజగోపురంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి దీపోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. కార్తీక లక్ష దీపోత్సవానికి వివిధ ప్రాంతాల నుండి లక్షలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆలయ రాజగోపురం ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. మరి కొందరు మంజీరా నది నీటిలో ప్రమిదలను వదిలి మొక్కులు తీర్చుకున్నారు.

**వైభవంగా అమ్మవారి పల్లకి సేవ :** ఏడుపాయల క్షేత్రంలో ప్రతి పౌర్ణమి రోజు పల్లకి సేవ నిర్వహిస్తారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాజగోపురం నుండి పల్లెకి సేవ ప్రారంభించారు. పల్లకి సేవ రాజగోపురంనుండి శివాలయం ఆలయం ముందుగా అమ్మవారి నామస్మరణలతో పల్లకి సేవ కొనసాగింది. భక్తులు పోటీ పడుతూ పల్లకి సేవలో పాల్గొన్నారు.



## బుద్ధ విహార్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ సిర్పూర్ టి : సిర్పూర్ టి మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ భవనంలో తతాగత భగవాన్ బుద్ధ విహార్ నిర్మాణం కోసం శంకుస్థాపన బుధవారం ఘనంగా జరిగింది. డాక్టర్ బిఆర్. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ పౌర్ణమి నుంచి అశ్విని పౌర్ణమి వరకు నిర్వహించిన వర్షవాస్ పూజలు ముగిసిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిరోజూ బౌద్ధ ధమ్మ గ్రంథ పఠనం పారిత్రన్ గానం నిర్వహించారు. వర్షవాస్ సమాప్తి సందర్భంగా పూజ్య భంతే భరద్వాజ్, పూజ్య భంతే రాహుల్‌చే విహార్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. విహార్ నిర్మాణ పనులను డిసెంబర్ 31వ తేదీ లోపు పూర్తి చేయాలని సంఘం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో నాగ్రాడే రాజు, తాక్ సండే దేవిదాస్, దుర్గం విక్రమ్, దుర్గం తులసిరామ్, దుర్గం తిరుపతి, సోగాల రమేష్, సురేష్, శివరాం, దుర్గం జనార్ధన్, మానేపల్లి ప్రభాకర్, కవిగాయక్ బాబాసాగర్, కొండగూర్లే హిరామన్, దుర్గం రాజారాం (జిల్లా ఉపాధ్యక్షులు కాఫ్), రాంటంకి ఆనందరావు, డోంగ్రే ప్రవీణ్, డోంగ్రి సంతోష్, అక్కేపల్లి నాందేవ్, మాతా రమాబాయి మహిళా మండలి కాగజ్నగర్ పలు గ్రామాల బౌద్ధ ఉపాసకులు ఉపాసికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## పోలీసులపై దాడి కేసులో ఇద్దరు వ్యక్తులు అరెస్టు

ప్రజాపక్షం/తాళ్ళగురిజాల/బెల్లంపల్లి : పోలీసు విధులకు ఆటంకం కలిగించి, విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాళ్ళగురిజాల ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధకలాన్ గ్రామానికి చెందిన చింతకుంట్ల గణేష్, చింతకుంట్ల మహేష్‌లను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ బుధకలాన్ గ్రామంలో గణేష్ నిమజ్జనం ఉత్సవాల వద్ద గొడవ జరుగుతోందని డయల్ 100 ద్వార సమాచారం అందిన వెంటనే కానిస్టేబుల్ శివశంకర్ హోం గార్డ్ శివకృష్ణలు సంఘటనా స్థలానికి వెళ్లారని, అక్కడ గొడవ పడుతున్న వ్యక్తులను ఆపుతుండగా, ఆ గుంపులోని చింతకుంట్ల గణేష్ చింతకుంట్ల మహేష్‌లు దౌర్జన్యంగా యూనిఫాంలో ఉన్న పోలీసు కానిస్టేబుల్‌పై దాడి చేసి, పోలీసు విధులను ఆటంక పరిచారని తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నేరస్తుల కోసం గాలిస్తుండగా బుధవారం రోజున బుధకలాన్‌లోని వారి ఇంటి దగ్గర వారిని పట్టుబడటం జరిగిందన్నారు. ప్రజా శాంతికి భంగం కలిగించినా పోలీసులపై ఎవరైనా దాడులకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగానే విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిపై దాడికి యత్నించిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందన్నారు.

# ఉత్పత్తి సామర్థ్యం పెంపు దిశగా సింగరేణి

కొత్త హైడ్రాలిక్ షావల్ ప్రారంభం

ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా పెంచే దిశగా మరో కీలక అడుగు వేసిందని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏరియాలోని ఉపరితల గనిలో జిఎం సుమారు రూ. 4.51 కోట్లు విలువైన 6.5 క్యూబిక్ మీటర్ల నూతన హైడ్రాలిక్ షావల్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో నూతన యంత్రాలను ప్రవేశపెట్టి వాటి ద్వారా బొగ్గు ఉత్పత్తిని పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని, నూతన షావల్ యంత్రానికి రోజుకు సుమారు 8,500 క్యూబిక్ మీటర్ల ఓబి (మట్టి) తీయగల సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. యాంత్రీకరణను సమర్థవంతంగా వినియోగించి శ్రీరాంపూర్ ఏరియా నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సులభంగా చేరుకోగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉద్యోగులందరూ రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్చార్జ్ ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ చిప్ప వెంకటేశ్వర్లు, గని మేనేజర్ శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, రక్షణ అధికారి శ్రీధర్, ఎస్ఇ విజయేందర్ రెడ్డి, మోతే లచ్చన్న, బద్రి బుచ్చయ్య పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్‌పై తక్షణమే చర్యలు తీసుకోండి : వేణునగర్ గ్రామస్థులు

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఖానాపూర్ నియోజకవర్గంలోని పెంబి మండలంలో జరిగిన హృదయ విదారక ఘటనపై వేణునగర్ గ్రామస్థులు, చిన్నారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యం కారణంగా చిన్నారి ఆత్రం పుష్ప మృతి చెందిందని వారు ఆరోపిస్తున్నారు. తమ బిడ్డకు న్యాయం జరగాలంటూ నిర్మల్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. వేణునగర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తించాల్సిన టీచర్,అంగన్వాడీ కేంద్రంపై ఏమాత్రం పర్యవేక్షణ లేకుండా వదిలేయడం వల్లే ఈ ఘోరం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు. చిన్నారి ఆత్రం పుష్ప,అంగన్వాడీ కేంద్రం నుంచి బయటకు వెళ్లి, పక్కనే ఉన్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ గుంతలో పడి దుర్మరణం చెందింది. చిన్న పిల్లలు ఉన్న కేంద్రం నుంచి బాలిక బయటకు వెళ్లి ఇంత పెద్ద ప్రమాదానికి గురయ్యే వరకు టీచర్ ఏమి చేస్తున్నారని,ఆమె విధుల పట్ల ఎంత నిర్లక్ష్యం వహించారో ఈ సంఘటన రుజువు చేస్తుందని గ్రామస్థులు ప్రశ్నించారు.

# ఎక్సైజ్ స్టేషన్‌లో పేకాటపై సాగుతున్న విచారణ

ఉన్నతాధికారుల సీరియస్




ప్రజాపక్షం/చెన్నూరు : ఎక్సైజ్ స్టేషన్లోనే పలువురు కానిస్టేబుళ్లు పేకాట ఆడుతుండడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. 'ప్రజాపక్షం' దిన పత్రికలో వెలువడిన "ఎక్సైజ్ స్టేషన్లో పేకాట" అనే కథనానికి స్పందిస్తూ, పై అధికారుల ఆదేశాల మేరకు విచారణ వేగవంతమైంది. ఎక్సైజ్ సూపరిండెంట్ నందగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం రోజున జిల్లా కార్యాలయంలో విచారణ నిర్వహించగా, మరిన్ని విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. హెడ్ కానిస్టేబుల్ గణేష్‌పై నేర చరిత్ర ఉండగా, చాలా కాలంగా ఆయన కానిస్టేబుల్‌లతో కలిసి ఎక్సైజ్ స్టేషన్ లోనే గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారనే కీలక ఆధారాలు 'ప్రజాపక్షం' సిబ్బంది ద్వారా సూపరిండెంట్ నందగోపాల్‌కు చేరాయి. దీంతో ఆయన మరో కోణంలో విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం గత రెండు రోజులుగా స్థానికంగా దుమారం రేకెత్తిస్తోంది. విధుల్లో నిర్లక్ష్యం వహించడమే కాకుండా, ఎక్సైజ్ స్టేషన్‌ను పేకాట క్లబ్‌గా మార్చి పేకాట ఆడిన హెడ్ కానిస్టేబుల్‌తో పాటు కానిస్టేబుల్‌లను విధుల నుంచి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# క్రీడ

## దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్..

భారత జట్టును ప్రకటించిన బిసిసిఐ..
రిషబ్, ఆకాశ్ దీప్‌కు చోటు..
కరుణ్ నాయర్‌కు నో ఛాన్స్..!



దక్షిణాఫ్రికాతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం బిసిసిఐ బుధవారం భారత జట్టును ప్రకటించింది. స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు జట్టులో చోటు కల్పించడంతో పాటు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించింది. గాయం తర్వాత కోలుకున్న ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్‌కు చోటు కల్పించింది. శుభ్‌మన్ గిల్ టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడరు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ సిరీస్ ఈ నెల 14న ప్రారంభం కానున్నది. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికాఏతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారతఏ జట్టును బిసిసిఐ ప్రకటించింది. ఈ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, రుతురాజ్ గైక్వాడ్ వైస్ కెప్టెన్‌గా కొనసాగుతారు.

### కరుణ్ నాయర్‌కు నో ఛాన్స్

వెస్టిండిస్ టెస్ట్ సిరీస్ ఆడిన జట్టులోని ప్లేయర్స్ ఎక్కువ మందికి దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు అవకాశం కల్పించింది బిసిసిఐ. సెలక్షన్ కమిటీ మరోసారి కరుణ్ నాయర్‌కు చోటు కల్పించలేదు. ఇటీవల రంజీ ట్రోఫీలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న విషయం తెలిసిందే. యశస్వీ జైస్వాల్, రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తారు. మూడోస్థానంలో సాయి సుదర్శన్ ఆడతాడు. దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్‌లో ఎవరో ఒకరు నాలుగో స్థానంలో ఆడే ఛాన్స్ ఉంది.

### నలుగురు స్పిన్నర్లు, ముగ్గురు పేసర్లు..

దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ నవంబర్ 14న జరుగుతుంది. జట్టులో నలుగురు, స్పిన్నర్లు, ముగ్గురు పేస్ బౌలర్లకు ఛాన్స్ ఇచ్చింది. అక్షర్ పటేల్, కుల్దీప్, సుందర్, జడేజా రూపంలో నలుగురు స్పిన్నర్లు.. బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్ రూపంలో ముగ్గురు పేసర్లు ఉన్నారు. ఇక నితీశ్ పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్‌గా తీసుకుంది. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ 14 నుంచి కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. రెండో టెస్ట్ నవంబర్ 22 నుంచి గౌహతిలో జరుగుతుంది. ఆ తర్వాత రెండు జట్లు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 6 వరకు మూడు వన్డేలు ఆడనున్నాయి. డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 19 వరకు రెండు జట్ల మధ్య ఐదు మ్యాచుల టీ20 సిరీస్ జరుగుతుంది.

### టెస్ట్ సిరీస్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్ వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకాశ్ దీప్.

### భారత'–ఏ' వన్డే జట్టు

తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), ఆయుష్ బదోని, నిషాంత్ సింధు, విపరాజ్ నిగమ్, మానవ్ సుతార్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్.

## ఐసిసి టి-20 ర్యాంకింగ్స్..

నెంబర్ వన్ ర్యాంకుల్లో అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి!




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టీమిండియా యువ బ్యాటర్స్ అభిషేక్ శర్మ నెంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఈ ఎడమచేతి వాటం బౌలర్ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టి–20 సిరీస్‌లోనూ తనదైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. దాంతో నెంబర్ వన్ బ్యాటర్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మరో టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ మూడోస్థానంలో ఉన్నాడు. భారత టి–20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎనిమిదో స్థానంలో ఉన్నాడు.

రెండోస్థానంలో ఇంగ్లాండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్, నాలుగో స్థానంలో నిస్సంక (శ్రీలంక), నాలుగో స్థానంలో జోస్ బట్లర్ (ఇంగ్లాండ్), ఆరోస్థానంలో ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఏడోస్థానంలో టిమ్ సీఫెర్ట్ (న్యూజిలాండ్), తొమ్మిదో స్థానంలో కుషాల్ పెరీరా (శ్రీలంక), పదో స్థానంలో మిచేల్ మార్ష్ (ఆస్ట్రేలియా) ఉన్నారు.

దక్షిణాఫ్రికాతో జరిగిన టి–20 సిరీస్‌లో విజయం తర్వాత పాక్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్ మెరుగయ్యాయి. కెప్టెన్ బాబార్ ఆజం తొమ్మిది స్థానాలు మెరుగుపరుచుకొని 30వ స్థానానికి చేరుకున్నాడు. సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘా పదిస్థానాలు ఎగబాకి 39, 54 స్థానాలకు చేరారు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ 12వ స్థానానికి, బంగ్లాదేశ్‌కు చెందిన టాంజిద్ హసన్ 17వ స్థానానికి, ఆఫ్ఘనిస్తాన్ ద్వయం రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ వరుసగా 15, 20వ స్థానాల్లో ఉన్నారు. ఇక టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానాన్ని నిలుపుకోగా.. ఆస్ట్రేలియాకు చెందిన జోష్ హేజిల్‌వుడ్ రెండు స్థానాలు మెరుగుపరుచుకొని 10వ స్థానానికి చేరాడు. బంగ్లాదేశ్‌కు చెందిన ముజీబ్ ఉర్ రెహమాన్, మహేది హసన్ 14, 17వ స్థానానికి చేరుకున్నారు. వెస్టిండీస్‌కు చెందిన జాసన్ హోల్డర్, రోస్టన్ చేజ్ 23, 38వ స్థానానికి చేరుకున్నారు.

పాక్‌తో జరిగిన సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా బౌలర్ కార్బిన్ బాష్ 15 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకున్నాడు. టీమిండియా మరో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఐదు ర్యాంకులు దిగజారి 15వ స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాక్ ఆటగాడు ఆయుబ్ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. జింబాబ్వే ప్లేయర్స్ సికందర్ రజా, వెస్టిండీస్ ప్లేయర్ రోస్టన్ చేజ్ వరుసగా రెండు, మూడో స్థానాలకు చేరుకున్నారు. టీ20ల్లో రజా 33 బంతుల్లో చేసిన సెంచరీతో ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండు ర్యాంకులు దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, అక్సర్ పటేల్ నాలుగు ర్యాంకులు దిగజారి 170 పాయింట్లతో 15వ స్థానానికి చేరాడు. అభిషేక్ శర్మ 16వ స్థానంలో ఉన్నాడు.

# ఫోకస్




## శతాబ్దాల క్రితమే భూకంపాలను గుర్తించే పరికరం!



చైనా గణిత శాస్త్రవేత్త, ఆవిష్కర్త జాంగ్ హెంగ్ క్రీస్తు శకం 132లో ఒక అద్భుతమైన పరికరాన్ని రూపొందించాడు. ఇది కొన్ని వందల మైళ్ళ దూరంలో సంభవించే భూకంపాలను కనుగొనగల సామర్థ్యం కలిగి ఉండేది. ఈ ఆవిష్కరణ ఆధునిక భూకంప సాధనాల ఆవిష్కారానికి ముందే, నాటి తరం కనబరచిన అద్భుతమైన శాస్త్రీయ విజ్ఞానానికి నిదర్శనం. ఈ యంత్రం బాండ్లతో నిండి ఉండే నిర్మాణాన్ని కలిగి ఉంది. పెద్ద ఇత్తడి పాత్రని రూపొందించి, దాని చుట్టూ ఎనిమిది డ్రాగన్ తలలను అమర్చారు. ప్రతి డ్రాగన్ తలలో ఒక చిన్న బంతి వంటి వస్తువును పెట్టారు. భూకంపం సంభవిస్తే, సంబంధిత దిశలో ఉన్న డ్రాగన్ తల బంతిని బయటకు తీస్తుంది. అది పక్కన ఉన్న కప్ప నోటిలో పడుతుంది. ఇలా, బంతి పడిన దిశ ఆధారంగా భూకంపం ఏ వైపునుంచి వచ్చిందో గుర్తించేవారు. ఈ పరికరం అకాల భూకంపాలను తెలుసుకునేందుకు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఉపయోగించబడింది. విజ్ఞాన పరంగా, ఇది ప్రపంచంలోనే మొదటి భూకంప గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం. అప్పట్లో భూమి వ్యవహారాలు, ప్రకృతి వైపరీత్యాల గురించి బయట ప్రపంచానికి అంత సమాచారం లేకపోయినా, చైనాకు సంబంధించిన పురాతన విజ్ఞానాన్ని ఈ పరికరం చాటిచెప్పింది. ఆ రోజుల్లోనే ఇలా భూకంపాలను ముందుగానే గుర్తించగల పరికరాన్ని రూపొందించడం జాంగ్ హెంగ్ యొక్క శాస్త్రీయ నైపుణ్యం, చైనీయుల ఇంజనీరింగ్ సంప్రదాయాలు ఎంత అభివృద్ధిలో ఉన్నాయో చెప్పే ఒక గొప్ప ఉదాహరణ. అంతేకాకుండా, ఇది ఆధునిక సైస్మోగ్రాఫ్ పరికరాల అభివృద్ధికి స్ఫూర్తి కలిగించింది. ఇవన్నీ చైనా పురాతన విజ్ఞానపరంపరలో ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తున్నాయి.

## పెద్ద చరిత్ర!



సెర్బియాలోని డన్యూబ్ నదీ తీర ప్రాంతాలలో బయటపడిన ఈ మట్టి బొమ్మ చిన్నదే కావచ్చు. కానీ, చరిత్ర క్రమాన్ని వివరించే పెద్ద కథ దీని వెనక ఉంది. మానవుడు ఆధునికతను సంతరించుకుంటూ ఎదుగుతున్న వైనాన్ని ఈ బొమ్మ ప్రతిబింబిస్తుంది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, ఇది సుమారుగా క్రీస్తు పూర్వం 1,500 క్రితం నాటిది. రథంలో ఒక మనిషి కూర్చున్నట్టు కనిపించే దీని చరిత్ర కాంస్య యుగానికి సంబంధించినదై ఉండవచ్చు. పురాతన దుబోవాక్‌జుటో బర్డో సంస్కృతి చెందిన మట్టి బొమ్మ శక్తివంతమైన ప్రయాణానికి చిహ్నం. అభివృద్ధికి సూచిక. ఈ విగ్రహంపై కనిపిస్తున్న స్వస్తిక్ చిహ్నం మతానికిగానీ, సిద్ధాంతానికిగానీ సంబంధించినది కాదు. అది ఆ నాటి ప్రేమతత్వానికి నిదర్శనం. నాటి సంస్కృతిలో సూర్యుని, ఆవృత చక్రాల పునరావృతానికి నిదర్శనంగా రథం భాసిల్లుతున్నది. జీవన సమతుల్యతకు అద్దం పడుతుంది. సాధారణ యూరోపియన్ సమాజాల ఆధ్యాత్మిక నమ్మకాలు, కళా వ్యక్తీకరణ, ప్రపంచ దృక్పథాలను దుబోవాక్ జుటో బర్డో సంస్కృతి బాగా ప్రతిబింబిస్తుంది. అందుకు నిదర్శనంగా పరిశోధకులు ఈ బొమ్మను పేర్కొంటున్నారు. నాటి ప్రజల ఆధ్యాత్మిక భావనలను, సాంస్కృతిక విలువలను కూడా ఇది వివరిస్తున్నది. మొత్తానికి, ఈ చిన్న మట్టి విగ్రహం బ్రోంజ్ యుగాన్నటి యూరోప్ ప్రజల ఆధ్యాత్మిక ప్రపంచానికి, జీవన తత్వాలకు ఒక అద్భుతమైన ప్రతీకగా నిలుస్తోంది.

## జంతువులతో మనిషి మమేకం!

ఒకప్పుడు జంతువులతో మనిషి మమేకమయ్యాడు. క్రమంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ, జీవకారుణ్యాన్ని మరిచాడు. తన స్వార్థం కోసం జంతుజాలాన్ని విచక్షణారహితంగా హతమార్చడం మొదలు పెట్టాడు. ఫలితంగా వేలాది జీవరాశులు కనుమరుగైపోయాయి. మరెన్నో ఉనికిని కోల్పోయే ప్రమాదం అంచున ఉన్నాయి. సరైన చర్యలు తీసుకోవాలన్న ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. తీర్మానాలు కాగితాల్లో మూలుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లోనైనా, మన పూర్వీకుల గురించి, వారికి జంతువులతో ఉన్న సంబంధం గురించి తెలుసుకోవడం అత్యవసరం. మనిషికి, జంతువుకీ మధ్య విడదీయరాని అనుబంధం ఉందని నిరూపించే ఈ అద్వితీయ శిల్పం మెక్సికోలోని వెరాక్రుజ్ ప్రాంతానికి చెందినది. పరిశోధకుల అంచనా ప్రకారం ఇది క్రీస్తు శకం 400–800 మధ్యకాలం నాటిది. ఇందులో ఒక మనిషి తలపై తోడేలును పోలిన మాస్క్‌ను ధరించడాన్ని గమనించవచ్చు. అది అతని వేట సామర్థ్యానికి, పరాక్రమానికి చిహ్నం. ఇక పక్కనే ఉన్న శునకం తన యజమాని కోసం ఏ క్షణమైనా పోరాటానికి సిద్ధంగా ఉన్నట్టు, అప్రమత్తమై ఉంది. ఈ శిల్పం వెరాక్రుజ్ ప్రాంతాల్లోని ప్రాచీన సంస్కృతుల ఆచారాలను, మానవులు–జంతువుల సంబంధాలను, ఆధ్యాత్మిక నమ్మకాలను ప్రతిఫలించవచ్చని నిపుణులు అంటున్నారు. ఆ పురుషుడు శక్తి, రక్షణ లేదా ప్రకృతి, అదృశ్య ప్రపంచానికి అనుసంధానం కలిగి ఉన్నవాడని చెప్పడానికి అతను ధరించిన మాస్క్ ఓ సంకేతం. శునకాలు విశ్వాసం, వేట, లేదా ఆచార కార్యక్రమాలలో సహకారాన్ని సూచిస్తున్నాయి. మిసో అమెరికన్ నాగరికతల్లో శునకాలు మృతుల ఆత్మను లోకాంతర యాత్రలో మార్గనిర్దేశించేవి అన్న విశ్వాసం చాలామందిలో ఉండేది. ఈ శిల్పకళాఖండాన్ని ప్రస్తుతం బెల్జియంలోని మ్యూజియం ఆన్ డె స్ట్రూమ్ (ఎంఎఎస్), ఆంట్వెర్ప్‌లో భద్రంగా ఉంచారు. వెరాక్రుజ్ ప్రాంతం ప్రీకోలంబియన్ కళా, సాంస్కృతిక సంపదను పరిశీలించేందుకు సందర్శకులకు అవకాశం ఇస్తున్నది. దీని శిల్పకళా నైపుణ్యం, సంకేత పరమైన అర్థాలను, మిసోఅమెరికన్ నాగరికతల ఆధ్యాత్మిక–సామాజిక జీవనాన్ని మనకు తెలియచేస్తున్నాయి.



## భారత గడ్డపై వందేళ్ళ చరిత్ర సిపిఐదే

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** భారత గడ్డపై సిపిఐది వందేళ్ళ చరిత్ర అని, వందేళ్ళ ఉత్సవాల సందర్భంగా ఈనెల 18,19 తేదీల్లో హనుమకొండ జిల్లాలో జరిగే రాష్ట్ర బస్ జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి పిలుపునిచ్చారు. బుధవారం బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ ప్రజా సంఘాల సమావేశం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి హాజరై మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి పోరాడిన చరిత్ర సిపిఐది అని, భారత దేశ గడ్డపై 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటువంటి పార్టీ సిపిఐ అని, స్వాతంత్ర్యం అనంతరం అంతరాలు లేని సమాజం కోసం, భూ సంస్కరణలు అమలు కోసం, పీడిత తాడిత ప్రజలకు అండగా వెట్టి చాకిరి విముక్తికై, బానిసత్వానికి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐ దన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందుకోసం ప్రతి ప్రజా సంఘం నడుం బిగించాలని చెప్పారు.ఈ బస్ జాత నవంబర్ 18 తేదీన భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరుకు చేరుకొని 19వ తేదీన పరకాలలో ముగించుకొని భూపాల పల్లి జిల్లాకు వెళ్లనని అన్నారు. ఈ బస్ జాతలో పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, జక్కు రాజు గౌడ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టపాక రవి, వేల్పుల సారంగపాణి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర భారత గడ్డ పైన సిపిఐ వందేళ్ల శతాబ్ది ఉత్సవాలు

## బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో నిర్వహించబోయే బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సరూర్‌నగర్ మండల భగత్‌సింగ్‌నగర్‌లో గ్యార క్రాంతికుమార్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలుతో కలిసి పాలమాకుల జంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడు తూ డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో నిర్వహించబోయే సభకు 40దేశాల ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సభను సరూర్‌నగర్ మండలంలోని కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఖమ్మం బయలుదేరి విజయవంతం చేయవలసిన బాధ్యత మనందరిపైన ఉందని ఇప్పటి నుండే కార్యాచరణ ముందుకు సాగాలని బస్తి, కాలనీ శాఖల్లో సమావేశాలు, సెమినార్లు నిర్వహించి సభ విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురా లు, మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఫైమిదా, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.గోపాల్, సరూర్‌నగర్ మండల కార్యధర్శి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు

- డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శాతాబ్ది బహిరంగ సభను జయప్రదం చేయాలి
- యుద్ధ ప్రాతిపదికన తడిసిన ధాన్యం,పత్తిని మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలి
- కపాస్ కిసాన్ యాప్‌లో పత్తిని ఎకరాకు ఏడు క్వింటాల పరిమితిని సడలించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ(నకేరేకల్) :** ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని ఖమ్మంకు తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సిపిఐ నకేరేకల్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం స్థానిక గుడిపాటి పంక్షన్ హాల్‌లో బుధవారం జరిగింది. సమావేశానికి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సిపిఐ100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిందని, దేశ స్వతంత్ర పోరాటంలో అగ్రభాగం నిలిచిందని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. రాష్ట్రంలో మొంథా తుఫాన్ ప్రభావంతో ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి, వరి పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాన్‌తో పూర్తిగా నీటిలో మునిగిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. తడిసినటువంటి వరి ధాన్యం, పత్తిని ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. కపాస్ కిసాన్ యాప్‌లో ఎకరాకు ఏడు క్వింటాల పరిమితి కేవలం మధ్య దళారులకు లాభం చేకూర్చేందుకే కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. నల్లగొండ జిల్లాలో నల్లరేగడి భూములు ఏక్కవగా ఉనందున్న రైతులు వరి పంట తరువాత పత్తిపంట సాగునే చేస్తారుఅని దిగుబడి కూడ ఎకరానికి సూమరు 12 నుంచి 15క్వింటాలకు పైగానే దిగుబడి వస్తున్న విషయాన్ని సిసిఐ అధికారులు గుర్తించాలని తెలిపారు. ఇప్పటికైన ఏడు క్వింటాల పరిమితిని ఎత్తివేసి యధావిధిగా12 క్వింటాలు పత్తిని దిగుమతి చేసుకునేలా నిబంధనలు సడలించాలన్నారు. 8 నుంచి12 శాతం ఉన్న నిబంధనను ఎత్తివేసి 20 శాతం వరకు పెంచాలన్నారు.నియోజకవర్గంలోని బి వెల్లంల,ఐటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తి చేయడానికి నిధులు కేటాయించి త్వరితరగతిన పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశానికి గౌని లక్ష్మీనర్సయ్య అధ్యక్షత వహించగా జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్,గీత పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి బోడిగె సైదులు,శాంతి జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, సిపిఐ నార్కట్‌పల్లి మండల కార్యదర్శి పెండల శంకర్, చిట్యాల మండల కార్యదర్శి, ఎండి అక్బర్, నకేరేకల్ పట్టణ కార్యదర్శి పాల్వాయి విద్యాసాగర్,జిల్లా సత్యం, వెంపటి శ్రీనివాస్, ఎస్‌కె షరీఫ్, తీగల మల్లా రెడ్డి, బోడ మలేష్,జె జంగయ్య,వంగల నాగయ్య,అలకుంట్ల నర్సింహా,దుబ్బ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## రాజీలేని పోరాటాలు

యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి ధ్యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** డిసెంబర్ 26న ఖమ్మంలో భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల భారత స్థాయి ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యదర్శి ధ్యానాల దామోదర్ రెడ్డి కోరారు. సిపిఐ కార్యాలయం (కె.ఆర్ భవన్)లో బుధవారం పెండెం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సిపిఐ మోత్కూరు మండల కౌన్సిల్ సమావేశంకు ముఖ్యఅతిథిగా దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి భారత గడ్డపై 100 ఏళ్ళు పూర్తి చేసుకుంటుందని వెట్టి చాకిరి విముక్తి కోసం కార్మికులను కర్షకులను పెట్టుబడుదారుల వ్యవస్థనుండి విముక్తి కల్పించడానికి నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐకి దక్కిందన్నారు. ఎంతో చరిత్ర కలిగిన 100 సంవత్సరాల ముగింపు సభను డిసెంబర్ 26న ఖ మ్మం జిల్లాలో జరిగే బహిరంగ సభలో లక్షలాది మంది పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ మోత్కూర్ మం డల కార్యదర్శి అన్నేపు వెంకట్ మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల ముగింపు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు జాత ఈ నెల 21న మోత్కూర్ వస్తున్న సందర్భంగా బస్సు జాతకు మోత్కూర్ మండలంలో అధిక సంఖ్యలో పాల్గొని జాతకు స్వాగతం పలకాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. మండలంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఇటీవల కురిసిన వర్షాల్లో నష్టపోయిన రైతులకు, కూలిపోయిన ఇండ్లకు నష్టపరిహారం చెల్లించి వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ప్రజానాట్యమండ లి జిల్లా అధ్యక్షులు భూష్పాక నరసింహ, సిపిఐ మోత్కూరు మండల స హాయ కార్యదర్శి పులకరం మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిట్టా రాములు, మోత్కూరు పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, పొడిచేడు, కొండగడప తదితరులు పాల్గొన్నారు.



## శ్రమ జీవుల విరాళం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో సిపిఐ శత వసంతాల ముగింపు సందర్భంగా జరిగే బహిరంగ సభ, ఉత్సవాల జయప్రదం కోసం అన్ని వర్గాల నుండి సంపూర్ణ సహకారం అందుతోందని, ఉత్సవాల జయప్రదానికి తాము సైతం అంటూ పట్టణంలోని పెద్ద బజార్ హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమ శ్రమ ఫలితం నుంచి కూడబెట్టిన రూ.100,116లను బుధవారం కార్మిక అడ్డాలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అందించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కార్మికులు, శ్రామికులు, కర్షకులు, పేద వర్గాల జెండా ఎర్రజెండా అని, వందేళ్లుగా ఎర్రజెండాను మోస్తూ తమ సమస్యల పరిష్కారం కోసం అలు పెరగని పోరాటాలు చేస్తున్నారన్నారు. శ్రామికుల ఎర్రజెండా మరింత ఎరుపెక్కించి బలమైన ఉద్యమాలు నిర్మించడం ద్వారా ప్రజా వ్యతిరేక పాలకుల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలో ఐదు లక్షల మందితో జరిగే బహిరంగ సభ, ఉత్సవాలను జయప్రథం చేసేందుకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు కదలాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెద్దాడి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** అకాలవర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల చొప్పున అందజేయాలని సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం తాడూరు మండలంలోని భలాన్‌పల్లి, ఐతోల్, పాపకల్, ఇంద్రకల్, సిర్సవాడ, ఏటిదారిపల్లి గ్రామాలలో సిపిఐ జిల్లా బృందం పర్యటించి తాడూరు మండలంలోని ఆ యా గ్రామాలలో మూడురోజులుగా కురుస్తున్న అకాలవర్షానికి తడిచిముద్దయిన పత్తిచేను నేలకు ఒరిగిన వరిచేలు వేల ఎకరాలపంట నీటమునిగి రైతులు పంటలు నష్టపోయి తీవ్రవేదనకు గురయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఐమండల తాడూరు సహాయకార్యదర్శి దాంగట్ల వెంకటస్వామి, భలాన్‌పల్లి గ్రామశాఖ కార్యదర్శి రవి, సిపిఐజిల్లా కౌన్సిల్‌సభ్యులు బండిలక్ష్మి పతి, శివశంకర్, సిపిఐగ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాలకుల దోపిడీలు ఖండిస్తూ 15న బస్సు యాత్ర

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కళాభవన్‌లో బుధవారం జిల్లా విస్తృ స్థాయి సమావేశం కౌన్సిల్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.వెంకటేష్ అధ్యక్షత సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహా హాజరై సమావేశానికి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ, సిపిఐ భారత గడ్డపై పుట్టి వంద సంవత్సరాలు అవుతున్నది. 1925న డిసెంబర్ 26 కాన్పూర్ పురుడు పోసుకున్నది. భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపైన వందేళ్ల పోరాట చరిత్ర కలిగిన పార్టీ అన్నారు. భారతదేశంలోని స్వాతంత్ర కావాలని, గర్జించిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు అన్నారు. డిసెంబర్ 26 న ఖమ్మంలో జరగబోయే శతాబ్ది వందేళ్ళ ఉత్సవాలు విజయవంతం చేయగలరని నారాయణపేట జిల్లా ఇంటికి ఒక్కొక్కరు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలి అన్నారు. అదేవిధంగా వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ ఉత్సవాలను పోరాటాలను త్యాగాలను గుర్తు చేసుకుంటూ పాలకుల దోపిడీలు ఖండిస్తూ ఈనెల 15వ తేదీన గద్వాలలో బస్సు యాత్రప్రారంభమై వనపర్తి, నారాయణపేట జిల్లాకి 16 వ తేదీన జిల్లా మీదుగా ఖమ్మంకి బయలుదేరుతుంది. ఇటీవల మొత్తం తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు 30000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి టి.నరసింహా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. సంతోష్, ఎస్. వెంకటేష్, డి.చెన్నయ్య, వెంకటయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ధ్వంసమైన రోడ్లకు మహర్దశ: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ఇటీవల వర్షాలతో మండల పరిధిలో వాల్మిడి, ముత్తారం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోయి గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా అస్తవ్యస్తమయ్యాయి. రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించలేక ఇబ్బందులు పడగా, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం కష్టమైపోయింది. పరిస్థితిని గమనించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వెంటనే స్పందించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై తక్షణ చర్యలు చేపట్టారు. రహదారి మరమ్మత్తులకు అవసరమైన నిధులు సమకూర్చి సుమారు రూ.3కోట్ల వ్యయంతో కొత్త రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.

## అడవి పంది దాడిలో మరణించిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

సిపిఐ ములుగు మండల కార్యదర్శి ముత్యాల రాజు



**ప్రజాపక్షం/ములుగు;**మండలంలోని దేవగిరిపట్నం గ్రామానికి చెందిన కుందూరు వెంకటేశ్వరరెడ్డి(66) అనే రైతు చేను పనుల నిమిత్తం సొంత కు ంట దగ్గరికి వెళ్ళిన క్రమంలో అడవి పంది దాడిలో మరణించగా ఆయన కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు ములుగు మండల కార్యదర్శి ముత్యాల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా అనేక మంది రైతులు నష్టాల పాలు అవుతున్నారన్నారు. అటవీశాఖ అధికారులు చొరవ తీసుకొని రైతుల ప్రాణాలను ప్రజల ప్రాణాలను పంటలను రక్షించాలని కోరారు.

## విత్తన కంపెనీల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి: రఘు



**ప్రజాపక్షం/ములుగు:**నకిలీ విత్తన కంపెనీల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న ఏజెంట్లను ఎన్నుకునే విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని వారితో అగ్రిమెంట్ రాయించుకోవాలని అన్నారు. అదేవిధంగా మొక్కజొన్న ఏజెంట్ మొక్కజొన్నకు అనువైన భూమి అవునా కాదా అని రైతులతో చర్చించాలని మొక్కజొన్నకు అనువైన భూమి అయితే మొక్కజొన్నను పంట పండించేందుకు అగ్రిమెంట్ చేసుకోవాలని అలా కాక రైతులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని మొక్కజొన్న వెయ్యాలని చెప్పే ఏజెంట్ అగ్రిమెంట్ రాసిస్తేనే మొక్కజొన్నను వేసుకోవాలని రైతులను చిటమట రఘు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగిరి మధుబాబు, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, పోలబోయిన గోపాల్, సాధనపెల్లి లక్ష్మయ్య, తూర్పాటి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల జాగ్రత్త

**ప్రజా పక్షం/నెక్కొండ:** సైబర్ మోసాల పట్ల మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సిఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేందర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్నెట్, మొబైల్ యాప్‌ల ద్వారా రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో విడుదల చేసిన పలు హెచ్చరిక పోస్టర్లను ప్రస్తావించారు. వృద్ధులు, గృహిణులు, నిరుద్యోగులు లక్ష్యంగా చేసుకొని నకిలీ పార్ట్‌టైమ్ జాబ్స్, ట్రేడింగ్ యాప్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్ల పేరిట మోసాల బారిన పడేలా చేస్తున్నారన్నారు. రోజుకు రూ. 2000 నుంచి 6000 సంపాదన, వంద శాతం లాభం, త్వరిత రాబడి వంటి మాటలు వినగానే జాగ్రత్తగా ఉండాలన్నారు. మోసగాళ్లు మొదట చిన్న మొత్తాలు చెల్లించి విశ్వాసం కల్పించి తరువాత పెద్ద మొత్తంలో డబ్బు అడిగి మాయమవుతారన్నారు. ఏదైనా లింక్, వీడియో కాల్, అనుమానస్పద యాప్ కనపడితే వెంటనే స్పందించవద్దు. తప్పనిసరిగా 1930కు కాల్ చేయాలన్నారు. ఎవరికీ ఒటిపి, కెవైసి వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం ఇవ్వరాదన్నారు.ఎలాంటి ఆఫర్, లాభం హామీ ఇస్తే అది మోసం అన్నారు.


## ఎమ్మెల్యేలకు షాక్ ఇచ్చిన ట్రాన్స్ జెండర్

పాలన చేత కావడం లేదంటూ ధ్వజం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** గ్రేటర్ వరంగల్ నగరం పరిధిలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు పరిపాలన చేత కావడం లేదంటూ ట్రాన్స్ జెండర్ పుష్పిత లయ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ నగరం మొత్తం వరదల్లో మునిగిపోయిందని, ఇందుకు వారి నిర్లక్ష్యమే కారణమంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యేల పరిపాలన వైఫల్యానికి నిరసనగా వారికి పసుపు కుంకుమ, గాజులు అందజేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం వరంగల్లో పుష్పిత లయ మీడియాతో మాట్లాడుతూ వరంగల్ నగర పరిధిలో గెలుపొందిన నలుగురు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీకి పరిపాలన చేయడం రావడంలేదని అన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, హంటర్ రోడ్ బొంది వాగు ఏరియా జలమయమైందని పేర్కొంది. ప్రతి సంవత్సరం వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆరోపించింది. చెరువులు, కుంటలను కబ్జాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు కబ్జాదారుల దగ్గర కమీషన్ తీసుకొని కబ్జాదారులకే సపోర్ట్ చేస్తున్నట్లు ఆరోపించింది. మీకు పాలన చేతకాకుంటే దిగిపోండంటూ ఒక్కో స్థానిక ఎమ్మెల్యే, ఎంపి పేరు చెబుతూ ఎద్దేవా చేసింది.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శ



**ప్రజాపక్షం/ధర్మ సాగర్ :** ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపిటిసి రావుల రజిత మరణించగా ఆమె పార్థివ దేహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన నాగవెళ్ళి అనిల్, మాచర్ల లక్ష్మయ్య లు మరణించగా వారి పార్థివా దేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంది

పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/గీసుకొండ :** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గీసుగొండ మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంఖుస్థాపన చేశారు. మండలంలోని వంచనగిరి,శాయంపేట,ఊకల్,మచ్చాపూర్,ఎలుకుర్తి హవేలీ,మనుగొండ,గీసుగొండ గ్రామాలలో సి ఆర్ ఆర్ ఎస్సి సబ్ ప్లాన్ నిధులతో ఎస్సీ కాలనీలలో చేపట్టిన 1కోటి 57 లక్షల73వేల సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు డీజే, డప్పు చప్పుళ్ళు, కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని,ముఖ్యంగా ఎస్సీ కాలనీలలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు.పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని,ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పరకాల డైరీ ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు, సీఎం ఆర్ఎఫ్ ,కళ్యాణ లక్ష్మి , తదితర సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందజేస్తున్నామనితెలిపారు.అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఎంపి కావ్య, ఎమ్మెల్యే నాయిని ప్రచారం



**ప్రజాపక్షం/హనుమకొండ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ప్రజా పాలన ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వివరించిన ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంతో సంక్షేమం గడపగడపకు చేరిందన్నారు. ఇదే అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలవాలి అన్నారు.నవీన్ యాదవ్ విద్యావంతుడు, స్థానికుడు, నిత్యం ప్రజల్లో ఉంటాడని, జూబ్లీహిల్స్ అభివృద్ధికి కట్టుబడి ఉన్న యువ నాయకుడు అని అతడిని గెలిపించడం జూబ్లీహిల్స్ భవిష్యత్ పురోగతికి అవసరం అని వరంగల్ ఎంపీ పిలుపునిచ్చారు.మహిళలతో, వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడిన ఎంపి డాక్టర్ కావ్య ప్రజలను కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు

వ్యవసాయ మార్కెట్ హామాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్



**ప్రజాపక్షం/నర్సంపేట :** హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటియూసి అనుబంధ వ్యవసాయ మార్కెట్ హామాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి ము నీశ్వర్ అన్నారు. బుధవారం వ్యవసాయ మా ర్కెట్ యార్డ్ ముఖద్వారం గేటు పక్క ప్రాంగణ ంలో కార్మికుల సమక్షంలో ము ఖ్యఅతిథిగా రా ష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ పాల్గొని ఏఐటియూసి పతకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920 సంవత్సరంలో బ్రిటిష్ దోపిడి పరిపాలనలో నలిగిపోతున్న భారతీయుల కోసం రక్తాలు దారపోస్తూ బొంబాయి నగరంలో ఎదురు పోరాటంలో ప్రతి అడుగు ముందు వేస్తూ లాల రఘుపతిరాయ్, నెహ్రూ లాంటి ఎందరో మహనీయుల కృషి ఫలితంగా అవతరించింది ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటియూసి) సంఘం అని వివరిస్తూ కార్మికుల ప్రతి సమస్యకు తీర్పుగా ఉంటామని అన్నారు. హమాలి కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికుడికి కనీస వేతనం కల్పిస్తూ, ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలి, ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.12 వేలు ఇచ్చి కార్మికుడి శ్రమకు తగ్గ వేతనం చెల్లిస్తూ సంక్షేమ పథకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బికేయంయు జిల్లా కార్యదర్శి అక్కపెల్లి రమేష్, సిహెచ్ పాణి, బిక్షపతి, గొర్రె కుమారస్వామి, జనార్ధన్, రమేష్, కట్టయ్య పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు అమలు చేసేదాకా ఉద్యమం



బిసి ఉద్యమ సాధన దీక్షలో పాల్గొన్న రామకృష్ణ గౌడ్

**ప్రజాపక్షం/టేకుమట్ల:**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేవరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని ల జెఎసి కన్వీనర్ నేరేళ్ల రామకృష్ణ గౌడ్ అన్నారు. మేము ఎంతో మాకు అంత అనే నినాదంతో బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు తలపెట్టిన నాలుగు రోజుల దీక్ష లో బుధవారం ్ధవారం మండల బిసిరిజర్వేషన్ సాధన సమితిజెఎసికన్వీనర్ నేరేళ్ల రామకృష్ణ గౌడ్ హాజరై దీక్షలో కూర్చుని మద్దతు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉస్మానియా యూనివర్సిటీలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు బిసి వాదాన్ని బలపరుస్తూ తమ తమ ప్రాంతాల్లో ప్రజలను ఏకం చేస్తూ బిసి రిజర్వేషన్ సాధించేవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు పాల్గొన్న ప్రతి ఉద్యమం ఫలించిందని నేడు బిసి రిజర్వేషన్ సాధించేవరకు విద్యార్థి లోకం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు, భీమ్ డ్రం ఓయూ ప్రెసిడెంట్ మాదుగుల వెంకట్ స్వామ్రాట్, కెవి గౌడ్, రాజారాం యాదవ్, అశోక్ సార్ తదితరులు పాల్గొన్నారు.


## విద్యారంగ సమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ధర్నా



**ప్రజాపక్షం/భూపాలపల్లి:**రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని మంజూరు నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జోసఫ్ లు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతుందని, ఇప్పటివరకు విద్యరంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయింద ఆరోపించారు. ఇప్పటివరకు ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదని, ముఖ్యంగా రాష్ట్రంలో 9000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని, పెండింగ్ బకాయలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దుర్మార్గమని అది సరి కాదన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యా శాఖ మంత్రిని ఏర్పాటు చేసి విద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విద్య రంగ సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని కళాశాల హాస్టల్ భవనానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని, ఎస్సీ ఎస్టీ కళాశాలల బాయ్స్ హాస్టల్ కు సొంత భవనం లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే సొంత ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి విద్య రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. లేనియెడల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ ధర్నాకు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ తన సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రవీణ్, పోతుల పవన్, రమాకాంత్, పవన్, శ్రీనివాస్, అజయ్, సురేష్, వంశీ, కృష్ణ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** మోంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో మోంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టం వాటిల్లిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మోంథా తుఫాన్ ప్రభావం వల్ల పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా రైతాంగాన్ని నిండా ముంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.పది వేలు నష్టపరిహారం ప్రకటించడం సరికాదని రైతులకు సరిపోవని, జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.యాభై వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బిజెపితొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేశ్, తొర్రూరు రూరల్ మండల అధ్యక్షుడు గట్టు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, జిల్లా మాజీ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ కొలుపుల శంకర్, అలిసేరి రవిబాబు, బి.సురేశ్, భాస్కరాచారి, విష్ణు, నవీన్, శ్రీనాథ్, చలపతిరాజ్, సిరిపాటి విశాల్, శివగణేశ్, చలువాది సత్యనారాయణ, జగదీశ్, తేజస్, శ్రీనివాస్, అశోక్, సురేశ్ నాయక్, మహేశ్ పాల్గొన్నారు.

## రూ.7 కోట్ల నిధులతో బుగు జాతర అభివృద్ధి



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ :**శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు, అనుగ్రహం నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళల ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వామివారిని వేడుకున్నారు. భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులోని శ్రీ బుగులోని వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. మెట్ల మార్గం ద్వారా ఎమ్మెల్యే వెళ్తూ, భక్తులతో మాట్లాడారు. పలువురు భక్తులు ఎమ్మెల్యే తో సెల్ఫీలు దిగారు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఎమ్మెల్యే గుట్ట కింద ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే భక్తులనుద్దేశించి మీడియాతో మాట్లాడారు. శ్రీ బుగులోని వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం జాతరకు రూ.7 కోట్లు నిధులు కేటాయించిందని, ఆ నిధులతో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**జగ్గయ్యపేటలో ఏనుగు రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే..**

కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఒడ్డాల తిరుపతికి చెందిన ఏనుగు రథం వద్ద ఎమ్మెల్యే టెంకాయ కొట్టి రథాన్ని జాతరకు ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి టెంకాయ కొట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు,ఎన్ ఎస్ ఆర్ సంస్థల చైర్మన్ సంపత్ రావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జి. కిష్టయ్య, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## 20న 'హలో దళిత – చలో ఢిల్లీ'



తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ దాడికి పాల్పడిన సనాతన మనువాది రాకేష్ కిషోర్ ని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నవంబర్ 20న జరగబోయే హలో దళిత..చలో ఢిల్లీ మహాధర్నను జయప్రదం చేయాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్ మాదిగ య, రాష్ట్ర అధ్యక్షులు బొక్కల వెంకటస్వామి మాదిగ కోరారు. వెంకటస్వామి ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ కు ముఖ్యఅతిథిగా మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రభాకర్ మాదిగ హాజరై మాట్లాడుతూ గవాయి పై జరిగిన దాడిని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక ట్విట్టర్ ద్వారానే స్పందించారు కానీ, విచారణ జరపలేదని, కావున రాజ్యాంగ విలువలను కాపాడాలనిమహాధర్నాకు పిలుపునిచ్చామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేరిపోతుల విల్సన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరు ఆశీర్వాదం మాదిగ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఎడ్ల ఉపేంద్ర మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎడ్ల సమ్మయ్య మాదిగ, వరంగల్ జిల్లా అధ్యక్షులు దాసరపు సారన్న మాదిగ, జనగాం జిల్లా అధ్యక్షు లు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు మైపాల్ మా దిగ, భూపాల్ మాదిగ, సీనియర్ నాయకులు సి ంగారపు చిరంజీవి మాదిగ, పెండ్యాల స్వరాజ్, గీ సుకొండ మండల అధ్యక్షులు తక్కలపల్లి రాజశేఖర్ మాదిగ, కమలాపూర్ మండల అధ్యక్షులు కుమ్మరి నాగేశ్వరరావు, కొమురయ్య, కోట శ్యామ్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నేడు జాబ్‌మేళా నిర్వహణ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం భారత్ ఫ్యూచర్ (ప్రై.లిమిటెడ్ ఖమ్మం నందు సేల్స్ కన్సల్టెంట్స్ (మేల్) 22, సర్వీస్ అడ్వయిజర్ రెండు ఉద్యోగాలకు ఈనెల 6 దున జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6దున శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ ఖమ్మం నందు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెంలలో పనిచేసేవిధంగా సేల్స్ కన్సల్టెంట్స్ (మేల్) పోస్టులకు ఏదైనా డిగ్రీ, టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ గల 22 నుంచి 30 వయస్సుల యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ. 18వేలు ఉంటుందని తెలిపారు. సర్వీస్ అడ్వయిజర్ ఉద్యోగాలకు ఖాళీలకు డీజిల్ మెకానిక్, ఐటిఐ మెకానిక్ అర్హత గల 22 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 12వేల వేతనం ఉంటుందన్నారు. మొత్తం 24 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జిరాక్స్ కాపీలతో యువతీ, యువకులు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు 7036902902 నెంబర్‌ను సంప్రదించాలి.

## సిపిఐ శత వసంతాల వేడుకలకు ప్రచారం నిధుల సేకరణ:యర్రబాబు



ప్రజాపక్షం/వైరా: ఖమ్మంలో డిసెంబర్26వ తారీఖున జరిగే సిపిఐ శత వసంతాల పండుగ సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ ప్రదర్శన జరుగుతున్న సందర్భంగా వైరా మండలంలో వైరా సోమవరం, తాటిపూడి గ్రామల్లో ప్రచారం నిధుల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్ర బాబు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఇంటింటా సిపిఐ ప్రచారం నిర్వహించారు. ఈ బహిరంగ సభను ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, మండల కౌన్సిల్ సభ్యులు బందారుపల్లి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయండి

మార్కెట్‌ను సందర్శించిన సిపిఐ బృందం

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. బుధవారం సిపిఐ నాయకులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరిగే సమయం కాబట్టి వీలైనంత తొందరగా నాణ్యతతో పనులను పూర్తి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా ఖమ్మం ఉందని తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్గొండతో పాటు ఆంధ్రా నుంచి కూడా వచ్చి ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులను రైతులు విక్రయిస్తారని ఆయన తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మార్కెట్ పనులను పూర్తి చేయాలని జానిమియా కోరారు. మిర్చి సీజన్ త్వరలో ప్రారంభం కానుందని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తుందని ఉందని పత్తి కొనుగోళ్లపై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, నాయకులు భూక్యా రవిందర్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ అల్లిపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వివిపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు ప్రారంభించారు. బుధవారం వి.వెంకటాయపాలెం సొసైటీ ఆధ్వర్యంలో అల్లిపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, తహసీల్దార్ సైదులు, ఏవో కిషోర్‌లు పాల్గొని ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రేడ్ ఎ రకం ధాన్యానికి రూ. 2389, గ్రేడ్ బి రకం ధాన్యానికి రూ. 2369 మద్దతు ధర లభిస్తుందన్నారు. దీనితో పాటు సన్న రకాలకు ప్రభుత్వం రూ. 500 బోనస్ కూడా అందిస్తుందన్నారు. సొసైటీ సిఈవో ఐ. తిరుపతిరావు, డైరెక్టర్లు నాగేశ్వరరావు, ఆదినారాయణ, రైతులు పత్తిపాటి వీరయ్య, దమ్మలపాటి సైదులు, రావూరి లక్ష్మయ్య, ఎం. బాలకృష్ణ, పి. శ్రీనివాసరావు, పి. అప్పారావు, సత్యం, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయ స్టడీ హాల్ ప్రారంభం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గోకుల కృష్ణ సేవా సమితి భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం స్టడీ హాల్‌ను డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ప్రారంభించారు. ఖమ్మం నగరంలోని మధురానగర్‌లోని గోకుల కృష్ణ సేవా సమితి ట్రస్టు భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, స్టడీ హాల్, గెస్ట్ రూములు, డైనింగ్ హాల్‌ను ట్రస్ట్ చైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వెనకబడిన వర్గాల అభివృద్ధి కోసం ట్రస్టు ఆధ్వర్యంలో హాస్టల్‌తో పాటు గ్రంథాలయం, ఇంటర్‌నెట్, కంప్యూటర్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దీనికి సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.ట్రస్ట్ వైస్ చైర్మన్ వీర్ల వరప్రసాద్ యాదవ్, సభ్యులు పాశం వెంకయ్య యాదవ్, తెలంగాణ యాదవ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటి లింగయ్య యాదవ్, గుమ్మ రోశయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బోగి మల్సూర్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు ఇందుమతి, నాయకులు శ్రీనివాసరావు యాదవ్ పాల్గొన్నారు.

## పత్తి పంటను ధ్వంసం చేసిన ఫారెస్ట్ అధికారులు



ప్రజాపక్షం/చండ్రుగొండ: గత 20 సంవత్సరాల నుండి పోడు సాగు చేసుకుంటున్నా తమ పోడు భూముల్లో పత్తి పంటను మంగళవారం సాయంత్రం ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేశారని బాధితులు బుధవారం వాపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. రావికంపాడు బీట్ పరిధిలో పోడు భూముల్లో పత్తి పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేయటాన్ని నిరసిస్తూ పోడుదారులు పీకిన పత్తితో పోడుదారులైన గుగులోత్ వాలీ, తేజవత్ సరోజనలు తమ నిరసన వ్యక్తం చేశారు. సుమారు ఐదు ఎకరాల్లో చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# గిరిజన ఉద్యమ కెరటం ధర్మ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

తమ్మినేని,జాన్‌వెస్లీ





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : గిరిజన సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం గుగులోత్ ధర్మ నిర్వహించిన ఉద్యమాలు నేటి తరానికి ఆదర్శం అని, ఆయన లేనిలోటు తీర్చలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఎం సనీయర్ నాయకులు, గిరిజన నేత గుగులోత్ ధర్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా సుజాతనగర్ మండలంలోని మంగపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధర్మ విగ్రహావిష్కరణ, సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ధర్మ ఉమ్మడి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమాలకు దిక్సూచి లాంటి వాడని, ఎన్నో ప్రజా, రైతు, గిరిజనోధ్యమాలకు నాయకత్వంవహించారని చెపా్ప.ఉ ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చి ప్రజా ఉద్యమాలు నిర్మించడం ద్వారా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాడని కొనియాడారు. అనంతరంవిగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మండల నాయకులు భూక్యా ధస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన జాతిని అడుగడుగునా చైతన్య పరుస్తూ హక్కుల సాధన కోసం అనునిత్యం చైతన్య పరిచిన గొప్ప నాయకుడు గుగులోత్ ధర్మ అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలోని మంగపేట గ్రామంలో గుగులోత్ ధర్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ, స్థూపావిష్కరణ కార్యక్రమం జరిగింది. నమ్మిన సిద్ధాంతం కోసం కడదాక ఎర్రజెండాను పట్టుకుని క్రమశిక్షణకు మారుపేరుగా ధర్మ నడిచారని చెప్పారు. జాతి అభివృద్ధి కోసం అనునిత్యం వినూత్న పోరాటాలు నిర్వహించిన నిజమైన కమ్యూనిస్టు అన్నారు. కమ్యూనిస్టు అనే వాడు ఒక్కడున్నా నిజాయితీగా ఉండి, ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తారని అన్నారు. సమాజంలో కమ్యూనిస్టులు అనగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ సమాజంలో కమ్యూనిస్టులు మాత్రమే అనగారిన వర్గాల వారి కోసం పనిచేస్తారని, గిరిజన, రైతు సంఘాలు పెట్టింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అన్నారు. గిరిజనులు, బిసిలు, ఎస్సిలు, దళిత, వర్గాల వారి కోసం సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలను ఎర్రజెండానే పెట్టిందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు ధర్మ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని కోరారు. సిపిఎం నాయకులు బండారు రవికుమార్, పి సోమయ్య, అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, శ్రీరామ్ నాయక్, ఎం జ్యోతి, కౌసల్య రవికిరణ విజయభాయ్, జీవన్ బాబు, భీమారావు, బాబూరావు, వీరభద్రం, మూడ్ శోభన్, బానోత్ ధర్మానాయక్, అమర్ సింగ్, సత్యనారాయమ,నర్సారెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, కె బ్రహ్మాచారి, యలమంచలి రవికుమార్, వీర్ల రమేష్, చంద్రు నాయక్ పాల్గొన్నారు.


# కిటకిటలాడిన దేవాలయాలు



ప్రజాపక్షం/ ఖమ్మం : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం దేవాలయాలు ప్రత్యేకించి శైవ క్షేత్రాలు భక్తులతో కి టకిటలాడాయి.తెల్లవారుజాము నుంచే భక్తు లు పెద్ద సంఖ్యలో శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మా సంలో అత్యంత పవిత్రమైనదిగా భావించే కార్తీక పౌర్ణమి రోజున ఆలయాల్లో దీపాలు వెలిగించి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించా రు. పౌర్ణమి నాడు జరిపే పూజలు, వ్రతాలు, దీపారాధనలు పుణ్య ఫలితాలను అనేక రేట్లు పెంచుతాయని భక్తుల నమ్మకం. శివ పురా ణం ప్రకారం శివుడు త్రిపురాసురులను సం హరించి దేవతలకు విముక్తి కలిగించిన రోజు గా కార్తీక పౌర్ణమిని జరుపుకుంటారు. ఖ మ్మ ం నగరంలోని ప్రధాన ఆలయాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆలయాల వద్ద పెద్ద సం ఖ్యలో భక్తులు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో దీపాలను వెలిగించారు. 365 వత్తులతో కూడిన దీపాలను వెలిగించడం ద్వారా పుణ్య పూజా ఫలితాలు దక్కుతాయని భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖ మ్మం నగరంలోని కాల్వొడ్డులో గల గుంటు మల్లన్న స్వామి దేవాలయంలో శివునికి మం చు పర్వతాలతో కూడిన ఆలంకరణ చేశారు.



# సిపిఐ తొలితరం నేత విఠల్‌రావు ఆదర్శనియం



ప్రజాపక్షం/ ఖమ్మం : ఎన్ని రోజులు ప్ర జాప్రతినిధిగా ఉన్నాం, ఆ కాలంలో ఏమి సాధించాం అన్నదే ప్రధానం. చైతన్యపు గుమ్మం ఖమ్మం నుంచి తొలిసారి పార్లమెంటుకు ఎన్నికైన టిబి విఠల్‌రావు జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకం. రైల్వేలో సాధారణ ఉద్యోగిగా ప్రారంభమైన ఆయన జీవితం పార్లమెంటు సభ్యునిగా, కార్మిక నాయకునిగా యావత్ దేశం గుర్తుంచుకునే రీతిలో సాగింది. సింగరేణిలో కార్మికుల పక్షాన పోరాడి తొలిసారి బోనస్ సా ధించిన ఘనత ఆయనది. రైల్వేలో చిరుద్యోగిగా చేరిన ఆయన రైల్వేబోర్డు సభ్యునిగా , రైల్వేల అభివృద్ధిలో కీలక భూమిక పోషించారు. టిబి విఠల్‌రావు 1915 ఆగస్టు 16న కన్నడిగ కుటుంబంలో జన్మించారు. తండ్రి పేరు టిడి బాలకృష్ణన్ విఠల్ రావు విద్యాభ్యాసం బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థలో సాగింది. విద్యాభ్యాసం తర్వాత రైల్వేలో ఉద్యోగిగా చేరిన విఠల్‌రావు మగ్దం మోహినుద్దీన్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి పరిస్థితులు తెలంగాణలోని నిజాం రాచరిక తీరు ట్రేడ్ యూనియ న్ ఉద్యమం వైపు మరలేలా చేశాయి. రైల్వే సింగరేణి కార్మిక సమస్యలపై ప్రత్యక్ష పో రాటాల స్థాయికి తీసుకెళ్లింది. 1943లో జూన్ 13న సుగంధనీ దేవితో వివాహమై ంది. విఠల్‌రావుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విఠల్‌రావు హై దరాబాద్ చుట్టూ పలు పరిశ్రమల్లో కార్మిక సంఘాలను స్థాపించారు.1952లో తొలిసారి జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఖ మ్మ ం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎంపిగా, రైల్వేబోర్డు సభ్యునిగా, ప్రమాద నివారణ కమిటీ సభ్యునిగా రైల్వేల అభివృద్ధికి కృషి చేశారు. ప్రయాణికులకు సదుపాయాల కల్పన, స్టేషన్ల ఏర్పాటుకు పోరాడారు. 1957లో రెండవ సారి పార్లమెంటుకు ఎన్నికైన విఠల్ రావు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా పని చేశారు. 1963 64లో తొలిసారి బోనస్‌ను అందించి యావత్ కార్మికుల హృదిలో నిలిచిపోయారు. కార్మికుల సంక్షేమం, హ క్కు ల సాధనే ఆశయం గా పనిచేసిన విఠల్‌రావు 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో సిపిఐ వైపు నిలిచారు1965లో కొత్తగూడెంలోని ఐ దవ ఇంక్లైన్ కార్మిక సమస్యలపై చర్చిస్తూ తు ది శ్వాస విడిచారు. కర్షక, నిరుపేద, బ డుగు వర్గాల సమస్యలను ఎలుగెత్తి చా టు తూ అనేక ఉద్యమాలను నిర్మించిన పోరాట వీరుడు విఠల్‌రావు చిరస్మరణీయుడు.

# ‘హలో కామ్రేడ్ చలో ఖమ్మం’

సిపిఐ నాయకులు చింతల రమేష్

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : భారత గడ్డపై కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో డిసెంబర్ ఆరున నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా నాయకులు చింతల రమేష్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో ఇంటింటికి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా చింతల రమేష్ మాట్లాడుతూ సిపిఐ శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామా గ్రామాన పండుగ వాతావరణంలో ఉత్సహ పూరితంగా జరుపుకోవాలన్నారు. డిసెంబర్ 26 నాటికి శత వసంతాలు పూర్తవుతాయని ఈ సందర్భంగా ఖమ్మంలో జరిగే శత వసంతాల ముగింపు బహిరంగ సభకు లక్షలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందు తర్వాత జరిగిన ప్రతి ఉద్యమంలో, ప్రతి పోరాటంలో సిపిఐ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. నాడు దేశంలో ఉన్న దొరలు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్లకు వ్యతిరేకంగా పేద ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత సిపిఐదేనన్నారు. ప్రజలను



చైతన్యం చేసి వారిని పోరాటాల వైపు నడిపించి ప్రశ్నించేతత్వాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఎంతో మంది కమ్యూనిస్టు యోధులు ఎర్రజెండా కోసం ప్రాణ త్యాగాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి జుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ప్రొద్దుటూరు వెంకటరెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి గాడిచర్ల సత్యనారాయణ, సభ్యులు విష్ణుమూర్తి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సర్వజ్ఞ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన కళా ఉత్సవ్‌లో అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన కళా ఉత్సవంలో భాగంగా తమ పాఠశాల విద్యార్థులు స్కిట్ విభాగంలో ప్రథమ స్థానం, వాయిద్య సంగీత విభాగంలో ద్వితీయ స్థానం, శాస్త్రీయ సనాతన విభాగలో ద్వితీయ స్థానం, డ్రాయింట్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా డైరెక్టర్ నాగేంద్రకుమార్ అభినందించారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శ్రీనిధి విద్యార్థులు



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బి.అంజన్‌బాబు, సిహెచ్. చందు తెలిపారు. జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మధిర జోన్‌లో మొదటి స్థానం సాధించి ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం ఉమ్మడి జిల్లా స్థాయిలో విద్యార్థులు బి.ఉదయశ్రీ, ఎం.మౌనికలు తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎం పిక కాగా నవంబర్ 8 నుండి 10వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం జి ల్లా ఏడూళ్ళబయ్యారంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పో టీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని వారు ఆక్షించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను వీరితో పాటు వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పిడి ప్రవీణ్ కుమార్, పిఇటి కర్ష్మి అభినందించారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపు

ఎస్‌సిసి డబ్ల్యూ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య

ప్రజాపక్షం/సత్తుపల్లి: సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని లేకుంటే సమ్మెకు పిలుపునిస్తామని అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య యాజమాన్యాన్ని హెచ్చరించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి కేంద్రంగా నడుస్తున్న సింగరేణిలో కార్మికులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని తక్షణమే పరిష్కారం చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ లో చాలాకాలంగా ఉన్న డిపెండెంట్ లకు ఉద్యోగ నియామకాల పత్రాలు వెంటనే జారీ చేయాలని కోరారు. అదే విధంగా మెడికల్ బోర్డు పెట్టకుండా యాజమాన్యం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. రీజియన్ లో ఉన్న వికే కోల్ మైన్ లో సింగరేణి కార్మికుల ద్వారానే బొగ్గును వెలికి తియ్యాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, సిఅండ్ ఎండి స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఒప్పుకున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ 6న అన్ని మైన్స్, డిపార్ట్మెంట్స్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాలతో పాటు, 8న జీఎం కార్యాలయాల వద్ద జరిగే భారీ ధర్నాకు కార్మికులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేర్చి ప్రతి కార్మికుడికి 200 వందల గజాల స్థలం తో పాటు రూ.30 లక్షలు వడ్డీలేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిస్మిస్ అయిన ఉద్యోగులకు మళ్లీ ఒక అవకాశంగా ఉద్యోగాలు కల్పించాలని, సింగరేణి యాజమాన్యం ఇచ్చిన 150 మస్టర్లు చెయ్యాలనే నిబంధన సర్క్యులర్ ను వెంటనే ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిచిన నాటి నుండి కార్మికుల పక్షాన నిలబడి అనేక కార్మికుల సమస్యలు పరిష్కరించిందన్నారు.అనంతరం సత్తుపల్లికి మొట్టమొదటగా జిఎం గా పదవి బాధ్యతలు చేపట్టిన చింతలశ్రీనివాస్ ని గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, సత్తుపల్లి కార్యదర్శి సుధాకర్ సీనియర్ నాయకులు ఆదినారాయణ, బీమయ్య, సూర్యప్రకాష్, నర్సింహారావు, సుధాకర్, బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



# కిరాయి హత్యేనా.. చేసింది ఎవరు ? చేయించింది ఎవరు?

హత్య కేసులో కానరాని పురోగతి

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి పురోగతి కనిపించడం లేదు. మొత్తంగా ఇది కిరాయి హంతకుల పనేనని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రామారావును హత్య చేసిన కిరాయి హంతకులు ఎవరు...? ఎక్కడి నుంచి వచ్చారు. కిరాయి హంతకులతో మాట్లాడింది ఎవరు. ఐదు ప్రత్యేక బృందాలు వారం రోజులుగా శ్రమిస్తున్నా ఆధారాలు దొరకడం లేదు. ప్రాథమికంగా సుపారీ ఇచ్చి హత్య చేయించారన్న నిర్ధారణకు వచ్చిన చేయించింది ఎవరన్న దాని వద్దే దర్యాప్తు నిలిచిపోతుంది. జిల్లాలో దశాబ్ద కాలంగా రాజకీయ హత్యలు లేవు. ఆర్థిక లేదా అక్రమ సంబంధాల నేపథ్యంలోనే హత్యలు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం బోనకల్ మం డలం గోవిందాపురంలో ఘర్షణల నేపథ్యంలో సిపిఎం కార్యకర్త హత్యకు గురయ్యాడు. మరల ఇప్పుడు అదే మధిర నియోజక వర్గంలో సిపిఎం నాయకుడు హత్యకు గురికావడం చర్చనీయాంశమైంది. జిల్లాలో ఏ రాజకీయ నాయకుని హత్య కేసులోనూ దోషులను తేల్చడంలో ఇంత జాప్యం జరగలేదు. సహజంగా రాజకీయ హత్యలు జరిగినప్పుడు బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేయడం జరుగుతుంది. సామినేని రామారావు భార్య స్వరాజ్యం తన భర్తను ఒక గుర్తు తెలియని వ్యక్తి కత్తితో పొడుస్తున్నప్పుడు పాతర్లపాడుకు చెందిన ఐదుగురు పక్కనే ఉన్నారంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. గ్రామంలో ఎక్కడ సిసి ఫుటేజీలు లేకపోవడం, హంతకుడు అత్యంత పకడ్బందీగా వ్యవహరించడం పోలీస్ దర్యాప్తుకు సవాల్‌గా మారింది. రామారావుకు సంబంధించి ఆర్థిక, రాజకీయ, బంధుత్వ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేసినా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నది సమాచారం. కేసు



ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతుందని సిపిఎం ఆరోపిస్తుంది. నేరుగా అటు పోలీసులు, ఇటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పైన ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ మార్క్ విచారణ జరుగుతుందని సిపిఎం నాయకులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేదని పూర్తి స్థాయిలో అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతుందని వివరాలను అతి త్వరలో వెల్లడిస్తామని చెబుతున్నారు. మొత్తంగా సంచలనం సృష్టించిన ఈ హత్య కేసులో దోషులు ఎవరన్నది తేలాల్సి ఉంది.

## 51.9 కిలోల గంజాయి పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు, ఇద్దరు అరెస్ట్

ప్రజాపక్షం/భద్రాచలం : ఒడిస్సా నుండి అక్రమంగా కేరళాకు తరలించుకు పోతున్న నిషేధిత గంజాయిని పట్టణంలోని కూనవరం క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్నారు. బుధవారం అనుమానాస్పదంగా అతివేగంతో వస్తున్న కేఎల్ 08 బిఎక్స్ 48 55 నెంబర్ గల కారును ఎక్సైజ్ అధికారులు ఆపి సోదాలు చేయగా కారు ఇంజన్ ఉండే ప్రదేశంలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వాటిని స్వాదీనం చేసుకుని తూకం వేయగా 51.5 కేజీ లు ఉన్నాయి. పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 26 లక్షల వరకు ఉంటుంది. గంజాయితో పాటు కారు, మోటార్ సైకిల్‌ను స్వాదీనం చేసుకున్నా రు. ఇందులో భాగంగా కేరళాకు చెందిన జకారియా పర్యాల్, నసిర పూర్తియా వేటల్ ను అదుపులోనికి తీసుకుని అరెస్టు చేశారు. అదే విధంగా అరెస్టు అయిన వారు ఇచ్చిన సమాచారం మేరకు సూర్యపేటకు చెందిన కందుల రవి అనే వ్యకిపై కూడా కేసున మోదు చేశారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షాన్వాస్ ఖాసీం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం అసిస్టెంట్ కమీషనర్ గణేష్ తెలిపారు.



# రీల్



## 'చిరంజీవ' విజయం సాధించాలి

### డైరెక్టర్ అనిల్ రావిపూడి

రాజ్ తరుణ్ హీరోగా నటించిన ఆహా ఒరిజినల్ ఫిల్మ్ 'చిరంజీవ'. ఈ చిత్రంలో కుషిత కల్లపు హీరోయిన్‌గా నటించింది. స్ట్రీమ్ లైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మించారు. అభినయ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ నెల 7వ తేదీ నుంచి చిరంజీవ సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ సినిమా ప్రెస్ ప్రీమియర్ షో, ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ ఈ సినిమా చాల బాగుంది. ఈ సినిమా ఘన విజయాం సాధించాలి అని అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో రాకెట్ రాఘవ, జబర్దస్త్ రాంప్రసాద్, జబర్దస్త్ హైపర్ ఆది, ఆహా సీయీవో రవి కాంత్, ఆహా కంటెంట్ హెడ్ శ్రావణి, నటుడు సంజయ్ కృష్ణ, నటుడు కిరీటి, హీరో రాజ్ తరుణ్, ప్రొడ్యూసర్ రాహుల్ అవుదొడ్డి, డైరెక్టర్ అభినయ కృష్ణ పాల్గొన్నారు.



## 'శివ' రీ-రిలీజ్ ట్రైలర్ లాంచ్

అక్కినేని నాగార్జున ఆల్ టైం కల్ట్ క్లాసిక్ 'శివ'బాక్సాఫీసు రికార్డులుని తిరగరాస్తూ ఇండియన్ సినిమాను 'బిఫోర్ శివ', 'ఆఫ్టర్ శివ'గా రీడిఫైన్ చేసింది. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో1989లో విడుదలైన శివ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మాతలు అక్కినేని వెంకట్, సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఇయర్స్ సందర్భంగా శివ చిత్రాన్ని 4కె డాల్బీ ఆట్మాస్‌లో నవంబర్ 14న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ సమక్షంలో శివ రీరిలీజ్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో కింగ్ నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పాల్గొన్నారు. అద్భుతమైన 4కె విజువల్స్, డాల్బీ ఆట్మాస్ సౌండ్‌తో ట్రైలర్ అదిరిపోయింది. ప్రతి సీన్‌లో టెన్షన్, ఎమోషన్ ఆడియన్స్ ని కట్టిపడేసింది. ట్రైలర్ చివర్లో నాగర్జున సైకిల్ చైన్ లాగిన సీన్ గూస్బంప్స్ క్రియేట్ చేసింది. శివ మ్యాజిక్‌ని 4కె డాల్బీ ఆట్మాస్‌లో థియేటర్స్‌లో చూడాలనే ఎక్సయిట్మెంట్ ట్రైలర్ మరింతగా పెంచింది.

నాగార్జున మాట్లాడుతూ.. ఎంతో ప్రేమతో వచ్చిన మీ అందరికీ థాంక్యూ. ఈ సినిమాని మీ నాన్నగారు, అమ్మగారు థియేటర్స్ లో చూసుంటారు. వాళ్ళందరికీ థాంక్యూ. ఇప్పుడు అదే ప్రేమతో మీరు వచ్చారు. మీకు థాంక్యూ. అందరికంటే నా మిత్రుడు రామ్ గోపాల్ వర్మకి థాంక్యూ. 36 ఏళ్ల క్రితం నాతో శివ సినిమా తీసి నన్ను పెద్ద స్టార్‌ని చేశారు. పొద్దున్నే సినిమా చూశాను స్టన్నింగ్‌గా అనిపించింది.

రాంగోపాల్ వర్మ మాట్లాడుతూ.. అందరికీ హాయ్. 36 ఏళ్ల క్రితం తీసిన ఈ సినిమా.. 36 ఏళ్ల తర్వాత మా ఇద్దరం కూడా ఒకే స్టేజ్‌పై ఇలా మీ ముందు రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ చేస్తూ మాట్లడతామని నేను ఎప్పుడూ కూడా ఊహించలేదు. ఇది వెరీ గ్రేట్ ఫీలింగ్. కొత్త టెక్నాలజీని ఉపయోగించాం. మీకు చాలా మంచి ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. చిరంజీవి చెప్పినట్టు సినిమా ఉన్నంతవరకు శివ చిరంజీవిలా చిరస్మరణీయం.



## 'రాంబాయి నీ మీదనాకు' పాట ఆవిష్కరణ

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు ఈ సినిమా నుంచి 'రాంబాయి నీ మీద నాకు...అనే పాటను మంచు మనోజ్, భూమా మౌనిక చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ ఈటీవీ విన్ వారు చేస్తున్న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాకు అన్ని పాటలు రాయడం సంతోషంగా ఉంది. ఇది నిజంగా జరిగిన కథ. ఈ కథ గురించి తెలుసుకున్న తర్వాత రాజు.. రాంబాయి గురించి ఎలా పాట పాడతాడో రాజు పాత్రలా ఊహించి రాశాను అన్నారు.

ఈ కార్యక్రమంలో ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి, డైరెక్టర్ సాయిలు కంపాటి, హీరోయిన్ తేజస్వినీ రావ్, హీరో అఖిల్ ఉడ్డెమారి, నిర్మాత రాహుల్ మోపిదేవి, గాయకుడు నల్లగొండ నర్సన్న, మంచు మనోజ్ భార్య భూమా మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## 'రోలుగుంట సూరి' పాట విడుదల



టాలీవుడ్లో హాట్ టాపిక్‌గా మారుతూ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామా 'రోలుగుంట సూరి'. ఈ మూవీ ఫస్ట్ సాంగ్‌ను ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ లాంగ్ చేశాడు. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరోహీరోయిన్లుగా తపస్వీ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మిస్తున్నారు. ఫస్ట్ సాంగ్‌ను ఆవిష్కరించిన అనంతరం మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ మంచి పాటలు ఉంటే ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి హిట్ చేస్తారు. కథతో పాటు మ్యూజిక్ కూడా బాగుంటే సినిమా బ్లాక్ బస్టర్ అయినట్టే. 'రోలుగుంట సూరి' కూడా అలాంటి సినిమా. తెలుగు ప్రేక్షకులకు బాగ నచ్చే కథతో పాటు దానికి తగ్గట్టే మ్యూజిక్ కూడా ఉంది. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందన్న నమ్మకం ఉంది. చిత్రయూనిట్‌కు అభినందనలు అని అన్నారు.



## 'పెద్ది'లో చికిరి చికిరి ప్రోమో రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తాజా చిత్రం 'పెద్ది' షూటింగ్లో బిజీగా ఉన్నారు. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ సినిమాలో అత్యంత కీలమైన పాటగా భావిస్తున్న 'చికిరి చికిరి' ప్రోమోను రిలీజ్ చేశారు. నవంబర్ 7న విడుదల కాబోతున్న 'చికిరి చికిరి' లిరికల్ వీడియో కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కాన్సెప్ట్ వీడియోతోనే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిపోయింది. రెహమాన్ సంగీతం, చరణ్ స్టెప్స్, బుచ్చిబాబు మార్క్‌తో ఈ ఆల్బమ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## 'డీయస్ ఈరే' తెలుగు ట్రైలర్ విడుదల



ప్రణవ్ మోహన్ లాల్ కథానాయకుడిగా నటించిన సినిమా 'డీయస్ ఈరే'. మిస్టరీ హారర్ థ్రిల్లర్గా రూపొందింది. 'భూత కాలం', 'భ్రమ యుగం' ఫేమ్ రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ సంస్థలపై చక్రవర్తి రామచంద్ర, ఎస్ శశికాంత్ నిర్మించారు. తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేస్తోంది. మలయాళంలో అక్టోబర్ 31న 'డీయస్ ఈరే' విడుదలైంది. నవంబర్ 7న పెయిడ్ ప్రీమియర్లతో తెలుగు వెర్షన్ విడుదల చేస్తున్నారు. నవంబర్ 8న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సినిమా విడుదల కానుంది. 'డీయస్ ఈరే' తెలుగు ట్రైలర్ విడుదల చేశారు.



## 'జిగ్రీస్'లో మీరేలే పాట ఆవిష్కరణ

కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ నిర్మిస్తున్న యూత్ఫుల్ క్రేజీ ఎంటర్టైనర్ జిగ్రీస్. హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తాజాగా మీరేలే సాంగ్ లాంచ్ చేశారు.సయ్యద్ కమ్రాన్ ఈ సాంగ్ ని ఫ్రెండ్ షిప్ మెలోడీగా కంపోజ్ చేశారు. హరీష్ రెడ్డి ఉప్పుల రాసిన సాహిత్యం ఫ్రెండ్స్ మధ్య ఎమోషన్ ప్రజెంట్ చేసేలా ఉంది. ఏక్నాథ్ వోకల్స్ సాంగ్‌ని మరింత టచ్చింగ్ గా మార్చింది. జిగ్రీస్ ఫ్రెండ్షిప్, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్టైనర్గా ఉండబోతోందిఈ చిత్రానికి . ఈశ్వరాదిత్య డీవోపీ, కమ్రాన్ మ్యూజిక్, చాణక్య రెడ్డి ఎడిటర్.జిగ్రీస్ నవంబర్ 14న విడుదల కానుంది

## ఆ క్యారెక్టర్‌లో ఎమోషన్స్ ఉంటాయి




సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో శిల్పా శిరోధ్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత ప్రేరణ అరోరా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నేను హిందీలో సినిమాలో చేస్తున్నప్పటికీ తెలుగు సినిమా అంటే నాకు చాలా స్ఫూర్తి. రామ్ చరణ్ ఆరెంజ్ సినిమా చూశాను. అప్పటి నుంచి నాకు తెలుగు సినిమా పట్ల చాలా ఇష్టం ఏర్పడింది. తెలుగు సినిమాలు చాలా అద్భుతంగా ఉంటాయి. కమర్షియల్, మాస్, హ్యాపీ, ఫ్యామిలీ అన్ని ఎమోషన్స్‌తో సినిమాలు వస్తుంటాయి. తెలుగు సినిమా చాలా గొప్ప సినిమాలని ఇండియన్ సినిమాకి అందించింది. ఐశ్వర్య రజనీకాంత్‌తో నేను ఒక సాంగ్‌కి వర్క్ చేశాను. సౌత్‌లో అది నా ఫస్ట్ అనుభవం. అప్పుడే రామోజీ ఫిలింసిటీని విజిట్ చేశాను. తర్వాత సుధీర్ బాబు ద్వారా వెంకట్ అభిషేక్‌ని కలిశాను. అప్పుడు జటాధర కథ చెప్పారు. జటాధర చాలా అద్భుతమైన సబ్జెక్టు. ఇందులో ఫ్యామిలీ, ఎమోషన్స్, సూపర్ నేచురల్, మైథలాజికల్ అన్ని ఎలిమెంట్స్ అద్భుతంగా బ్లెండ్ అయ్యాయి. ఇది పాన్ ఇండియా కంటెంట్. అందుకే హిందీలో కూడా ఈ సినిమాని చేయాలనుకున్నాం. అలా తెలుగు, హిందీలో రెండు భాషల్లోనూ ఈ సినిమాని చేయడం జరిగింది. ఈ సినిమాలో డివైన్ ఎలిమెంట్స్ బ్లాక్ మ్యాజిక్ లాంటి ఎక్సైటింగ్ ఎలిమెంట్స్ వున్నాయి. శిల్ప శిరోద్కర్ బిగ్ బాస్ లోకివెళ్లే సమయంలో కలిసాను. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ క్యారెక్టర్ గురించి చెప్పాను. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలోచాలా స్పెషల్‌గా ఉండబోతుంది. ఆ క్యారెక్టర్‌లో చాలా ఎమోషన్స్ ఉంటాయి. కచ్చితంగా సీక్వెల్ లా ఫ్రీక్వెలా అని చెప్పలేము గాని ఈ సినిమాకి కొనసాగింపుగా ఇంకో సినిమా అయితే ఉంటుంది. మేము మరో తెలుగు సినిమా కూడా మేము చేయబోతున్నాం. పెద్ద హీరోతో ఆ సినిమా చేస్తున్నాం. త్వరలోనే ఆ సినిమా వివరాలు కూడా తెలియజేస్తాం.


# సొంత ఇంటి కలను నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకం

### రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/రంగారెడ్డి: ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని చేపట్టి, అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గంలో మంఖాల్ పేజ్ ఒకటి,రెండులో భాగంగా నిర్మించి 2,848 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు లబ్ధిదారులకు అలాట్మెంట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో కోర్టు కేసు ఉండటం వలన మంఖాల్I, మంఖాల్ II డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం ఆగిపోయిందని, కోర్టులో కేసు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చొరవ తీసుకొవడం జరిగిందని చెప్పారు. అందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న 2,848 మందికి డబల్ బెడ్ రూమ్ ఇళ్లను బుధవారం అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. దీంతో నిజమైన ఇల్లు లేని నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేర్చే ఉద్దేశంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించడం జరుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మీకు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం మాజీ ఎంఎల్ఎ, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి కిచన్నగారి లక్ష్మరెడ్డి(కెఎల్ఆర్) మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి యే కాంగ్రెస్ పార్టీ అసలు లక్ష్యం అన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు అందించడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ నియోజకవర్గం ప్రజల కోసం సమయం కేటాయించి, ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కందుకూర ఆర్డిఓ కె.జగదీశ్వర్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా హౌసింగ్ శాఖఅధికారులు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## వరల్డ్ ట్రావెల్ మార్కెట్‌లో తెలంగాణ టూరిజం స్టాల్

### లండన్‌లో టిజిటిడిఎస్ అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన ట్రావెల్, టూరిజం కార్యక్రమం అయిన వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటిఎం) ఎక్సెల్ లండన్‌లో అధికారికంగా బుధవారం ప్రారంభమైంది. అత్యంత పెద్దదైన ఈ కార్యక్రమం 'మారుతున్న ప్రపంచంలో ప్రయాణాన్ని పునఃసృష్టిస్తోంది' అనే థీమ్‌ను విడుదల చేసింది. 2025 ఎడిషన్ పెరిగిన ఫ్లోర్ స్పేస్, రికార్డు సంఖ్యలో ఎగ్జిబిటర్లను కలిగి ఉంది. డబ్ల్యూటిఎంలో తెలంగాణ టూరిజం శాఖ అధికారులు తమ స్టాల్‌ని లండన్‌లోని ఇండియా డిప్యూటీ కమీషనర్ కార్తీక్ పాండే ప్రారంభించారు. అంతర్జాతీయ పర్యాటక భవిష్యత్తు కోసం అజెండాను రూపొందించడానికి డబ్ల్యూటిఎం ఒక ముఖ్యమైన వేదిక. 24 ముఖ్యమైన సంస్థ ప్రతినిధులు తెలంగాణ టూరిజం తో కలిసి పని చెయ్యటానికి ఆసక్తి చూపుతున్నారు.వారిలో ముఖ్యమైన ట్రావెల్ మీడియా ప్రతినిధులు,టూర్ ఆపరేటర్స్,మెడికల్ టూరిజం సంస్థలు పాల్గొన్నాయి.ప్రత్యేక టూరిజం కార్యక్రమాలు అయిన కలినరీ,హాట్ ఎయిర్ బలూన్ మొదలైన సంప్రదింపులు జరిగాయి.తెలంగాణ లో అమలవుతున్న నూతన పర్యాటక విధానాన్ని పలువురు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్,తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, టూరిజం కన్సల్టెంట్స్ దిల్లేశ్వరి, ఫరాజ్ పాల్గొన్నారు.



## బిసి రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడికి సహకరించండి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు ఒయు బిసి జెఎసి ప్రతినిధుల విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడితీసుకువచ్చేందుకు సహకరించాలని ఒయు బిసి జెఎసి ప్రతినిధులు సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కోరారు. ఈ మేరకు ఒయు బిసి జెఎసి ప్రతినిధులు నిజ్జన రమేష్ ముదిరాజ్, దేశగాని సాంబశివ గౌడ్, లింగ స్వామి, శివరాత్రి ప్రశాంత్, రెడ్డి శ్రీనివాస్, నక్క శ్రీశైలం యాదవ్, ఆర్.ఎన్. శంకర్ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో తీవ్ర అన్యాయం జరిగిందని, రాజకీయ ప్రాతి నిధ్యం లేక చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించే బాధ్యత అధికారంలో ఉన్న పాలకులపైనే ఉన్నదన్నారు. బిసి రిజర్వేషన్ల అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలలో రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

## కేంద్రం యత్నం

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసు కండిషన్‌లపై కార్యనిర్వాహకవర్గానికి విస్తృత అధికారాలను ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తమైంది. ఈ కేసు ధర్మాసనం ఎదుట పిటిషనర్లు తమ వాదనలు పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వం అభ్యర్థన చేసిన సమయం అందరినీ అశ్చర్యపరిచింది. విస్తృత ధర్మాసనాన్ని కోరడం ద్వారా ఇష్టం లేని తీర్పు రాకుండా లేదా జాప్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో కేసును తప్పించుకునే ఎత్తుగడలకు పాల్పడుతున్నారని ప్రధాన న్యాయమూర్తి గవాయ్ కోర్టులో బహిరంగంగానే వ్యాఖ్యలు చేయడం ద్వారా అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు వారాలకు ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కేంద్రం అలా అభ్యర్థించడం ద్వారా ఆలస్యం చేయడం లేదా ఆశించని తీర్పు రాకుండా ఉండడమేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇలా బహిరంగంగా వ్యాఖ్యలు వ్యక్తమవడం మొదటిసారి కాదు. 2018 జనవరిలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు చలమేశ్వర్, రంజన్ గొగొయ్, మదన్ బి.లోకూర్, కురియన్ జోసఫ్‌లు అసాధారణ రీతిలో పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసి నాటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఏకపక్షంగా కేసులను కేటాయించడంపై బహిరంగంగా నిరసన వ్యక్తం చేశారు.

## ప్రయాణికులపైకి ట్రైన్

(మొదటి పేజీ తరువాయి)

చెందారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగ్రాతులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో మీర్జాపూర్‌కు చెందిన సవిత(28), సాధన(16), శివకుమారి (12), అప్పుదేవి(20) సుశీలా దేవి(60), జానవా దేవి (60)గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వీరి మృతదేహాలను శవపరీక్షలు నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ దుర్ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

### 11కు చేరిన ఛత్తీస్‌గఢ్ రైలు ప్రమాదం మృతుల సంఖ్య

మరోవైపు మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 11కు చేరింది. గాయపడ్డ మరో 20 మందికి సమీప ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో లోకోపైలట్ కూడా ఉన్నారు. గటోరా—బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్యలో ఉన్న లాల్‌ఖండ్ గ్రామ సమీపంలో సాయంత్రం 4 గంటలకు సరకు రవాణా రైలును వెనుక నుంచి ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ధాటికి ప్యాసింజరు రైలు బోగి ఒకటి గూడ్సు రైలు వ్యాగన్‌పైకి ఎక్కింది. వెంటనే అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం, రైల్వే యంత్రాంగం ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టాయి. దెబ్బతిన్న రైల్ కోచ్‌ల్లో చిక్కుకున్నవారిని రక్షించాయి. క్షత గాత్రులను వేగంగా సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఆ మార్గంలో వెళ్లే రైళ్లకు పూర్తి అంతరాయం కలిగింది. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5లక్షల చొప్పున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున రైల్వే శాఖ పరిహారం ప్రకటించింది. ప్రమాద ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. అయితే ప్రయాణికుల రైలు రెడ్ సిగ్నల్‌ను దాటి ముందుకు వెళ్లడంతోనే ఈ దుర్ఘటన జరిగినట్లు రైల్వే బోర్డు ప్రాథమికంగా అంచనా వేసింది. లోకోపైలట్ రెడ్ సిగ్నల్‌ను గమనించకుండా రైలును ముందుకు నడిపి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో గంటకు 60 నుంచి 70 కి.మీ. వేగంతో ప్యాసింజరు రైలు వెళ్లి ఉంటుందని అధికారులు అంటున్నారు.



## కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావం

(మొదటి పేజీ తరువాయి)

తృతీయస్థాయి నాయకుడుగా వ్యవహరిస్తారు. ఈ తీర్మానాన్ని మహింద్ర రాయ యాదవ్ సభలో ప్రవేశపెట్టగా, పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలుత దహల్, మాధవ్‌కుమార్‌లు సంయుక్తంగా ఒక బటన్‌ను నొక్కి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జన్ జడ్ నిరసనల పర్యవసానంగా 2025 సెప్టెంబరు 9న రాజీనామా చేసిన ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి నాయకత్వంలోని నేపాల్ కమ్యూనిస్టుపార్టీ (యూనిఫైడ్ ఎం.ఎల్) ఈ కొత్త కమ్యూనిస్టు బృందంలో లేకపోవడం గమనించదగింది. గతంలో దశాబ్దకాలంపాటు సాయుధ పోరాటం చేసిన ప్రచండకు చెందిన పార్టీ తన పేరులోని 'మావోయిస్టు' అనే అధికారిక పదాన్నిమొదటిసారిగా ఉపయోగించకుండా పక్కనపెట్టేసింది. ఈ కొత్త పార్టీ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగం పంచుకుంటుంది. మావోయిస్టు సెంటర్, యూనిఫైడ్ సోషలిస్టుపార్టీలతోపాటు చీలిపోయిన ఇతర కమ్యూనిస్టుపార్టీలు నేపాల్ సమాజ్‌వాదీ, సిపిఎన్ (సోషలిస్టు), జనసమాజ్‌వాదీపార్టీ నేపాల్, నేపాల్ కమ్యూనిస్టుపార్టీ, సిపిఎన్ (మావోయిస్టు సోషలిస్టు), సిపిఎన్ సమ్యబాది, గోపాల్ కిరితి నాయకత్వంలోని దేశ్‌భక్త సమాజ్‌వాదీ మోర్చాకూడా ఈ కొత్త యూనిఫైడ్ నేపాల్ కమ్యూనిస్టుపార్టీలో విలీనమయ్యాయి. ఐతే ఈ విలీన ప్రక్రియపై అంతర్గతంగా అసమ్మతి కూడా ప్రబలింది. మావోయిస్టు సెంటర్‌లో జనార్దన్‌శర్మ నాయకత్వంలోని ఒక వర్గం ఈ విలీన ప్రక్రియను వ్యతిరేకించింది. ఇదిలా ఉండగా, ప్రచండ ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుఎంఎల్ మాజీ నాయకుడు భీమ్ రావల్‌తోపాటు ఇతర అనేక వామపక్షాల నాయకులను కూడా ఈ సరికొత్త వ్యవస్థలోకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన చర్చలు తుదిదశలో ఉన్నట్లు చెప్పారు. 2026 మార్చి 5వ తేదీన నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని తాత్కాలిక ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రకటన చేసింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ తొమ్మిది వామపక్షాల విలీనం నేపాల్‌లో ప్రాధాన్యం సంతరించుకుంది. రాజధాని కఠ్మండులోని భృకుటి మండప్‌లో జరిగిన సమావేశం అనంతరం కమ్యూనిస్టుపార్టీ నాయకులు బుధవారం ఈ ప్రకటన చేశారు. త్వరలోనే ఈ తొమ్మిదిపార్టీల విలీన కార్యక్రమం లాంఛనంగా జరుగుతుంది. ఈ విలీన కార్యక్రమం సందర్భంగా బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహిస్తారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com